# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 1 ఆగస్టు 2025 | సంపుటి: 9 | సంచిక: 214 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## హైడ్రా కృషికి అభినందన



బతుకమ్మ కుంటను సందర్శించిన కేంద్ర బృందం

2

## ఆమె నవ్వుకు రూ.16.5 కోట్లు



2



## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

# పీసీసీ విజయం

### ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్

### పరిగి నుంచి ప్రారంభమైన కాంగ్రెస్ జనహిత పాదయాత్ర

**హైదరాబాద్, జూలై 31, (మనం బ్యూరో):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పీసీసీ విజయమని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. అయితే, బీసీలకు రాజ్యాధికారం కల్పించడం కేంద్ర ప్రభుత్వానికి ఇష్టం లేదని అందుకే ఈ బిల్లును ఆమోదించకుండా తొక్కిపెడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ జనహిత పాదయాత్ర గురువారం పరిగి నియోజకవర్గం నుంచి ప్రారంభమైంది. ఈ పాదయాత్రలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ మన హక్కుల కోసం కదం తొక్కాలి. కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈనెల 6న ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర నిర్వహించే భారీ ధర్నాకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ...మిగతా 2లో



## మూడు నెలల్లో నిర్ణయం

# తీసుకోవాలె

### పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీం కోర్టు తీర్పు



- అసెంబ్లీ స్పీకర్‌కు కాలపరిమితి విధించిన సర్వోన్నత న్యాయస్థానం
- జాగు చేసే ఎత్తుగడలు మంచివి కావు
- జాతీయ స్థాయి చర్చనీయాంశంగా రాజకీయ ఫిరాయింపులు
- మేము జోక్యం చేసుకునే వరకూ స్పీకర్ నోటీసులివ్వకపోవడం సమంజసం కాదు

**హైదరాబాద్, జూలై 31, (మనం బ్యూరో):** తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. అనర్హత పిటిషన్లపై తీర్పు వెలువడిన 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సిందేనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలంగాణ శాసనసభ స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేసింది. గతంలో తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టేసింది. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, వివేకానంద, జగదీశ్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్‌తో పాటు బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి వేర్వేరుగా సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఏడాది జనవరి 15న దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీం కోర్టులో తొమ్మిదిసార్లు విచారణకు వచ్చాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్‌తో కూడిన ధర్మాసనం అన్ని పక్షాల వాదనలు విన్న తరువాత ఏప్రిల్ 3న తీర్పును రిజర్వ్ చేసింది. ఇందులో ప్రతివాదులుగా తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఎమ్మెల్యేలు ...మిగతా 2లో

### న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంట

'సుప్రీం' తీర్పుపై స్పీకర్ ప్రసాద్ కుమార్



ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ స్పందించారు. తనకు మూడు నెలల గడువు విధించడంపై న్యాయ నిపుణులతో చర్చించాకే నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ధన్‌ఖడ్ వ్యాఖ్యల ప్రస్తావన తెచ్చారు. సుప్రీం కోర్టు తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చిస్తా. మాజీ ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ ఏం మాట్లాడారో అందరూ చూశారు. వాటిని మేము కూడా పరిశీలిస్తున్నాం. గతంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు నోటీసులిచ్చాం. సుప్రీం కోర్టు తీర్పును పరిశీలించాకే అన్ని వివరాలు త్వరలో చెప్తానని ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వ్యాఖ్యానించారు.



**తీర్పును స్వాగతిస్తున్నం**
ప్రభుత్వ విప్ ఆది

**సుప్రీం ప్రజాస్వామ్యాన్ని కాపాడింది**
ఉప ఎన్నికలకు సిద్ధంకండి: కేటీఆర్



**మంచి పరిణామం**
రామచందర్‌రావు



## కొత్త రేషన్ కార్డులు

### హైదరాబాద్ జిల్లాలో నేటి నుంచి పంపిణీ

**లక్డీకాపూల్, మనం న్యూస్:** హైదరాబాద్ జిల్లాలో నూతన రేషన్‌కార్డుల పంపిణీ ఆగస్టు 1 నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. 55,378 నూతన ఫుడ్ సెక్యూరిటీ కార్డులు(రేషన్ కార్డులు) ముందుగా ఖైరతాబాద్, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పంపిణీ చేపట్టనున్నారు. ఇప్పటికే ఉన్న 1,37,947 పాత కార్డులలో అర్హులను చేర్చడంతో 2,32,297 మందికి లబ్ది కలుగనుండగా.. నూతన కార్డులతో అదనంగా 2,01,116 మంది లబ్ది పొందనున్నారు.



సిగాచీ ఫైర్ యాక్సిడెంట్..

### ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్, జూలై 31:** సిగాచీ పరిశ్రమలో పేలుడు ఘటనపై హైకోర్టులో పిల్ దాఖలైంది. కె.బాబురావు అనే వ్యక్తి ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. సిగాచీ యాజమాన్యం సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే పేలుడు జరిగిందని పిటిషన్లో పేర్కొన్నారు. ఈ ఘటనలో 54 మంది మృతి ...మిగతా 2లో

## సర్కారుకు కాళేశ్వరం నివేదిక

### 650 పేజీల కమిషన్ నివేదికను రాహుల్ బొజ్జాకు అందించిన జస్టిస్ పీసీ ఘోష్



- ఆ వెంటనే ప్రధాన కార్యదర్శికి చేరిన నివేదిక
- దీని ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకోనున్న ప్రభుత్వం

**హైదరాబాద్, జూలై 31, (మనం బ్యూరో):** కాళేశ్వరం కమిషన్ తెలంగాణ ప్రభుత్వానికి తుది నివేదిక సమర్పించింది. ఈ మేరకు కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ గురువారం ఇక్కడి బీఆర్కే భవన్‌లోని తన కార్యాలయంలో సాగునీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జాకు 650 పేజీలతో కూడిన తుది నివేదికను రెండు సీల్డ్ కవర్లలో అందజేశారు. ఆ వెంటనే ఆయన రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు అందజేశారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం కాళేశ్వరం అవకతవకలకు బాధ్యులపై చర్యలు తీసుకోనుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బరాజ్‌ల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ కోసం ...మిగతా 2లో

## ఎన్సీడీసీకి రూ.2 వేల కోట్లు

ఆర్థిక సాయానికి ఓకే చెప్పిన కేంద్ర కేబినెట్ నిర్ణయం

దేశవ్యాప్తంగా 8.25 లక్షల సహకార సంఘ సభ్యులకు ప్రయోజనం!

2

## ఉప ఎన్నికలొస్తయా?

### ముఖ్య నేతలతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భేటీ



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ ముఖ్య నేతలతో గురువారం నాడు అత్యవసరగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు కేటీఆర్, హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ...మిగతా 2లో

## నిందితులందరూ నిర్దోషులే

- 2008 నాటి మాలేగావ్ పేలుళ్ల కేసులో ప్రత్యేక కోర్టు తీర్పు
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని ఆదేశం
- నా 17 ఏండ్ల జీవితం నాశనమైందన్న ప్రధాన నిందితురాలు ప్రజ్ఞా ఠాకూర్





**ముంబై, జూలై 31:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ పేలుడు కేసులో ముంబయిలోని ప్రత్యేక కోర్టు నేడు తీర్పు వెలువరించింది. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్, లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్ సహా మొత్తం ఏడుగురు నిందితులను ఎన్ఐఏ కోర్టు నిర్దోషులుగా తేల్చింది. ఈ మేరకు గురువారం తీర్పు వెలువరించింది. ఈ కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వాదనలో చాలా లోటుపాట్లు ఉన్నాయని కోర్టు తెలిపింది. 'ఈ కేసుకు ఉపా (చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక) చట్టం వర్తించదు. ఈ పేలుడు కోసం వాడిన మోటార్ ...మిగతా 2లో

## నిందితులంతా నిర్దోషులే ఐతే.. ఆ ఆరుగురిని ఎవరు చంపినట్టు?

### మాలేగావ్ పేలుళ్ల కేసు తీర్పుపై అసదుద్దీన్

ఈ తీర్పుపై ఫడ్నవీస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేస్తుందా? అని ప్రశ్న

17 ఏళ్ల తర్వాత తీర్పు వెలువరించిన ఎన్ఐఏ కోర్టు

2



## నిన్న సుంకాలు..

# నేడు ఆంక్షలు

### భారత్‌పై అమెరికా మరో ఆర్థిక దాడి

### భారత చమురు కంపెనీలపై ఆంక్షలు విధించిన ట్రంప్

**న్యూయార్క్, జూలై 31:** మన దేశం నుంచి దిగుమతి చేసుకుంటున్న సరుకులపై నిన్న 25 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నేడు మన చమురు కంపెనీలపై ఆంక్షలు విధించారు. ఇరాన్ నుంచి పెట్రోలియం ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారన్న అభియోగాలపై ప్రపంచవ్యాప్తంగా 20 సంస్థలపై అగ్రరాజ్యం చర్యలు చేపట్టింది. ఇందులో భారత్ కు చెందిన ఆరు కంపెనీలున్నాయి. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ తాజాగా ప్రకటన విడుదల చేసింది. 'చమురు విక్రయాలతో నిధులు సమకూర్చుకొని మధ్య ప్రాచ్యంలో సంఘర్షణలు, అస్థిరతకు ఇరాన్ ఆజ్యం పోస్తోంది. సొంత దేశ ప్రజలతో పాటు, ప్రపంచాన్ని అణచివేసేందుకు ఉగ్రమూకలకు ఆర్థిక మద్దతు కల్పిస్తోంది. అందుకే టెహ్రాన్‌పై ఆర్థికఒత్తిడి తెచ్చేందుకు మేము కఠిన చర్యలు చేపట్టాం. ఇరాన్ నుంచి పెట్రోలియం, పెట్రోకెమికల్ ఉత్పత్తుల వాణిజ్యంలో భాగస్వాములైన 20 కంపెనీలపై ...మిగతా 2లో

## అధ్యయనం చేస్తం.. చర్యలు తీసుకుంటం

### ట్రంప్ సుంకాల మోతపై పార్లమెంటులో పీయూష్ గోయల్ ప్రకటన



**ఢిల్లీ, జూలై 31:** మన వస్తువుల దిగుమతులపై అమెరికా విధించిన సుంకాలు, పెనాల్టీలపై కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పార్లమెంటు ఉభయ సభల్లో ప్రకటన చేశారు. సుంకాల ప్రభావాలపై అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడించారు. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పదేండ్లలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా భారత్ పయనిస్తోందన్న అంశాన్ని గుర్తుచేశారు. 'ఏప్రిల్ 2న ...మిగతా 2లో

## రోహింగ్యాలు శరణార్థులా? చొరబాటుదారులా?

ఈ అంశంపై స్పష్టత వస్తేనే సమస్యలు పరిష్కరించగలం

**ఢిల్లీ, జూలై 31:** రోహింగ్యాల వ్యవహారంపై సుప్రీం కోర్టు వ్యాఖ్యలు చేసింది. అసలు వాళ్లు శరణార్థులా, చొరబాటుదారులా అనేదే పెద్ద సమస్య.. ఈ అంశంపై స్పష్టత వస్తే ఇతర సమస్యలు తేలికగా పరిష్కారమవుతాయని పేర్కొంది. రోహింగ్యాల విషయంలో దాఖలైన పలు పిటిషన్లను విచారించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కోటీశ్వర్ సింగ్ లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 'శరణార్థులా లేదా చొరబాటుదారులా అనేదే ప్రధాన సమస్య. శరణార్థులుగా ప్రకటించేందుకు వారు అర్హులు కాదా? అలా ఐతే, వారికి ఎలాంటి రక్షణలు, హక్కులు ఉంటాయి? ఇక రెండో అంశం.. శరణార్థులు ...మిగతా 2లో

# ఆమె నవ్వుకు రూ.16.5 కోట్లు!

బ్రిటిష్: బ్రిటిష్ నటి, సింగర్ సింథియా ఎరివో తన నోటికి బీమా చేయించుకున్నారు. ఎంతో ఇష్టమైన తన నవ్వుకోసం ఏకంగా రూ.16.5 కోట్లు ఖర్చుపెట్టారు. మీడియా కథనాల ప్రకారం.. మౌత్ వాష్ బ్రాండ్ లిస్టెరిన్ నిర్వహిస్తోన్న 'వాష్ యువర్ మౌత్' కార్యక్రమానికి ఈమె ప్రచారకర్తగా ఉన్నారు. తన నవ్వు, గొంతుకు ఉన్న ప్రత్యేకత కారణంగానే వృత్తి, వ్యక్తిగత జీవితంలో రాణిస్తున్నానని ప్రకటించిన ఆమె దానికే అత్యంత ప్రాధాన్యతనిస్తాను కాబట్టి అంత భారీ మొత్తానికి బీమా చేయించుకున్నట్లు ప్రకటించింది. తన రెండు దంతాల మధ్య ఉన్న గ్యాప్ ను, తన విలక్షణ నవ్వు, గళాన్ని కాపాడుకునేందుకే ఈ ఇన్సూరెన్స్ ఉపకరిస్తుందని చెప్పుకున్నారు ఎరివో.

# నిందితులందరూ నిర్దోషులే

(మొదటి పేజీ తరువాయి)

బైక్ మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ పేరు మీద రిజిస్టర్ అయిందని ప్రాసిక్యూషన్ చేసిన వాదనకు తగిన సాక్ష్యాధారాలు లేవు. ఆ బైక్ కు అమర్చిన బాంబు వల్లే పేలుడు సంభవించిందని చెప్పేందుకు కూడా ఆధారాల్లేవ్. ఉగ్రవాదానికి మతం లేదు. ఎందుకంటే ఏ మతం కూడా హింసను ప్రోత్సహించదు. కానీ, కేవలం ఊహాగానాలు, నైతిక ఆధారాలతో ఎవరినీ కోర్టులు శిక్షించవు. బెనిఫిట్ ఆఫ్ డౌట్ మినహా ఈ కేసులో ఎలాంటి బలమైన ఆధారాల్లేవు' అని తీర్పులో కోర్టు వెల్లడించింది.

ఈ కేసులో ఆరుగురు మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. క్షతగాత్రులకు రూ.50వేల ఆర్థికసాయం ఇవ్వాలని సూచించింది.

**నన్ను బాధ పెట్టిన వారిని దేవుడే శిక్షిస్తాడు..**

తీర్పుపై మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ హర్షం వ్యక్తంచేశారు. ఈ కేసు కారణంగా గత 17 ఏళ్ల పాటు తన జీవితం నాశనం అయ్యిందన్నారు. తనను బాధ పెట్టిన వారిని దేవుడే శిక్షిస్తారని అన్నారు. మరోవైపు, ఈ తీర్పును తాము హైకోర్టులో సవాల్ చేయనున్నట్లు బాధిత కుటుంబాలు వెల్లడించాయి.

**ఏమిటీ పేలుళ్లు..?**

మహారాష్ట్ర లోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబరు 29న పేలుడు సంభవించింది. ఓ మసీదు సమీపంలో మోటార్ సైకిల్ కు అమర్చిన బాంబు పేలడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికి పైగా గాయపడ్డారు. అప్పట్లో ఈ కేసు పెను సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై ప్రజ్ఞా ఠాకూర్, పురోహిత్తో పాటు రమేశ్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్కార్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి ప్రధాన నిందితులుగా కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను స్వీకరించిన ఎన్ఐఏ 220 మంది సాక్షులను విచారించి కోర్టుకు రిపోర్టు సమర్పించింది.



# నిన్న సుంకాలు.. నేడు ఆంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఆంక్షలు విధిస్తున్నాం' అని అగ్రరాజ్యం ఒక ప్రకటన చేసింది. భారత్ తో పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, తుర్కియే, ఇండోనేషియా దేశాలకు చెందిన కంపెనీలపైనా ఈ ఆంక్షలు విధించింది.

**ఆంక్షలు పడిన భారత కంపెనీలు ఇవే..**

**కాంచన్ పాలిమర్స్:** 2024 ఫిబ్రవరి నుంచి జులై మధ్య 1.3 మిలియన్ డాలర్ల విలువైన ఇరాన్ పాలిథీన్, పెట్రోకెమికల్ ఉత్పత్తులను యూఏఈ మధ్యవర్తిత్వ కంపెనీ నుంచి కొనుగోలు, దిగుమతి చేసుకున్నట్లు అమెరికా ఆరోపించింది.

**ఆల్కెమికల్ సొల్యూషన్స్:** ఇది పెట్రోకెమికల్ ట్రేడింగ్ కంపెనీ. 2024 జనవరి నుంచి డిసెంబర్ వరకు ఇరాన్ నుంచి 84 మిలియన్ డాలర్ల విలువైన పెట్రోకెమికల్ ఉత్పత్తులను దిగుమతి చేసినట్లు అమెరికా తన అభియోగాల్లో పేర్కొంది.

**రమణిక్లాల్ ఎస్ గోసాలియా అండ్ కంపెనీ:** 2024 జనవరి నుంచి 2025 జనవరి వరకు 22 మిలియన్ డాలర్ల విలువైన మిథనాల్, టోల్యూన్, పెట్రోకెమికల్ ఉత్పత్తులను కొనుగోలు, దిగుమతి చేసుకున్నట్లు అగ్రరాజ్యం ఆరోపించింది.

**జుపిటర్ డై కెమ్ ప్రైవేట్ లిమిటెడ్:** 2024-25లో 49 మిలియన్ డాలర్లకు పైగా విలువైన ఇరాన్ ఉత్పత్తులను దిగుమతి చేసినట్లు అభియోగాల్లో పేర్కొంది.

**గ్లోబల్ ఇండస్ట్రియల్ కెమికల్స్ లిమిటెడ్:** గతేడాది కాలంలో 51 మిలియన్ డాలర్ల విలువైన పెట్రోకెమికల్స్ను ఇరాన్ నుంచి కొన్నట్లు యూఎస్ ఆరోపించింది.

**పర్సిస్టెంట్ పెట్రోకెమ్ ప్రైవేట్ లిమిటెడ్:** గతేడాది 14 మిలియన్ డాలర్ల విలువైన మిథనాల్తో సహా ఇరాన్ పెట్రో కెమికల్స్ను కొనుగోలు చేసినట్లు అమెరికా తమ అభియోగాల్లో వెల్లడించింది.

ఈ కంపెనీలన్నీ ఉద్దేశపూర్వకంగానే ఇరాన్ తో వాణిజ్యంలో భాగస్వాములయ్యాయని వాషింగ్టన్ తెలిపింది. ఆంక్షలు విధించడంతో ఇప్పుడు ఆయా కంపెనీలు, వ్యక్తులకు అమెరికాలో ఆస్తులు ఉంటే వాటిని ఫ్రీజ్ చేస్తారు.

# అధ్యయనం చేస్తం.. చర్యలు తీసుకుంటం

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాలపై కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. భారత్ ఉత్పత్తులపై 26 శాతం టారిఫ్ విధిస్తున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్ 9 నుంచి అమల్లోకి వచ్చేలా షెడ్యూల్ చేశారు. అనంతరం దాన్ని 90 రోజులపాటు తాత్కాలికంగా వాయిదా వేశారు. అప్పటివరకు 10 శాతం సుంకాలు విధించారు. ఆపై ఆగస్టు 1 వరకు పొడిగించారు. ఇరుదేశాల మధ్య పరస్పర ప్రయోజనకరమైన 'ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం' కోసం మార్చిలో చర్చలు ప్రారంభమయ్యాయి. అక్టోబర్- నవంబర్ నాటికి ఒప్పందం మొదటి దశను పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం'' అని పీయూష్ గోయల్ తెలిపారు.

రష్యాతో వ్యాపారాన్ని కొనసాగిస్తే భారీగా సుంకాలు విధిస్తామని భారత్ సహా పలు దేశాలను ఇటీవల పలుమార్లు అమెరికా హెచ్చరిస్తూ వచ్చింది. ఈ క్రమంలో ఇదే కారణాన్ని చూపుతూ.. భారత్ ఉత్పత్తులపై 25శాతం సుంకంతోపాటు, పెనాల్టీలు కూడా విధించింది. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటని ట్రంప్ ఆరోపించారు. రష్యా నుంచి దిగుమతుల కారణంగా యూఎస్ పెనాల్టీలకు గురైన తొలి దేశం భారత్. రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకున్నా తనకు సంబంధం లేదని.. వారి ఆర్థిక వ్యవస్థలను మరింత పతనం చేసుకుంటున్నాయని ట్రంప్ కామెంట్ చేశారు.



# ఎన్సీడీసీకి రూ.2 వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

**ఢిల్లీ, జూలై 31:** నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్కు రూ.2 వేల కోట్లు ఆర్థిక సాయాన్ని ఇచ్చేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గ్రాంట్-ఇన్-ఎయిడ్ కింద నాలుగేండ్ల పాటు దీన్ని దఫదఫాలుగా అందించనుంది. ప్రధానమంత్రి మోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. దేశంలో 8.25 లక్షలకు పైగా ఉన్న సహకార సంఘాల్లోని 29 కోట్ల మంది సభ్యులకు ఈ కార్పొరేషన్ రుణాలు అందిస్తుంది. వీరిలో 94 శాతం మంది రైతులే ఉన్నారు. కేంద్రం అందించే ఈ ఆర్థిక సాయం ద్వారా అదనంగా మరో రూ.20వేల కోట్ల రుణాలను ఎన్సీడీసీ సమకూర్చుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఎన్సీడీసీ రుణ రికవరీ రేటు 99.8శాతంగా ఉండగా.. సున్నా ఎన్ పీఏ ఉన్నట్లు కేంద్ర మంత్రి వైష్ణవ్ తెలిపారు.

# రోహింగ్యాలు శరణార్థులా? చొరబాటుదారులా?

(మొదటి పేజీ తరువాయి)

కాకుంటే, అక్రమ వలసదారులైతే.. వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహిష్కరించే చర్య సరైనదేనా? చొరబాటుదారులను నిరవధికంగా నిర్బంధించడం లేదా బెయిలు విడుదల చేయవచ్చా? కోర్టులు ఎటువంటి షరతులు విధించవచ్చు? అని అని సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది మాట్లాడుతూ.. రోహింగ్యాల నిర్బంధమే కీలక అంశమని, వారిని నిరవధికంగా అలా కొనసాగించలేరని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం.. రోహింగ్యాలకు సంబంధించి దాఖలైన అనేక పిటిషన్లను మూడు విభాగాలుగా విభజించి విచారణ చేపడతామని పేర్కొంది. ప్రతి బుధవారం వీటిని విచారించేందుకు సమయాన్ని కేటాయిస్తామని తెలిపింది. ఈ ఏడాది మే నెలలో రోహింగ్యాల ఉనికిపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు దేశంలో ఉన్న రోహింగ్య శరణార్థులు విదేశీయులని తేలితే, భారత చట్టాల ప్రకారం వారిని తిరిగి పంపించాల్సిందేనని అభిప్రాయపడింది. యూఎన్ హెచ్ సీఆర్ జారీ చేసిన ఐడీ కార్డులు కూడా వారికి ఎటువంటి సాయం చేయకపోవచ్చంటూ అంతకుముందు ఇచ్చిన ఆదేశాలను గుర్తుచేసింది. ఇదిలాఉంటే, దేశంలో 12 రాష్ట్రాల్లో రోహింగ్యాలు నివసిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఢిల్లీ, తెలంగాణ, యూపీ, పశ్చిమ బెంగాల్, తమిళనాడుతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో వీరు ఉంటున్నప్పటికీ.. కచ్చితంగా ఎంత మంది ఉన్నారనే దానిపై స్పష్టత లేదని కేంద్ర హోంశాఖ గతంలో ఓసారి తెలియజేసింది.

# నిందితులంతా నిర్దోషులే ఐతే.. ఆ ఆరుగురిని ఎవరు చంపినట్టు?..

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** మాలేగావ్ పేలుళ్ల కేసులో నిందితులంతా నిర్దోషులేనని కోర్టు తీర్పు వెలువరించడంపై ఎంఐఎం చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. నిందితులు అందరూ నిర్దోషులే అయితే 'ఆ ఆరుగురిని ఎవరు చంపినట్టు?' అని ప్రశ్నించారు. ఆధారాలు లేవంటూ నిందితులకు క్లీన్ చిట్ ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నమాజ్ చేస్తున్న వారిని మతం పేరుతో టార్గెట్ చేసి దాడి చేశారని ఆయన ఆరోపించారు. బాంబు పేల్చి ఆరుగురిని బలి తీసుకున్నారని, పేలుడు ధాటికి వంద మందికి పైగా గాయపడ్డారని ఎంపీ గుర్తుచేశారు. మతం పేరుతో జరిగిన ఈ దారుణం కోర్టులో నిరూపణ కాలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు అసంతృప్తిని కలిగించిందని వ్యాఖ్యానించారు. ముంబై సబర్బన్ రైలు పేలుళ్ల తీర్పుపై మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయాన్ని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ గుర్తుచేశారు. ఆ కేసులోనూ ఆధారాలు స్పష్టంగా లేవనే కారణంతో నిందితులను కోర్టు నిర్దోషులుగా విడుదల చేసిందని చెప్పారు. కోర్టు తీర్పు వెలువడిన తర్వాత మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించారన్నారు. ఆ కేసు తరహాలోనే మాలేగావ్ పేలుళ్ల కేసు తీర్పుపైనా ఫడ్నవీస్, మోదీ ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాయా? అని అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు.

# సర్కారుకు కాళేశ్వరం నివేదిక



(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం కమిషన్ను 2024 మార్చి 14న జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ దాదాపు 15 నెలల పాటు విచారణ జరిపింది. ఈ బరాజ్లకు సంబంధించిన డీపీఆర్, డిజైన్లను పరిశీలించిన కమిషన్ విజిలెన్స్ రిపోర్టు ఆధారంగా ఇరిగేషన్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులను విచారించింది. విచారణలో భాగంగా అప్పటి సీఎం కేసీఆర్, ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్, ఇరిగేషన్ శాఖ మంత్రి హరీశ్రావును విచారించింది. అధికారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు ఇలా మొత్తం 115 మందిని విచారించి వారి స్టేట్మెంట్ను కమిషన్ రికార్డు చేసి ప్రభుత్వానికి సమర్పించింది. కాళేశ్వరం తుది నివేదిక ప్రభుత్వానికి చేరడంతో అందులో ఏముందనే దానిపై రాష్ట్ర రాజకీయాలలో ఉత్కంఠ నెలకొంది. ఈ నివేదిక ఆధారంగానే కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టు విచారణపై తుది నివేదిక అందించిన అనంతరం కమిషన్ చైర్మన్ ఘోష్ అనంతరం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ప్రభుత్వానికి మొత్తం 650 పేజీలకు పైగా తుది నివేదిక అందజేశామన్నారు. నివేదిక ఇవ్వడమే తమ పని అనీ, ప్రభుత్వం ఈ అంశంపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అన్నది తనకు సంబంధించిన విషయం కాదని జస్టిస్ ఘోష్ వ్యాఖ్యానించారు.

# ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

చెందగా.. 28 మంది గాయపడ్డారని, 8 మంది ఆచూకీ ఇంకా లభించలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వసుదా నాగరాజు హైకోర్టుకు తెలిపారు. 'ఇప్పటి వరకు మృతుల ఆచూకీ లేని వాళ్ల కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రకటించిన పరిహారం చెల్లించలేదు. పరిశ్రమ యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పరిశ్రమలో పేలుడుకు గల కారణాలపై ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను బయటపెట్టాలి. భానూరు పోలీస్ స్టేషన్ లో నమోదైన ఈ కేసును ప్రత్యేక దర్యాప్తు బృందంతో దర్యాప్తు చేయించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరిశ్రమలపై అన్ని భద్రతా చర్యలు ఉండేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలి'' అని పిటిషనర్ తరఫు న్యాయవాది తన వాదనలు వినిపించారు. అనంతరం ఈ పిటిషన్ పై మూడు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది.

# హైడ్రా కృషికి అభినందన

- **బతుకమ్మ కుంటను సందర్శించిన కేంద్ర బృందం**

**హైదరాబాద్, జూలై 31:** అంబర్ పేటలోని బతుకమ్మ కుంటను కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారుల బృందం గురువారం సందర్శించింది. ఒకప్పుడు చెత్త, నిర్మాణ వ్యర్థాలతో నిండిన ప్రాంతం చెరువులా రూపాంతరం చెందడాన్ని చూసి ఆశ్చర్యపోయింది. చెరువుల పరిరక్షణకు జాతీయ స్థాయిలో బతుకమ్మ కుంట ఒక నమూనా అవుతుందని బృందానికి నాయకత్వం వహించిన కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అడిషనల్ చీఫ్ టౌన్ ప్లానర్ మోనీస్ ఖాన్ పేర్కొన్నారు. కబ్జాల చెర నుంచి విముక్తి కల్పించడం, మండు వేసవిలో రెండు మీటర్ల లోతు తవ్వగానే గంగమ్మ తల్లి ఉబికి వచ్చే వీడియోలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. హైడ్రా పనితీరు గురించి వార్తల్లో చదివాం.. నేడు క్షేత్రస్థాయిలో తెలుసుకున్నామని చెప్పారు. హైడ్రా కృషిని అభినందించారు. చెరువు చుట్టూ ఇంకా అభివృద్ధి చేయాల్సిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. చెరువు అభివృద్ధితో ఇక్కడి ప్రాంతం సుందరంగా తయారవ్వడమే కాకుండా.. ఇక్కడ భూముల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని అన్నారు.

# మంచి పరిణామం: రామచందర్‌రావు



అనర్హత పిటిషన్లపై స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలన్న తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ తీర్పు మంచి పరిణామమనీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఫిరాయింపులను ప్రోత్సహించాయని విమర్శించారు.

# మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలె

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నారు. సుదీర్ఘ వాదనల అనంతరం గురువారం సుప్రీం కోర్టు తుది తీర్పు వెలువరించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై న్యాయస్థానమే అనర్హత వేటు వేయాలన్న విజ్ఞప్తిని తోసిపుచ్చిన సర్వోన్నత న్యాయస్థానం ఏ ఎమ్మెల్యే అయినా స్పీకర్ ప్రక్రియను పొడిగించాలని అడగకూడదు. అలా చేస్తే స్పీకర్ ప్రతికూల నిర్ణయాలు తీసుకోవచ్చని సుప్రీం కోర్టు సూచించింది. న్యాయస్థానం విచారణ మొదలు పెట్టాకే ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు ఇచ్చారు. మేము జోక్యం చేసుకునేంత వరకు స్పీకర్ నోటీసులు ఇవ్వకపోవడం సమంజసం కాదు. పదో షెడ్యూల్ ఉద్దేశాలు నెరవేరుతున్నాయా? లేదా ఆలోచించాలి. అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోకుండా ఆలస్యం చేసే ఎత్తుగడలు మంచివి కావని వ్యాఖ్యానించింది. రాజకీయ ఫిరాయింపులు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారిందనీ, దీనిని అరికట్టకపోతే ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి దానికి ఉందని తీర్పులో ధర్మాసనం అభిప్రాయపడింది. వివిధ సందర్భాల్లో ఈ అంశంపై పార్లమెంట్లో చేసిన ప్రసంగాలను కూడా పరిశీలించామని సీజేఐ తెలిపారు. రాజేష్ పైలట్, దేవేంద్రనాథ్ మున్షీలా అనర్హత చర్యలపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడం కోర్టుల ముందు జాప్యాన్ని నివారించడమే. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీలోకి మారిన వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్కు కట్టబెట్టారు. ఆర్టికల్స్ 136, 226, 227లకు సంబంధించి న్యాయ సమీక్ష అధికారాలు చాలా పరిమితంగా ఉన్నాయి. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని డివిజన్ బెంచ్ తప్పు చేసింది. స్పీకర్ ఒక న్యాయ నిర్ణేత అధికారిగా వ్యవహరిస్తూనే హైకోర్టు, సుప్రీం కోర్టు అధికార పరిధికి లోబడి ఉండే ట్రైబ్యునల్గా వ్యవహరిస్తారని వ్యాఖ్యానించింది. స్పీకర్ అలా వ్యవహరిస్తూనే రాజ్యాంగపరమైన రక్షణను పొందలేరు. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును పక్కన పెడుతున్నాం. ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు కాబట్టి పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాలి. స్పీకర్ నిర్ణయానికి కాల పరిమితి విధించాలనే అంశంపై పార్లమెంట్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించిన సర్వోన్నత న్యాయస్థానం ఇలాంటి చర్యలు ఏండ్ల తరబడి సాగడం వల్ల అర్థరహితంగా మారుతుందని పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తీర్పు సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది.



# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పీసీసీ విజయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బీసీలందరికీ న్యాయం జరగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమనీ, ఇందుకోసం ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు. బీసీల రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చే విధంగా కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే కొట్లాడుతున్నారని పేర్కొన్నారు. వారికి ప్రజల మద్దతు ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# తీర్పును స్వాగతిస్తున్నం: ప్రభుత్వ విప్ ఆది

**హైదరాబాద్, జూలై 31, (మనం బ్యూరో):** తెలంగాణలో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్పై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించారు. న్యాయస్థానాలంటే తమకు గౌరవం ఉందనీ, సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి అనేక మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలను పార్టీలో చేర్చుకుంది. ఆ పార్టీ విధానాలు నచ్చక బయటకు వచ్చిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ వేసి ప్రభుత్వం కూలిపోతుందని పగటి కలలు కన్నారు. ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయాధికారం స్పీకర్కే ఉంటుందని తెలిసినా, బీఆర్ఎస్ నాయకులు నానా యాగీ చేశారని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

**స్పీకర్‌కు సుప్రీం కోర్టు సూచనలు మాత్రమే చేసింది : ఎమ్మెల్సీ అద్దంకి**

ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ అధికారాలను సుప్రీం కోర్టు ప్రశ్నించలేదనీ, కేవలం సూచనలు మాత్రమే చేసిందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. సభా హక్కులు కాపాడేది స్పీకర్ మాత్రమేనని సుప్రీం కోర్టు తేల్చి చెప్పిందన్నారు. తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందంటూ బీఆర్ఎస్ నాయకులు తెలివి తక్కువగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నాయకులు ముందు సుప్రీం కోర్టు తీర్పును చదవాలి. అధికారంలో ఉన్నప్పుడు పార్టీలను విలీనం చేసిన ఘనత బీఆర్ఎస్ది. ఒక దళిత నేత ఉంటే సహించలేక కేసీఆర్ సీఎల్పీని విలీనం చేసుకున్నారు. కమ్యూనిస్టు పార్టీల అంతం చూడాలని కేసీఆర్ ప్రయత్నించారు.

# సుప్రీంకోర్టు ప్రజాస్వామ్యాన్ని కాపాడింది

- **ఉప ఎన్నికలకు సిద్ధంకండి: కేటీఆర్**



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. పది నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలకు మూడు నెలల సమయం ఉందని, పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ తీర్పు ద్వారా సుప్రీంకోర్టు ప్రజాస్వామ్యాన్ని కాపాడిందని ఆయన పేర్కొన్నారు. సీజేఐకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కొంతమంది ప్రజాప్రతినిధులు అడ్డదారులు తొక్కినంత మాత్రాన భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థ నాశనం కాదని సుప్రీంకోర్టు తీర్పు నిరూపించిందని కేటీఆర్ అన్నారు. గత ఎన్నికల సందర్భంగా పార్టీ మారితే ఆటోమేటిక్గా అనర్హత వర్తించాలని చెప్పిన రాహుల్ గాంధీ, సుప్రీంకోర్టు తీర్పుని స్వాగతిస్తారని ఆశిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ తాను చెప్పే మాటలకి, నీతినియమాలకు కట్టుబడి ఉండాలని సూచించారు. దమ్ముంటే, నిజాయతీ ఉంటే అనర్హత వేటు విషయంలో 'పాంచ్ న్యాయ్' పేరుతో చెప్పిన నీతులను ఆచరణలో చూపించాలని రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ తరపున సుప్రీంకోర్టులో వాదించిన న్యాయ బృందానికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ తరపున ఎన్నికైన పది మంది ఎమ్మెల్యేలు ప్రలోభాలకు లొంగి పార్టీ మారినా, కష్టకాలంలో పార్టీ వెంట నిలిచిన లక్షలాది మంది కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అంతిమంగా సత్యం, ధర్మం గెలిచాయని ఆయన పేర్కొన్నారు.

**ఏమిటీ కేసు?**

తెలంగాణలో 10 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ తరపున గెలిచి.. కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్ని బీఆర్ఎస్ కోరింది. స్పీకర్ ఏ నిర్ణయమూ తీసుకోకుండా ఉండటంతో ఈ విషయంపై బీఆర్ఎస్ పార్టీ హైకోర్టుకు వెళ్లింది. హైకోర్టు.. స్పీకర్ను 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని చెప్పగా.. స్పీకర్.. తనను ఆదేశించే అధికారం హైకోర్టుకు లేదు అన్నారు. దాంతో విషయం సుప్రీంకోర్టుకు చేరింది. ఇప్పుడు సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. తాము స్వయంగా వేటు వెయ్యలేమన్న సుప్రీంకోర్టు.. దీనిపై మూడు నెలల్లో స్పీకరే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

# ఉప ఎన్నికలొస్తయా?

(మొదటి పేజీ తరువాయి)

**సత్యమేవ జయతే అంటూ బీఆర్ఎస్ ట్వీట్**

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో బీఆర్ఎస్ 'ఎక్స్' వేదికగా స్పందించింది. సత్యమేవ జయతే అంటూ ట్వీట్ చేసింది. తెలంగాణలో ఉప ఎన్నికలు అనివార్యం కానున్నాయని పేర్కొంది.

# నాన్చొద్దు.. కళ్లు తెరవండి

## సుప్రీం తీర్పు.., నమ్మక ద్రోహులకు తగిన శాస్తి

- కోర్టు తీర్పుతో కళ్లు తెరవండి.. ఏళ్ల తరబడి నాన్చొద్దు : ఎమ్మెల్సీ కవిత
- సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమైనది : ఎంపీ వద్దిరాజు..
- ఆ పదిమంది తక్షణమే రాజీనామా చేయాలి

**లిపార్టీ మారిన ఎమ్మెల్యేలపై రాజయ్య**

- ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో సభాపతి చర్యలు తీసుకోవాలని డిమాండ్
- చర్యలు తీసుకోకుంటే సుప్రీంకోర్టు వారిని అనర్హులుగా ప్రకటిస్తుందన్న రాజయ్య
- ఫిరాయించిన ఎమ్మెల్యేలకు ప్రజలు గుణపాఠం చెబుతారన్న రాజయ్య



**హైదరాబాద్, మనం ప్రతినిధి :** పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలు తక్షణమే రాజీనామా చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజయ్య డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో సభాపతి నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించడాన్ని ఆయన స్వాగతించారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి మూడు నెలలలోపు స్పీకర్ చర్యలు తీసుకోవాలని, వారిని అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్పీకర్ చర్యలు తీసుకోకపోతే సుప్రీంకోర్టు సుమోటోగా ఆయా ఎమ్మెల్యేలను ఆరేళ్ల వరకు పోటీకి అనర్హులుగా ప్రకటిస్తుందని తెలిపారు. ఆరేళ్ల వరకు కనీసం వార్డు మెంబర్లుగా కూడా పోటీ చేయడానికి వారు అనర్హులు అవుతారని వ్యాఖ్యానించారు. ఆరు నూరైనా ఆరు నెలల్లో ఉప ఎన్నికలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల నిర్ణయాన్ని పక్కన పెట్టి అధికార పార్టీలోకి వెళ్లిన వారికి ప్రజలు గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు.

**సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమైనది : ఎంపీ వద్దిరాజు..**

పార్టీ ఫిరాయించిన శాసనసభ్యుల అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ 3 మాసాలలోగా నిర్ణయం తీసుకోవాలని దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్వాగతించారు. సుప్రీంకోర్టు ఈరోజు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమైనదని ఒక ప్రకటనలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.అత్యున్నత న్యాయస్థానం తీర్పును అనుసరిస్తూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాదకుమార్ చర్యలు తీసుకుంటారన్న ఆశాభావాన్ని ఎంపీ రవిచంద్ర వ్యక్తం చేశారు. ఒకపార్టీ బీ-ఫారంపై గెలిచిన చట్టసభల ప్రతినిధులు ఇంకో పార్టీలోకి ఫిరాయించిన సందర్భాల్లో వారికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను సంవత్సరాల పాటు నాన్చడాన్ని న్యాయమూర్తులు తప్పుబడుతూ,త్వరితగతిన నిర్ణయం తీసుకోవలసిందిగా ఆదేశాలివ్వడం ఆహ్వానించదగినదని ఎంపీ వద్దిరాజు అన్నారు.

**సుప్రీం తీర్పుతో కళ్లు తెరవండి.. ఏళ్ల తరబడి నాన్చొద్దు : ఎమ్మెల్సీ కవిత**

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు తీర్పునివ్వడాన్ని ఆహ్వానించారు. ఈ తీర్పును అనుసరించి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకపార్టీ నుంచి గెలిచిన చట్టసభ సభ్యులు మరో పార్టీలోకి ఫిరాయిస్తే? వారిపై ఇచ్చిన అనర్హత పిటిషన్లు ఏళ్ల తరబడి నాన్చకుండా వేగంగా చర్యలు తీసుకోవాలని, సుప్రీం కోర్టు ఆదేశించడం ఆహ్వానించదగ్గ పరిణామం అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.

**సీఎం రేవంత్ రెడ్డికి.. చెంప పెట్టు లాంటి తీర్పు : వివేకానంద, సోమ భరత్**

పార్టి పిరాయించిన పది మంది ఎమ్మెల్యేల అనర్హతపై ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉందని, సుప్రీం తీర్పుతోనైనా మూడు నెలల్లో పార్టీ పిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని అసెంబ్లీ బీఆర్ఎస్ విప్ కే.పీ వివేకానంద, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గోడ దూకిన ఎమ్మెల్యేల పిటిషన్‌పై కీలక నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశించడం చరిత్రాత్మకం అని వారు పేర్కొన్నారు. గతంలో వీరి విషయంలో ఉపఎన్నికలు ఎలా వస్తాయి? అధ్యక్షా అని అసెంబ్లీలో రేవంత్ రెడ్డి సుప్రీం కోర్టును తప్పు పట్టేలా వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. తాజాగా ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి ఓ చెంప పెట్టు లాంటిదని పేర్కొన్నారు.

# చేవెళ్లలో మీనాక్షి నటరాజన్‌కు ఘన స్వాగతం

- గజమాలతో సత్కరించిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య.

**చేవెళ్ల, జులై 31(మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మా మహేష్ కుమార్ , రంగారెడ్డి జిల్లా ఇంచార్జీ మంత్రి, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ చీఫ్ విఫ్ డా. పట్నం మహేందర్రెడ్డి, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డిలకు చేవెళ్లలో ఘన స్వాగతం పలికారు. పరిగిలో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ జనహిత పాదయాత్రలో భాగంగా మార్గమధ్యలో చేవెళ్లలోని షాబాద్ చౌరస్తా వద్ద చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, స్థానిక నాయకులతో కలిసి ఘన స్వాగతం పలికారు. అనంతరం చేవెళ్ల మండల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జూకన్నగారి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గజమాలతో ఆమెను సత్కరించారు.



అంతకుముందు చిల్కూర్ లో గల శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో బాలాజీ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, వేదపండితులచే ఆశీర్వాదం పొందారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. హిమాయత్ నగర్ చెస్తాలోని మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ంధీ, చేవెళ్లలోని ఇందిరాగాంధీ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశే ఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుండి పరిగిలో చేపట్టనున్న జనహిత పాదయాత్ర సభకు వారు తరలివెళ్లారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీంభరత్, జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్, చేవెళ్ల, ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి , మొయినాబాద్ పిఏసిఎస్ చైర్మన్ మండడి చంద్రారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు బండారు ఆగిరెడ్డి, పడాల రాములు, నియోజకవర్గంలోని సీనియర్ నాయకులు షాబాద్ దర్శన్, మాజీ జడ్పీటీసీ కాలె శ్రీకాంత్,చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, చేవెళ్ల, మొయినాబాద్ మండలాల అధ్యక్షులు వీరేందర్ రెడ్డి, మాణయ్య, ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచులు శైలజ ఆగిరెడ్డి,పడాల ప్రభాకర్, చేవెళ్ల మండల మహిళా అధ్యక్షురాలు సమతా వెంకట్ రెడ్డి, చేవెళ్ల మండల్ మాజీ యూత్ అధ్యక్షులు మద్దెల శ్రీనివాస్, చేవెళ్ల మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీటీసీ లు రవీందర్ రెడ్డి, గుండాల రాములు,నాయకులు ఆశోక్ యాదవ్, రవీందర్ రెడ్డి. శ్రీనివాస్ యాదవ్, కంజర్ల భాస్కర్, జైపాల్ రెడ్డి, వినోద్ కుమార్ తదితరులున్నారు.

# మక్త మాదారం – నేదునూరు బీటీ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి

- పనులు ప్రారంభించి చేతులెత్తిసిన గుత్తేదారు
- బీటీ రోడ్డు పనులు వెంటనే చేపట్టాలి
- వారంలోగా పనులు ప్రారంభించకుంటే బిజెపి ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడుతాం
- బీజేపీ జిల్లా నాయకుడు ఎన్. యాదగిరి

**కడ్తాల్, జూలై 31(మనం, న్యూస్) :** కడ్తాల్ మండలం మక్తమాధారం గ్రామం నుంచి నాగిరెడ్డిగూడ తండా మీదగా నేదునూరు రోడ్డు వరకు రూ. 1. 20కోట్లతో బీటీ రోడ్డు మంజూరైంది. రోడ్డు పనులు దక్కించుకున్న గుత్తేదారు వారం రోజులు పనులు చేసి చేతులెత్తేయడంతో వాహనదారులకు కష్టాలు మొదలయ్యావని జిల్లా బీజేపీ నాయకుడు ఎన్. యాదగిరి అన్నారు. గురువారం ఆయన మాట్లాడారు. బీటీ రోడ్డు పనులని ప్రారంభించిన ఎందుకు పనులు నిలిపివేశారని అధికారులను, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు నడవలేని పరిస్థితి ఉందని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో రోడ్డు గుంతలుగా మారి వాహనాలకు ఇబ్బందిగా మారిందని అన్నారు. రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయడంతో



ఎదురెదురుగా వచ్చే వాహనాలు సైడ్ ఇవ్వని పరిస్థితి ఈ రోడ్డుపై ఉందని, రోడ్డు పనులు వెంటనే చేపట్టకుంటే బీజేపీ ఆధ్వర్యంలో రోడ్డు ఏర్పాటుకోసం నిరాహార దీక్ష చేస్తామని యాదగిరి హెచ్చరించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో లంబాడీలకు గుర్తింపు లేదు

- లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్

**కడ్తాల్, జూలై 31(మనం, న్యూస్) :** కాంగ్రెస్ ప్రభుత్వం లో లంబాడీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, రేవంత్ రెడ్డి క్యాబినెట్లో ఒక్క లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వలేదని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ మండిపడ్డారు. లంబాడీలకు జరిగిన అన్యాయం గురించి లంబాడి విద్యార్థి సంఘాలు గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చాయి. ఈ సందర్భంలో ముందస్తుగా ఎల్ హెచ్ పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్ తో పాటు పలువురు నాయకులను గురువారం కడ్తాల్ పోలీసులు అరెస్టు చేశారు. మాయ మాటలు చెప్పి లంబాడీల ఓట్లను దండుకున్న కాంగ్రెస్ సర్కార్




లంబాడీలకు తీవ్ర అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో లంబాడీలకు ప్రత్యేక గుర్తింపు ఉండేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి కావాలని లంబాడీలకు అనుగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. త్వరలోనే జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లంబాడీలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అరెస్టు అయిన వారిలో డైరెక్టర్ సేవ్య నాయక్, మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, నాయకులు పాండు నాయక్, శీను నాయక్, మోతిలాల్ నాయక్, కిషన్ నాయక్, చందర్ నాయక్, కిషన్ నాయక్, బీక్యా నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

- చేవెళ్ల శాసన సభ్యులు కాలె యాదయ్య.

**చేవెళ్ల, జులై 31(మనం న్యూస్) :** ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య పేర్కొన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని ఈశ్వరి బంకెట్ హాల్ లో చేవెళ్ల ఎంపీడీవో కార్యాలయంలోని సూపరింటెండెంట్ వరయూరీ రవీందర్ పదవి విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొని పదవి విరమణ పొందిన రవీందర్ దంపతులను ఘనంగా శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ పొందేది ఉద్యోగానికి మాత్రమే సేవకు కాదన్నారు. జీవితాంతం పేదలకు సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ముడిమ్యాల సహకార సంఘం చైర్మన్ గోనె ప్రతాపరెడ్డి, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజ ఆగి రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విరాళంగా.. ఇంటి స్థలం

**చేవెళ్ల, జూలై 31(మనం న్యూస్):** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దేవుని ఎర్రవల్లి వార్డు కార్మికురాలు తూర్పాటి అండాలుకు 60 గజాల స్థలం విరాళంగా రిజిస్ట్రేషన్ చేసి డాక్యుమెంటును సత్యనారాయణ రెడ్డి అందజేశారు . కార్మికురాలు అండాలుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో స్థలం లేకపోవడంతో ఆమెకు ఇంటి స్థలాన్ని ఉచితంగా పొల్యూషన్ బోర్డు సభ్యుడు ఇచ్చేందుకు ముందుకు వచ్చాడు. ఈ మేరకు గురువారం తహసిల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసి మున్సిపాలిటీ కమిషనర్ వెంకటేశం సమక్షంలో కార్మికురాలు అండాలుకు పట్టా కాగితాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవుని ఎర్రవల్లి మాజీ ఎంపీటీసీ చంద్రయ్య, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



# సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

**తుర్క యంజాల్, జూలై 31(మనం న్యూస్) :** సీఎం సహాయనిది పథకం ద్వారా పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని పలువురు లబ్ధిదారులకు గురువారం తొర్రూరు క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కంచనేని సుకన్య రూ. 60,000 , దేశ గొని రవీందర్ రూ.60,000 , మేతరి శ్రీధర్ రూ. 60,000 , గడిగే పర్వతాలు రూ. 60,000 అనంతరం ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక



మధుసూదన్ రెడ్డి వైస్ ఛైర్మన్ సిహెచ్ భాస్కర చారి తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మా మంగమ్మ శివకుమార్, సీనియర్ నాయకులు ధనరాజ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మేతరి దర్శన్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెదిరె సికిందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మిధాని కాలనీలో ఇంటింటికీ మొక్కల పంపిణీ

### మాజీ వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్

**తుర్క యంజాల్, జూలై 31(మనం న్యూస్) :** మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్ గ్రామంలో బుధవారం హరితహారం కార్యక్రమంలో మాజీ వైస్ చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, పాల్గొని మీదాని కాలనీలో ఇంటింటీకి మొక్కల పంపిణీ కార్యక్రమం, మరియు కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రాంగాణంలో మొక్కలు నాటడం జరిగింది. వారు మాట్లాడుతూ,

హరితహారం కార్యక్రమంలో ప్రజలు మొక్కలు నాటి భాగస్వామ్యం కావాలని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, తెలంగాణ రాష్ట్రం పచ్చదనాన్ని పెంచడంలో ముందంజలో ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మీదాని కాలనీ అధ్యక్షులు బత్తుల శంకర్ గౌడ్, మాజీ అధ్యక్షులు మల్లెల దేవేందర్, గౌడ్, సంఘం అధ్యక్షులు లోడే పాపయ్య, గౌడ్, సంఘ సభ్యులు రంగా శ్రీనివాస్ గౌడ్ , పెసర్గాయాలా నర్సింహా రెడ్డి , వెంకట్ రెడ్డి, బిల్ కలెక్టర్ సంపత్ , కాలనీ వాసులు మరియు మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## మంచోనిలా నటించలేను

గాయాలను మోస్తున్నవాడిని,
అంతర్గత చప్పుడుని
పేజీలు పేజీలుగా చదువుతున్నవాడిని,
నీటి బుడగలాంటి జీవితాన్ని
పుస్తకాలుగా కుడుతున్నవాడిని,
మంచోనిగా నటించలేను.

మాటలను మట్టిలో కప్పివేయలేను,
కొన్నిసార్లు నా మాటలు ధాన్యపు గింజలు,
మరికొన్నిసార్లు మీ గొంతుకి ఉరితాళ్లు.
రంగుల తెరలను నోటికి కట్టుకోవడం
చేతకానివాడిని,
గుండెకింద విధ్వంసాన్ని దాచుకోలేనివాడిని,
తడిగుడ్డతో గొంతులు కోయలేనివాడిని,
బహిరంగ నిజాన్ని.

నీడల్లో ఆటలు ఆడనివాడిని,
ఒక మూల కాళ్లు ముడుచుకొని కన్నులను
ఒత్తుకోలేనివాడిని,
నిశీధిలో చంద్రవంకను చూడనివాడిని,
వెలుగుపూలను కొయ్యలేనివాడిని,
నిరంతర చెడ్డవాడిని.

తప్పటడుగులు వేసినవాడిని,
అడుగుల గుర్తుల నుండి విజ్ఞానంగా
ఎదుగుతున్నవాడిని,
చర్మంపై మచ్చలను తుడుచుకున్నవాడిని,
ముక్కుపై సూర్యుణ్ణి నిలుపుకున్నవాడిని,
అద్దంలో ప్రతిబింబాన్ని చెక్కుకుంటున్నవాడిని,
నిక్కచ్చి శిల్పిని.

నిందలను మోసినవాడిని,
తుపుక్కున ఎవరో ఉమ్మితే
అనుభవంగా స్వీకరించినవాడిని,
పాదాల కింద నిప్పులను మోస్తున్నవాడిని,
విసిరిన రాళ్లను
ఆయుధాలుగా మలుచుకుంటున్నవాడిని,
శాశ్వత విమర్శను.
ముమ్మాటికీ
నీ అంతటి మంచోనిలా నటించలేనివాడిని,
నాదో చిన్న అనుమానం
ఇంతకీ!
నీది మంచి నటనేనా!?

**- జాని తక్కెడశిల**
7259511956

# పిల్లలకు తల్లి పాలకు మించిన అమృతం లేదు



'తల్లికి మించిన దైవం లేదు. అమ్మ పాలకు మించిన అమృతం లేదు'. నవమాసాలు గర్భంలో ఉండి, అమ్మ నుండి అందుకున్న తొలి వరం కమ్మనైన క్షీరం. మన దేశంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయి.

ఈ సంవత్సరం థీమ్ 'తల్లిపాలు ఇవ్వడానికి ప్రాధాన్యత ఇవ్వడం. స్థిరమైన మద్దతు వ్యవస్థలను సృష్టించడం'. ఈ థీమ్ తల్లిపాలు ఇవ్వడాన్ని ఆచరణాత్మకంగా, అందరి తల్లులకు అందుబాటులో ఉండేలా చేయడానికి దీర్ఘకాలిక, సమానమైన మద్దతు వ్యవస్థలను ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. 'పిల్లలు ఆరోగ్యవంతులుగా పెరిగి అభివృద్ధి చెందడానికి తల్లిపాలు సరైనవని' ప్రపంచ ఆరోగ్య సంస్థ , యునిసెఫ్, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలు సిఫార్సు చేస్తున్నాయి.

**తల్లి నుండి లభించే తొలి బహుమతి**

'ఆరోగ్యంగా ఉంటే అడవిలోనైనా ఆనందంగా బ్రతికేవచ్చు' అన్నట్లు తల్లి పాలు తాగడం నుండే బిడ్డ ఆరోగ్యం ఆరంభం అవుతుంది. తల్లి పాలివ్వడం అనేది తనకు, తన బిడ్డకు, ప్రపంచానికి తల్లి నుండి లభించే తొలి బహుమతి. ఇది ఎల్లప్పుడూ అందరికీ సులభం కానప్పటికీ ఇది ఎల్లప్పుడూ విలువైనదే. తల్లిపాలు శిశువుకు ప్రకృతి ఇచ్చే సహజ సిద్ధమైన టీకా. ఇవి సహజమైన, పునరుత్పాదక ఆహారం, వ్యర్థాలు, కాలుష్యం లేని వనరు. బిడ్డకు ఈ పాలు ఎంతో శ్రేష్ఠమే కాక, పౌష్టికాహారం కూడా. శిశువుకు తల్లి పాలకు మించిన ఆహారం లేదు, ఉండదు, ఉండబోదు కూడా. ఇవి ప్రోటీన్లు, విటమిన్లు, పిండి పదార్థాలు, కాల్షియం, పొటాషియం, ఖని జాలు, సూక్ష్మపోషకాలు అవసరమైన మేరకు పుష్కలంగా ఉండటం వలన పిల్లలు తగినంత బరువు పెరుగుతారు. వీటిలో శక్తివంతమైన ప్రతిరోధకాలు ఉండటం వల్ల అంటువ్యాధులు, వైరల్ ఇన్ఫెక్షన్లు, అలర్జీలు, ఆస్తమా, చెవి సంబంధిత వ్యాధులు, సెప్సిస్, న్యుమోనియా, డయేరియాల నుండి శిశువును కాపాడతాయి. ఇందులో ఉండే ఫ్యాటీ యాసిడ్స్ బిడ్డ మెదడు పెరుగుదలకు దోహదం చేయడం వలన తెలివితేటలు పెరుగుతాయి. అంతేకాదు, అటెన్షన్ డెఫిసిట్ హైపర్‌ఆక్టివిటీ డిజార్డర్‌ను అభివృద్ధి చేసే అవకాశాలను తగ్గించడమే కాక నరాల అభి వృద్ధిపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. తల్లిపాలు తేలికగా జీర్ణ మవడం వలన మలబద్ధకం సమస్యలు రాకుండా కాపాడతాయి. భవిష్యత్తులో స్థూలకాయం, అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధి రాకుండా ఇవి ఒక రక్షణ కవచంలా పనిచేస్తాయి. 2015-16 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-4 ప్రకారం 6 నెలల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు ప్రత్యేకంగా తల్లిపాలు ఇచ్చే వారు 54.9 శాతం ఉండగా 2019-21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 వచ్చేసరికి అది 63.7 శాతానికి పెరిగింది. ఇందులో గ్రామీణులు 65.1 శాతం, పట్టణవాసులు 59.6 శాతంగా ఉన్నారు. ఇది ఎంతో శుభపరిణామం.

**తొలి గంట చాలా ముఖ్యం**

బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లి పాలు ప్రారంభించాలి. ప్రసవం అయిన వెంటనే మొదటి అరగంట నుండి ఒక గంట వ్యవధిలో తల్లి పాలలో కొలొస్ట్రమ్ ఉంటుంది. ఈ పాలు ఎంత తొందరగా తాగించడం మొదలుపెడితే అంత మంచిది. ఇది బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధులనుండి దూరంగా ఉంచుతుంది. శిశువు జీవితంలోని మొదటి నెలలకు అవసరమైన శక్తిని, పోషకాలను తల్లిపాలు అందిస్తాయి. బిడ్డకు ఆరునెలలు పూర్తయ్యేవరకూ తల్లిపాలు మాత్రమే పట్టాలి. ఈ ఆరు నెలలు చాలా కీలకం. ఆరు నెలల తర్వాత అనువైన కుటుంబ ఆహారాన్ని అదనంగా ప్రారంభించాలి.

తల్లిపాలు రెండు సంవత్సరాల వయస్సు వరకు లేదా వీలైనంత కాలం ఇవ్వాలి. తల్లి పాలల్లో ఎనభై శాతం కంటే ఎక్కువ నీరు ఉంటుంది. తల్లి తన బిడ్డకు దాహం వేస్తున్నట్లు అనిపించినప్పుడల్లా పాలివ్వవచ్చు. వేడి వాతావరణంలో కూడా ఆరు నెలల వయస్సు లోపు పిల్లలకు నీరు అవసరం లేదు. ఆరు నెలల తరువాత తల్లి పాలతో పాటు పరిపూర్ణమైన ఆహారాన్ని అందించడం మొదలు పెట్టవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసింది. డాక్టర్ సలహా మేరకు విటమి న్లు, మినరల్స్, సిరప్‌లను ఇవ్వొచ్చు. అదనపు ఆహా రంతో పాటు కనీసం రెండేళ్లు తల్లి పాలు పట్టాలి. తల్లికి, పాలు తాగే బిడ్డకు ఎలాంటి సమస్య రానంత వరకూ, తల్లి మరల గర్భంతో ఉ న్నా కూడా బిడ్డకు పాలు ఇవ్వ వచ్చు. ఆ తరువాత తల్లీ బిడ్డలకు ఇష్టమైనంతవరకూ తల్లిపాలు పెట్టవచ్చు.



**తల్లిపాలు తాగని పిల్లలకి వచ్చే నష్టాలు**

తల్లి పాలు మాత్రమే తాగే పిల్లలు ప్రాణాంతక వ్యాధులతో మరణించే అవకాశం తక్కువ అని అంతర్జాతీయ నివేదికలు చెబుతున్నాయి. ఈ విధంగా తల్లి పాలు కొనసాగించకపోవడం వలన కలిగే నష్టాలపై మన దేశంలో జరిపిన అంతర్జాతీయ అధ్యయనంలో, ప్రతి సంవత్సరం నీళ్ల విరేచనాలు, న్యుమోనియా లతో సుమారు ఒక లక్ష మంది 5 సంవత్సరాలలోపు పిల్లలు మరణిస్తున్నారు. ప్రతి ఏటా 34.7 కోట్ల మంది పిల్లలు నీళ్ల విరోచనాలకు, 0.24 కోట్ల మంది పిల్లలు న్యుమోనియా జబ్బులకు, 40,382 మంది పిల్లలు స్థూలకాయానికి లోనవుతున్నారు.

**చాలా లాభాలు**

బిడ్డకు పాలివ్వడం వలన తల్లికి కూడా లాభాలున్నాయి. ప్రసవంలో తల్లి బరువు ఎక్కువ పెరుగుతుంది. పాలివ్వడం వలన బరువు తగ్గుతారు. రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్, రక్తపోటు, టైప్ 2 మధుమేహం వంటి రోగాలు భవిష్యత్తులో రాకుండా అడ్డుకుంటాయి. ప్రతి ఏటా 7,000 మంది తల్లులు రొమ్ము క్యాన్సర్, 1,700 మంది అండాశయ క్యాన్సర్, 87,000 మంది మధుమేహం బారిన పడుతున్నారు. పిల్లలు పుట్టిన తరువాత తమ శిశువులకు పాలిచ్చే తల్లులు ఎక్కువగా ఉండే దేశం క్రొయేషియా. ఇక్కడ 98 శాతం మంది తల్లులు తమ బిడ్డలకు పాలిస్తున్నారు. ఇంకా రువాండా, చిలీ, బురుండి వంటి దేశాలలో 80 శాతం కంటే ఎక్కువ మంది తల్లులు తమ పిల్లలకు పాలిస్తున్నారు.

**ప్రత్యామ్నాయం లేదు**

ప్రకృతి ప్రసాదించిన గాలినే పీల్చుతాం. ప్రకృతి అందించిన నీటినే తాగుతాం. వీటికి ప్రత్యామ్నాయంగా ఇంకేమైనా తీసుకోగలమా? అలానే తల్లి పాలకు కూడా ఇంకో ప్రత్యామ్నాయం లేదు.

విదేశాల నుండి తీసుకొచ్చిన పాల పొడులు కూడా అమ్మ పాలకు మించి పోవు. తల్లులందరూ బాగా ఆలోచించాలి. పిల్లలకు పెద్దయిన తరువాత ఆస్తులు, అంతస్తులు, డబ్బు ఇవ్వాలనుకుంటారు. కానీ వాటి కంటే పిల్లలకు ఇచ్చే మొదటి ఆస్తి తల్లిపాలే అన్న విషయం గుర్తెరగాలి. కొన్ని పరిస్థితులలో, అనగా ఉద్యోగరీత్యా బయట పనులు చేయడం వలన తల్లులు తమ శిశువుకు పాలు అందివ్వలేరు. ప్రభుత్వ ఉద్యో గం చేస్తున్న వారికి ప్రసవానంతర సెలవులు ఇస్తున్నారు. అలానే ప్రైవేటు రంగంలో కూడా కనీసం ఆరు మాసాలు వేతనంతో కూడిన సెలవివ్వాలి. పాలిచ్చే అమ్మ పొలం పనులకు, కూలీ పనులకు ఆ ఆరు మాసాలు వెళ్లకుండా ఇంటిలోని యజమానులు, కుటుంబసభ్యులు సహకరించాలి.ఈ దిశగా మనమందరం సమాజంలో అవగాహన కల్పించడంలో పాలుపంచుకోవాలి.

**(ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు)**

**- కింజరాపు అమరావతి**
82472 86357

# మన మౌనం.. దేనికి సంకేతం!!?



గాజాలో ఇజ్రాయెల్ నరమేధానికి పాల్పడుతున్నది. వృద్ధులు, చిన్నారులు, మహిళలు అనే తేడా లేకుండా ప్రజలను హత్య చేస్తున్నది. ఇరవై నెలల కాలంలోనే 60 వేల మందిని పొట్టన బెట్టుకున్నది. అయితే ఇజ్రాయెల్ చేస్తున్న నరమేధానికి భారతదేశానికి చెందిన పలు కార్పొరేట్ కంపెనీల సహకారం ఉందనే తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. జేఎన్‌యూ, ఏఎంయూ, హైదరాబాద్ యూనివర్సిటీలతోపాటు బెంగుళూరు, ముంబైలోని చాలా విద్యాసంస్థల్లో, అనేక ప్రధాన నగరాల్లో ఈ కంపెనీలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆయా కంపెనీల ఆఫీసుల ఎదుట సైతం ప్రొటెస్ట్స్ సైతం చేస్తున్నారు. ఆయా కంపెనీల ఉత్పత్తులను బాయ్ కాట్ చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే ఇలాంటి ఆరోపణలపై ఆయా కంపెనీలు స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. సైలెన్స్ దేనికి సంకేతం అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. మౌనం అర్ధాంగీకారమేనా? అనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

ఇజ్రాయెల్, అక్కడి కంపెనీలతో వ్యాపార సంబంధాలు కలిగి, గాజా నరమేధానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారమందిస్తున్నారని భారత దేశానికి చెందిన కొన్ని కార్పొరేట్ కంపెనీలపై ప్రధానంగా ఇలాంటి ఆరోపణలు వస్తున్నాయి. అందులో టాటా గ్రూప్, అదానీ గ్రూప్, రిలయన్స్ ఇండస్ట్రీస్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారత్ ఫోర్జ్, మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ వంటి సంస్థలు ఉన్నాయి. ఆయా కంపెనీలు ఇజ్రాయెల్, అక్కడి స్థానికత కలిగిన కంపెనీలతో వ్యాపార సంబంధాలు కలిగి ఉన్నాయి. ఈ కంపెనీలు ఇజ్రాయెల్‌కు గాజాలో నరమేధానికి వాహనాలు, డ్రోన్స్, డిఫెన్స్ పరికరాలు వంటి వాటిని సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా సాంకేతిక, సైబర్ సెక్యూరిటీ సేవలు సైతం అందిస్తున్నట్లు సైతం విమర్శలు ఉన్నాయి.



గాజా నరమేధంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకారమందిస్తున్నట్లు తీవ్రమైన ఆరోపణలు ఉన్నా ఆయా కంపెనీలు స్పందించడం లేదు. కనీస స్పష్టత ఇవ్వడం లేదు. తాము గ్లోబల్ మార్కెట్‌లో ఉంటున్నందున ఇజ్రాయెల్‌తో, అక్కడి కంపెనీలతో తమ వ్యాపార సంబంధాలు సాధారణ వాణిజ్య కార్యకలాపాల్లో భాగమేనని ఆయా కంపెనీలు భావిస్తూ ఉండవచ్చు. అయితే ఈ అంశంపై బహిరంగంగా స్పందించడం ద్వారా వ్యాపార ఒప్పందాలకు ఆటంకం కలుగుతుందని ఆయా కంపెనీలు భయపడుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

జెనోసైడ్‌లో ఇజ్రాయెల్‌కు సహకారమందిస్తున్నారనే ఆరోపణలు వచ్చిన వాటిల్లో భారత్‌కు చెందిన టాప్ కంపెనీలు ఉన్నాయి. ఆయా కంపెనీల్లో కోట్లాది మంది తమ నగదును పెట్టుబడిగా పెట్టి ఇన్వెస్టర్లుగా మారారు. అంతేకాకుండా కోట్లాది మంది ఆయా కంపెనీల ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా కంపెనీలు తమ ఇన్వెస్టర్లు, వినియోగదారులకు జవాబు చెప్పాల్సిన అవసరం లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. అయితే బహిరంగంగా ట్రేడ్ చేసే సంస్థలు పారదర్శకతను పాటించాల్సి ఉంటుంది. అంతేకాకుండా బాధ్యత కలిగిన వ్యాపార సంస్థలుగా తమను తాము చెప్పుకునే ఈ కంపెనీలు తమపై వచ్చిన ఆరోపణలకు కచ్చితంగా జవాబు చెప్పాల్సి ఉంటుంది. తద్వారా ఇన్వెస్టర్ల నమ్మకాన్ని కాపాడుకోవాలి. మరోవైపు ఈ ఆరోపణలు చట్టపరమైన ఫిర్యాదులుగా మారితే, ఆయా కంపెనీలు తమ వ్యాపార కార్యకలాపాలను బహిరంగంగా లేదా చట్టపరమైన వేదికలపై చెప్పాల్సిన అనివార్య పరిస్థితి నెలకొంటుంది.

ఇజ్రాయెల్ సైనిక చర్యలను నరమేధంగా ఆరోపిస్తూ.. బాయ్‌కాట్ , డైవెస్ట్ మెంట్, శాంక్షన్స్ (బీడీఎస్) ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా బలపడుతున్నది. భారత కంపెనీలకు సంబంధించి కూడా దేశంలో నిరసనలు జరుగుతున్నాయి. టాటా గ్రూప్ ఇజ్రాయెల్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్నదని ఆరోపిస్తూ కేరళలోని కోజికోడ్‌లో ఎస్ఐఓ కార్యకర్తలు టాటా గ్రూప్‌నకు చెందిన జూడియో స్టోర్ ఎదుట నిరసన తెలిపారు. ఢిల్లీలోని కమలానగర్‌లో కూడా జూడియో స్టోర్ వద్ద 'ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటీ విత్ పాలస్తీన్' అనే పేరుతో నిరసనలు జరిగాయి. అంతేకాకుండా టాటా, రిలయన్స్, అదానీ, మహీంద్రా గ్రూప్ కంపెనీలకు చెందిన ఉత్పత్తులను బహిష్కరించాలని సోషల్ మీడియాలో అనేక మంది పిలుపునిస్తున్నారు.

బాయ్‌కాట్ మూవ్ మెంట్ అనేది ప్రస్తుతం ఆయా కంపెనీలపై ఆర్థికంగా అంతగా ప్రభావం చూపెట్టడం లేదు. అయితే రిటైల్ స్టోర్ల వద్ద క్రమంగా నిరసనలు పెరిగితే.. వినియోగదారుల విశ్వాసం దెబ్బతినొచ్చు.ప్రతికూల ప్రచారం కంపెనీల బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయొచ్చు. మధ్యప్రాచ్య దేశాల్లో ఆయా కంపెనీలకు ఉన్న వ్యాపార సంబంధాలు, ఒప్పందాలపైనా ఎఫెక్ట్ పడొచ్చు. ఫలితంగా భవిష్యత్తులో ఆయా కంపెనీలు నష్టపోయే ప్రమాదమున్నది. ఇందుకోసం ఇన్వెస్టర్ల నమ్మకాన్ని కాపాడేలా ఆయా కార్పొరేట్ కంపెనీలు తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్), ఎన్విరాన్మెంటల్ సోషల్ గవర్నెన్స్ (ఈఎస్‌జీ) ప్రమాణాలకు అనుగుణంగా పారదర్శకంగా వ్యవహరించాలి. కేవలం లాభాల కోసమే కాకుండా.. మానవతా విలువలకు అనుగుణంగా ఈ ఆరోపణలపై స్పష్టతనివ్వాలి.

**- ఫిరోజ్ ఖాన్**

# అత్యంత ప్రమాదకర క్యాన్సర్



క్యాన్సర్ వ్యాధి అంటేనే భయపడతాం. క్యాన్సర్ వ్యాధికి పూర్తి చికిత్స పద్దతులు లేవవి కంపించి పోతాం. క్యాన్సర్ వ్యాధుల్లో విస్తృత మైనదిగానే కాకుండా ప్రాణాంతకమైనదిగా ఊపిరితిత్తుల లేదా లంగ్ క్యాన్సర్‌ను గుర్తించారు.

తొలుత వ్యాధి లక్షణాలు కనుపించకపోవడంతో అంతిమ దశలో నిర్ధారణ జరిగి ప్రాణాంతక దుస్థితికి చేరుతుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్ పట్ల అవగాహన కొరవ డడం, ఆలస్యంగా రోగ నిర్ధారణ జరగడం, నివా రణ మార్గాలను ప్రచారం చేయడం, ఈ వ్యాధి పట్ల పలు అపోహలు చక్కర్లు కొట్టడంతో దీని పట్ల సంపూర్ణ కనీస జ్ఞానం కలిపించడానికి ప్రతి ఏట ఆగష్టు 1 న ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినం (వరల్ లంగ్ క్యాన్సర్ డే) పాటించడం 2012 నుంచి ఆనవాయితీగా మారింది. ప్రపంచ ఊపిరి తిత్తుల క్యాన్సర్ దినం-2025 ఇతివృత్తంగా యునైటెడ్ బై యూనిక్ అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు.

**ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు కారణాలు**

ఊపిరితిత్తుల కణజాలం అపరిమితంగా, నియంత్రణ కోల్పోయి పెరడంతో గడ్డలు ఏర్పడడాన్ని లంగ్ క్యాన్సర్ అని పిలుస్తూ, ఈ గడ్డలు ఇతర శరీర భాగాలకు వ్యాపించడం కూడా గమనించారు. ప్రపంచవ్యాప్తంగా పలు రకాలైన క్యాన్సర్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వల్లనే అధిక మరణాలు నమోదు అవుతున్నాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధికి ప్రధాన కారణం స్మోకింగ్ లేదా పొగతాగడాన్ని గుర్తించారు. ఫస్ట్ హాండ్ లేదా సెకండ్ హాండ్ స్మోకింగ్ లేదా ప్రత్యక్ష, పరోక్షంగా పొగ తాగడంతో పాటు పలు ఇతర కారణాల వల్ల కూడా లంగ్ క్యాన్సర్ రావచ్చు. దీర్ఘకాలం పాటు కలుషిత గాలి పోల్చడం, పని ప్రదేశంలోఆజ్బెస్టాస్/డిజిల్/సిలికా/ఆర్సనిక్/రెడాన్ వాయువు లను పీల్చడం, జన్యుపరంగా తల్లితండ్రుల నుంచి పిల్లలకు సోకడం లాంటి కారణాలతో కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్ రావచ్చు.

**ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి లక్షణాలు,**

ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధిగ్రస్థుల్లో దగ్గు, ఛాతి నొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శ్వాస ఆడకపోవడం, దగ్గినపుడు రక్తం పడడం, అలసిపోవడం, బలహీనత, గొంతు బొంగురు పోవడం లేదా కర స్వరం మారడం, మెడ వాపు, ఎముకల నొప్పి, న్యుమోనియా, బ్రాంకైటిస్ లాంటి పలు రోగ లక్షణాలు బయట పడతాయి.

ఊపిరి తిత్తుల క్యాన్సర్ వ్యాధి నిర్ధారణకు ఎక్స్-రే, సిటీస్కాన్,పిఈటి-సిటీ స్కాన్, బ్రాంకోస్కోపీ, బయాప్సీ, స్పూటమ్ సైటాలజీ లాంటి పరీక్షలు చేస్తారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స మార్గాల్లో సర్జరీ, కీమోథెరపీ, రేడియోథేరపీ, ఇమ్యూనోథెరపీ, పలుఅత్యాధునిక డిజిటల్ టెక్నిక్స్‌ను వినియోగిస్తున్నారు.

**ఊపిరితిత్తుల క్యాన్సర్ నివారణ మార్గాలు**

పొగ తాగడం ప్రధాన కారణంగా గుర్తించబడిన ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధి పొగ తాగని వ్యక్తులకు కూడా రావచ్చు. పొగ తాగడమనే దురవాటుకు దూరంగా ఉండడంతో పాటు త్వరగా తొలి దశలోనే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం, కలుషిత గాలి పేల్చకుండా చూసుకోవడం, పని ప్రదేశంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

తొలి దశలో గుర్తించి ఊపిరితిత్తుల క్యాన్సర్ వ్యాధిని చికిత్సతో నయం చేయవచ్చు. వ్యాధి నిర్ధారణ అయిన సందర్భంలో తగిన చికిత్సలు తీసుకోవాలి.

క్యాన్సర్ అంటే సత్వర మరణం కాదని, క్యాన్సర్‌కు కూడా చికిత్స ఉందని ధైర్యంగా ఎదుర్కొని వైద్యం చేయించుకోవాలి.

**(1 ఆగష్టు ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినం)**

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# భారత ఆధునిక జీవశాస్త్ర పితామహులు భార్గవ

పుష్ప మిత్ర భార్గవ ( ఫిబ్రవరి 22, 1928 - ఆగష్టు 1, 2017) (పి.ఎం.భార్గవ) భారత దేశపు అగ్రశ్రేణి శాస్త్రవేత్తలలో ఒకరు. సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ వ్యవస్థాపక డైరెక్టర్. భారత దేశ ఆధునిక జీవశాస్త్ర వాస్తుశిల్పిగా ప్రసిద్ధి చెందారు.

భారత దేశంలో బయోటెక్నాలజీ రంగంలో మార్గదర్శకుడు మరియు 'జెనెటిక్ ఇంజనీరింగ్' అనే పదాన్ని ఉపయోగించిన మొదటి వ్యక్తులలో ఒకరు. 70 వ దశకంలో బయో టెక్నాలజీ విభాగం ఏర్పాటులో భార్గవ కీలక పాత్ర పోషించారు. ఆయన హైదరాబాదులో మెడికల్ అవేర్ మరియు రెస్పాన్సిబుల్ సిటిజన్స్ ఛైర్మన్ కూడా. భార్గవ 1928 ఫిబ్రవరి 22 న అజ్మీర్ (రాజస్థాన్)లో ఒక మధ్య తరగతి కుటుంబంలో, వైద్యుడు, ప్రజారోగ్య నిపుణుడైన రామ్ చంద్ర భార్గవ, గాయత్రి దంపతులకు జన్మించారు. 29ఏళ్ళప్రాయంలో కుటుంబం వారణాసికి మారగా, నేరుగా తొమ్మిదవ తరగతికి నేరుగా బెసెంట్ థియోసాఫికల్ స్కూల్లో చేరారు. పాఠశాల తర్వాత, అతను ఆ సమయంలో ఉత్తర ప్రదేశ్‌లోని ఉత్తమ సంస్థలలో ఒకటైన క్వీన్స్ కాలేజీ నుండి ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. 1944లోబీఎస్సీ ఫిజిక్స్,కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్‌తో, 1446లో ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఎమ్మెస్సీ అలాగే 1949 లో 21 సంవత్సరాల వయస్సులో సింథటిక్ ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీ హెచ్ డీ పూర్తి చేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చి 1950 నుంచి 1953 మధ్య కాలంలో ప్రస్తుతం ఉన్న ఐఐసీటీలో, ఉస్మానియా యూనివర్సిటీలో పరిశోధకుడిగా పనిచేశారు. తర్వాత 1953 నుంచి 56 వరకు అమెరికా వెళ్ళి అక్కడి యూనివర్సిటీ ఆఫ్ విస్కానిసన్, మెడిసన్లో ప్రఖ్యాత శాస్త్రవేత్త హెడెల్ బర్గర్‌తో కలిసి విస్తృతమైన పరిశోధనలు చేశారు. 1956-57 వరకు లండన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ రిసెర్చ్‌లో పనిచేసి, 1977లో ఇండియాకు వచ్చి తిరిగి హైదరాబాద్ లోని సెంట్రల్ లాబొరేటరీస్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌లో చేరారు. తర్వాత ఐఐసీటీలో పనిచేస్తూనే, ఆధునిక జీవశాస్త్ర విభాగాలలో పరిశోధన సంస్థ అయిన హైదరాబాద్ సెంటర్ ఆఫ్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీని స్థాపించారు.

1977 ఏప్రిల్ 1న అది సెమీ అటానమస్ కేంద్రంగా స్థాపించ బడింది. 1990లో డైరెక్టర్ పదవి నుంచి రిటైర్ అయ్యారు. భార్గవ యునైటెడ్ స్టేట్స్, యునైటెడ్ కింగ్డమ్, ఫ్రాన్స్, జర్మనీలలో పనిచేశారు. 50 కి పైగా దేశాలలో పర్యటించారు.

భార్గవ భారత ప్రభుత్వ విధానాల గురించి బాగా తెలిసిన వ్యక్తి. నేషనల్ నాలెడ్జ్ కమిషన్‌లో వైస్ ఛైర్మన్ పదవిని పొందారు. జాతీయ భద్రతా సలహా మండలిలో సభ్యుడిగా, భారత ప్రభుత్వ జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీలో భారత సుప్రీంకోర్టు నామినీగా పనిచేశారు. భార్గవ చాలా కాలంగా సైన్స్ మరియు హేతుబద్ధతను ప్రోత్సహించడంలో, మూఢనమ్మకాలను వ్యతిరేకించడంలో పాలు పంచు కున్నారు. 1946 లో శాస్త్రవేత్తల ట్రేడ్ యూనియన్‌గాస్థాపించబడిన అసోసియేషన్ ఆఫ్ సైంటిఫిక్ వర్కర్స్ ఇన్ ఇండియాతో సంబంధం కలిగి ఉన్నారు. 1976లో 42 వ రాజ్యాంగ సవరణలో భారతదేశ పౌరుల ప్రాథమిక విధిగా శాస్త్రీయ స్వభావాన్ని పొందు పరచడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు.

అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మాలిక్యులర్ బయాలజిస్ట్ గా ఆయన అందించిన సేవలకుగాను 1986లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. భార్గవ 100 కి పైగా జాతీయ మరియు అంతర్జాతీయ గౌరవాలు, పురస్కారాలను అందుకున్నారు.

భార్గవ వేలాది ఉపన్యాసాలు ఇచ్చారు. 550 కి పైగా ప్రముఖ వ్యాసాలు, ఆరు పుస్తకాలు రాశారు. 125 కి పైగా శాస్త్రీయ పత్రాలను ప్రచురించారు.

హైదరాబాదు లోని ఉప్పల్‌లోని ఐదు అంతస్తుల నివాసంలో ఒక అంతస్తును పరిశోధనకు, మరో అంతస్తును లైబ్రరీకి కేటాయించారు. ఇటీవల వరకూ ఆయన అనేక ఫార్మా కంపెనీలకు సలహాదారుగా పని చేశారు. ఆయన సంభవన ట్రస్ట్, భోపాల్, మరియు ప్రాథమిక పరిశోధన, విద్య మరియు అభివృద్ధి సంఘం, న్యూఢిల్లీలో 2005 మరియు 2007 మధ్య నేషనల్ నాలెడ్జ్ కమిషన్ వైస్ ఛైర్మన్గా పనిచేశారు. బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక దేశ వ్యాప్తంగా అసహనం, దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని నిరసన వ్యక్తం చేస్తూ.. 2016లో పద్మభూషణ్ అవార్డును వెనక్కి ఇస్తున్నట్టు ప్రకటించారు.



భారత ప్రభుత్వం విశ్వ విద్యాలయాలలో అకడమిక్ కోర్సులను ప్రవేశపెట్టాలని మరియు జ్యోతిష శాస్త్రంలో సైన్స్ డిగ్రీలను అందించాలని నిర్ణయిం చుకుంది. దీనిని వ్యతిరేకిస్తూ ఒక రిట్ పిటిషన్ దాఖలు చేశారు. రాతపూర్వక పిటిషన్‌ను ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు తోసిపుచ్చింది. జస్టిస్ సిన్హా ఈ మెరిట్‌లెస్ పిటిషన్‌ను కోర్టుకు తీసుకు వచ్చి నందుకు ఎలాంటి శిక్షా ఖర్చులు విధించలేదు.

భార్గవ కూడా సుప్రీం కోర్టులో సంబంధిత మం త్రిత్వ శాఖను ప్రజా ప్రయోజన వ్యాజ్యం ద్వారా సవాలు చేశారు. దీనిని భారత అత్యున్నత న్యాయ స్థానం కూడా తోసిపుచ్చింది. పదవులు చేపట్టడానికి ఎప్పుడూ భయపడని, అధికారానికి ఎప్పుడూ తలవంచని, నచ్చని విషయాలను వ్యతిరేకించే వ్యక్తిత్వం ఉన్న పుష్ప మిత్ర భార్గవ ఆగస్టు1,2017 న హైదరాబాదులో మరణించారు.

**(ఆగస్టు 1న పుష్ప మిత్ర భార్గవ వర్ధంతి)**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం

- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- భారత రాష్ట్ర సమితి ముఖ్య నాయకుల సమావేశం



బెల్లంపల్లి, జూలై 31 (మనం న్యూస్): ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరోగ్యాలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అంటూ ప్రభుత్వాన్ని నిలదీసిన బెల్లంపల్లి టీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య గురువారం బెల్లంపల్లి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అధ్యక్షతన బెల్లంపల్లి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బెల్లంపల్లి నియోజకవర్గస్థాయి పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకుల సమావేశానికి అధిక సంఖ్యలో హాజరైన బెల్లంపల్లి నియోజకవర్గ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి వర్యులు ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన అనేక పథకాలను రేవంత్ ప్రభుత్వం నీరుగార్చి రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వంపైన వ్యతిరేఖత మొదలయ్యిందని తెలిపారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలందరూ పార్టీ అభ్యర్థులకే మద్దతు ఇస్తారని, కావున పార్టీ సైనికులందరూ అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాడి సమస్య పరిష్కారం అయ్యేవిధంగా చూడాలనిసూ చించారు. తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ వచ్చేది మన పార్టీ ప్రభుత్వమేనని, ఇప్పుడు పార్టీ కష్టకాలంలో ఉన్నా పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతీ ఒక్కరికీ రానున్న కాలంలో పార్టీ పరంగా మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ మరియు అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# ఆగస్టు 6న దివ్యాంగుల మహా గర్జన

- జగిత్యాలకు మందకృష్ణ మాదిగ రాక

జగిత్యాల జులై 31 (మనం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ దారులందరికి ఎన్నికల సమయంలో పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చిందని,ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలుచేయక పోవడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆగస్టు 13న హైదరాబాద్ నగరంలో నిర్వహించే దివ్యాంగుల మహాగర్జన విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్, అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్ లు కోరారు. ఈమేరకు జగిత్యాల రూరల్ మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామంలో గురువారం ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ పోడేటి సునీల్, కో ఇన్చార్జ్ నల్వాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో పెన్షన్ దారులు, దివ్యాంగులు,వద్ధులతో సమావేశం నిర్వహించారు.అయితే ఆగస్టు 6న జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎల్ జి గార్డెన్స్ లో దివ్యాంగుల మహా గర్జన నిర్వహించడం జరుగుతుందని ఈ సభకు మందకృష్ణ మాదిగ వస్తున్నారని ఈ సభను వద్ధులు వికలాంగులు ఒంటరి మహిళలు ఇతర పెన్షన్ దారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు నక్క సతీష్, పెన్షన్ దారులు, వద్ధులు, ఒంటరి మహిళలు తదితరులు పాల్గొన్నారు.




## డిప్యూటీ సూపర్డెంట్‌కు పదవి విరమణ సన్మానం

మంచిర్యాల, 31 జులై (మనం న్యూస్): శ్రీరాంపూర్ ఏరియాలోని ఏరియా స్టోర్ లో సుదీర్ఘకాలం పనిచేసి గురువారం పదవి విరమణ పొందిన డిప్యూటీ సూపర్డెంట్ వి నిరంజన్ రెడ్డిని శ్రీరాంపూర్ ఏరియా సిక్కా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయన సింగరేణి చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.ఈ కార్యక్రమంలో సిక్కా నాయకులు కన్నం సాంబయ్య, కోతి శ్రీధర్, జిల్లాల రవి, ముస్కె సమ్మయ్య, దుస్సా పోశం, పెట్టం పోశం, గోషిక మల్లేష్, బద్రి బుచ్చయ్య, నరసింహ మూర్తి,సంగీత, రమ, తోటి మినిస్టరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనానికి సరిపడా నిధులను కేటాయించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్




కరీంనగర్, జూలై 31(మనం బ్యూరో):భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల (బాయ్స్) వద్ద సర్వే నిర్వహించడం జరిగింది,విద్యార్థుల సమస్యలను తెలుసుకొని విద్యార్థులతో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి సరిపడనిధులను కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, విద్యార్థులను పట్టించుకునే పరిస్థితి ఎక్కడా లేదని వారు మండి పడ్డారు. అదేవిధంగా అరకొర నిధులతో కాలాన్ని గడిపేస్తూ విద్యార్థులకు పూర్తిగా అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు, ఫుడ్ పాయిజాన్లు రాష్ట్రవ్యాప్తంగా తరచూ చూస్తున్నాం నాసిరకమైన కూరగాయలు మరియు సామాన్లు వాటికి సంబంధించినవి వాడడం ద్వారా విద్యార్థులు తినే భోజనంలో వారు ఫుడ్ పాయిజన్లకు గురి అవుతున్నారని వారు అన్నారు. విద్యాశాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటు, విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో పర్యవేక్షించే వారు లేకపోతే విద్యార్థులకు ఏ విధంగా లాభం జరుగుతుంది అని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అన్ని శాఖలకు మంత్రులు ఉన్నారు కానీ కీలకమైన విద్యాశాఖకు మంత్రి లేకపోవడం దేనికి సంకేతం అని దీని ద్వారా పూర్తిగా విద్యార్థుల నష్టపోవాల్సిన పరిస్థితి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకానికి సరిపడా నిధులు కేటాయించి విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎడల కలెక్టరేట్ కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తాం అని తెలిపారు....

ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సందేశ్,నాయకులు సన్నీ,అభిలాష్, వాసు తదితరులు పాల్గొన్నారు.



## మాదారంలో వైద్య శిబిరం

తాండూర్ జూలై 31 మనం న్యూస్: మండలంలోని మాదారం టౌన్షిప్ లో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 32 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. 22 మందికి బిపి, 15 మందికి మలేరియా, 10 మందికి షుగర్ పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. కూలర్, టబ్బులలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాజా ఆహారాన్ని తీసుకోవాలని ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. ఎవరికైనా జ్వరాలు వస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వచ్చి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మ, గ్రామ కార్యదర్శి సౌందర్య, ఆశా కార్యకర్త మల్లేశ్వరి, ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ప్రవేశం కొరకు దరఖాస్తుల స్వీకరణ



నస్పూర్, జులై 31, 2025,మనం న్యూస్: 2025-26 విద్యా సంవత్సరానికి గాను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో మొదటి తరగతిలో ప్రవేశం కొరకు షెడ్యూల్డ్ కులములకు చెందిన విద్యార్థినీ, విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్-బేగంపేట నందు జిల్లాకు 2 సీట్లు కేటాయించడం జరిగిందని, అభ్యర్థులు జిల్లా వాసులై జూన్ 1, 2018 నుండి మే 31, 2019 మధ్య జన్మించి ఉండాలని, జనన ధృవీకరణ పత్రం తప్పనిసరిగా మీ-సేవ / మున్సిపల్ - కార్పొరేషన్ / తహశీల్దార్ ద్వారా జారీ చేయబడి ఉండాలని, కుల ధృవీకరణ పత్రం తప్పనిసరిగా విద్యార్థి పేరిట జారీ చేయబడినదై ఉండాలని తెలిపారు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి 1 లక్షా 50 వేల రూపాయలు, పట్టణ ప్రాంతాల వారికి 2 లక్షల రూపాయల లోపు ఉండాలని తెలిపారు. అభ్యర్థులు కుల, ఆదాయ, జనన ధృవీకరణ పత్రాలు, ఆధార్కార్డు, రేషన్కార్డు ఇతర ధృవపత్రాలతో ఆగస్టు 8వ తేదీ సాయంత్రం 5గంటలలోగా దరఖాస్తు సమర్పించాలని, ఆగస్టు 10వ తేదీన నియామక కమిటీ ద్వారా లాటరీ పద్ధతిన అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



## నూతన రూట్ సర్వీస్ బస్సును ప్రారంభించిన సంక్షేమ శాఖ మంత్రి

గొల్లపల్లి, జూలై 31( మనం న్యూస్): గొల్లపల్లి మండలంలోని మల్లన్నపేట్ గ్రామంలో మల్లన్నపేట, శంకర్రావుపేట, వెంగలపూర్, నందిపల్లె మీదుగా నడిచే నూతన రూట్ ఆర్టీసీ బస్సు సర్వీస్ ను గురువారం రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నాయకులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందు మంత్రి మల్లన్నపేట్ గ్రామంలోని శ్రీ మల్లన్న స్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఏర్పాటు చేయాలి

- జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ వినతి

జగిత్యాల జులై 31 (మనం న్యూస్): యాసంగిలో పండించిన సన్న వడ్ల కు బోనస్ ఇప్పించాలని అలాగే రైతులకు సరిపడే యూరియా నిల్వలు అందుబాటులో ఉంచాలని, క్రాఫ్ట్ డ్యామేజ్ డబ్బులు వెంటనే నేరుగా రైతుల ఖాతాలో జమ చేయాలని,కోరుతూ జగిత్యాల జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు, వ్యవసాయ అధికారి,జిల్లా వెటర్నరీ అధికారులకు వేర్వేరుగా కలిసి వినతి పత్రం అందజేశారు. జగిత్యాల జిల్లాలో యాసంగి సీజన్ లో పండించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్మిన సన్న వరిధాన్యం కు ఇంతవరకు బోనస్ డబ్బులు రాలేదనీ,రైతులకు బకాయి పడ్డ రావల్సిన బోనస్ డబ్బులు వెంటనే అందజేయాలని అలాగే జిల్లాలో యూరియా కత్రిమ కొరత సష్టించి రైతులకు యూరియ అందుబాటు లేకుండా చేస్తున్నారనీ.నాలుగు బస్తాలు అవసరం ఉంటే ఒకటి మాత్రమే ఇస్తున్నారనీ, రైతులకు గతం లో మాదిరిగా అవసరం ఉన్నంత మేరకు సరఫరా చేయాలని. కత్రిమ కొరత సష్టించే వ్యాపారులు,దానికి సహకరించే అధికార్ల పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అలాగే గత ఆరు నెలలుగా మండల పశువైద్య కేంద్రాలలో మందులు సరఫరా నిలిచిపోయిందని మందుల కొరత లేకుండా చూడాలని కోరుతూ జిల్లా బి కే ఎస్ ఆధ్వర్యంలో వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు జిల్లా ఇన్చార్జ్ చేపూరి విజయభాస్కర్,కొండి లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్ప రాజేందర్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు నోముల నరసింహారెడ్డి, ముద్దం గంగారెడ్డి,మిట్టపల్లి తిరుపతి రెడ్డి,చల్ల సురేందర్, ఏనుగు తిరుమల్,బూస మల్లేశం, తిరుమల శంకర్, బి కే ఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రపతి భవన్‌ని సందర్శించిన గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు




పెద్దపల్లి జులై 31 (మనం న్యూస్):పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ కి చెందిన విద్యార్థినీ విద్యార్థులు గురువారం హైదరాబాద్ లోని చారిత్రాత్మకమైన రాష్ట్రపతి భవన్ ను సందర్శించారు. ఈ సందర్శన సందర్భంగా విద్యార్థులు రాష్ట్రపతి భవన్ చరిత్ర, నిర్మాణ శైలి, ఇందులో ఉన్న ముఖ్యమైన సదుపాయాల గురించి తెలుసుకున్నారు. అక్కడి గైడ్ల సహాయంతో వారికి ప్రాంగణంలోని ప్రధాన హాల్స్, సమావేశ మందిరాలు మరియు రాష్ట్రపతి అధికారిక కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశాలపై పూర్తి అవగాహన కలుగజేయబడింది. ఈ సందర్భంగా గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ భారత రాష్ట్రపతి అధికారిక నివాసాల్లో ఒకటైన ఈ భవన సముదాయం విద్యార్థుల్లో జాతీయ గౌరవాన్ని, ప్రజాస్వామ్య పరిరక్షణపై అవగాహనను పెంపొందించేందుకు ఒక అద్భుతమైన వేదికగా నిలిచిందన్నారు. ఈ సందర్శన విద్యార్థులకు ఒక స్ఫూర్తిదాయకమైన అనుభూతిని కలిగించిందని తెలిపారు. విద్యార్థుల్లో జాతీయతాభావన, చరిత్ర పట్ల గౌరవం, ప్రభుత్వ వ్యవస్థలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి ప్రయాణాలు ఎంతో అవసరమని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్శన ఏర్పాట్లు చేయడంలో సహకరించిన అధికారులకు, రాష్ట్రపతి భవన్ సిబ్బందికి గాయత్రి విద్యానికేతన్ యాజమాన్యం తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్శనలో కరెస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, దీపిక, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో పనిచేశాము నిధులు ఇప్పించండి

- నాలుగేళ్ల క్రితం పనులు చేస్తే ఇప్పటికీ బిల్లులు ఇస్తలేరు కలెక్టర్ ను వేడుకుంటున్న కాంట్రాక్టర్లు




ముత్తారం, జులై 31 (మనం న్యూస్): పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో అభివద్ధి పనులు చేశామని, మాకు నిధులు ఇప్పించండి సార్ అంటూ ముత్తారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో కాంట్రాక్టర్లు జిల్లా కలెక్టర్ ను వేడుకున్నారు. బుధవారం విలేకరుల సమావేశం లో కాంట్రాక్టర్లు తాత చేరాలు, పింగిలి దేవేందర్ రెడ్డిలు మాట్లాడుతూ గత నాలుగేళ్ల క్రితం పాఠశాల లో మరుగుదొడ్లు నిర్మించామని, అలాగే ప్రహరీ గోడ పనులు చేశామని, అట్టి పనికి గాను మూడు లక్షల రూపాయలు అగ్రిమెంటు కాగా అగ్రిమెంట్ అయినప్పుడు ఉన్న ఏఈ ట్రాన్స్ఫర్ కాగా మరో ఏఈ,విధులలో చేరగా ఇంకొక 50 వేల రూపాయలు పని అయితే ఆ పని మొత్తం కంప్లీట్ అయితదని తెలపడంతో మేము ఆ పని చేయడానికి ముందుకు రాగా అప్పుడున్న ఏఈ,అమ్మ ఆదర్శ పాఠశాల కింద వచ్చే బిల్లులో మీకు 50 వేల రూపాయల బిల్లు పెడతామని చెప్పగా మేము ఆ వర్క్ చేశామని , మీగిత బిల్లు ఇప్పటికీ వరకు పాఠశాల విద్య కమిటీ ఇస్తలేరని వారు అవేదన వ్యక్తం చేశారు. ఈ బిల్లుల కోసం ఎంపీడీవో పంచాయతీరాజ్ ఏఈ లను అడుగగా, విద్య కమిటీ నిధుల నుంచి మీకు బిల్లులు ఇప్పిస్తామని తెలిపారని, బిల్లు ఇప్పటివరకు రాలేదని, ఇప్పటికి ఎన్నోసార్లు పాఠశాల హెడ్మాస్టర్ ఓదెలను అడగగా మీ బిల్లు ఇంకా రాలేదని దాటే వేశారని, పాఠశాల అభివద్ధికి మేము పనులు చేసి ఆర్థికంగా నష్టపోయామని, ఆ విషయం గ్రామస్తులకు పాఠశాల అప్పటి విద్య కమిటీ చైర్మన్, డైరెక్టర్లకు కూడా తెలుసని, అయినప్పటికీ తమకు నిధులు ఇవ్వకుండా హెడ్మాస్టర్, విద్యా కమిటీ చైర్మన్ ఇబ్బంది పెడుతున్నారని వారు ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయనున్నట్లు కాంట్రాక్టర్లు తెలిపారు.

# మంత్రుల పర్యటనకు పగడ్బందీ ఏర్పాట్లు

- అంతర్గాం పోలీస్ శాఖ



గోదావరిఖని/అంతర్గాం, జూలై 31 (మనం న్యూస్): పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలోని అంతర్గాం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆగస్ట్ 3న అంతర్గాం మండలంలో మంత్రుల పర్యటన సందర్భంగా అధికారులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీలకు సంబంధం లేకుండా అంతర్గాం పోలీస్ శాఖ ప్రత్యేక చొరవ తీసుకొని మంత్రుల సభను విజయవంతం చేసేందుకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయడానికి పిచ్చి మొక్కలను బ్లేడు ట్రాక్టర్ తో తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంతర్గాం మండల కేంద్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రారంభించడానికి విచ్చేస్తున్నటువంటి తెలంగాణ రాష్ట్ర మంత్రులు సభకు నియోజకవర్గంలోని ప్రజలు వేలాదిమంది రావడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు కుర్చీలు, పార్కింగ్, ఇతర వెహికల్స్ కు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చొరవ తీసుకొని ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

- పెద్దంపేటలో వన మెత్సవ కార్యక్రమం
- పర్యావరణ రక్షణ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
- రామగుండం ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్



గోదావరిఖని/అంతర్గాం, జూలై 31 (మనం న్యూస్): పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలో వన మెత్సవ కార్యక్రమంలో భాగంగా రామగుండం ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఖర్జూర మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రామగుండం ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ... మొక్కను కాపాడే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉంటుందని, పచ్చదనం పెంచేందుకు కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రాణవాయువును పెంచే విధంగా వర్షాలు పడేందుకు చెట్లు ఉపయోగపడతాయని, వాతావరణంలోని విషవాయువులను ఎదుర్కోవాలంటే ఇంటింటికో మొక్క తప్పకుండా మొక్కలు నాటాలని, ఈ మొక్కలు నాటడం ద్వారా వర్షాలు పడే విధంగా ఉపయోగపడతాయని, వర్షాలు పడడం ద్వారా రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అనే విధంగా ప్రతి కుటుంబ సభ్యులు ఇంటింటికో మొక్క నాటాలని, ఇలాంటి విధానాన్ని పాటించినప్పుడే వక్షో రక్షతి రక్షితః అనే విధంగా ప్రజలు ముందుకు వెళ్తారని రామగుండం ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దంపేట గౌడ సంఘం ప్రెసిడెంట్ మెరుగు కుమార్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ బైరి సురేష్ గౌడ్, గ్రామ ప్రతినిధులు పల్లెర్ల శ్రీనివాస్ గౌడ్, బండి విజయ్ గౌడ్, కానంపల్లి మల్లేష్, మెరుగు చంద్రయ్య గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజయ్య, ఎక్సైజ్ కానిస్టేబుల్స్ రఘు, గీత తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

- ప్రభుత్వ దవాఖానాల్లోనే వైద్యం చేయించుకోవాలి
- సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి
- సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి





చిన్నకోడూరు, జూలై 31(మనం న్యూస్): త్వరితగతిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను చేపట్టి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రమైన చిన్నకోడూరులో గురువారం నాడు ఆకస్మిక పర్యటన చేశారు. ఎంపిడిఓ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిపై ఎంపిడిఓ జనార్ధన్ తో సమీక్ష నిర్వహించారు. మండల వ్యాప్తంగా 521 ఇండ్లు మంజూరు కాగా 300 ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించడం జరిగిందని అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్న 17 ఇండ్లలో ప్రారంభించిన 15 ఇండ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఎంపిడిఓను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల్లో భాగంగా స్వీకరించిన భూ భారతి దరఖాస్తులను పరిశీలించి దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించి నోటీసులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. పోస్ట్ ఆఫీస్ సందర్శించి ముఖ గుర్తింపు పద్ధతి ద్వారా పింఛన్ అందజేస్తున్న పద్దతిని పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ పింఛన్ వస్తుందా లేదా ఆరా తీసారు. సాంకేతిక సమస్యలతో కూడిన ఇబ్బంది లేకుండా లబ్దిదారులకు నిర్ణీత సమయంలో పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆగ్రోస్ సేవా కేంద్రాన్ని సందర్శించి ఎరువుల సరఫరా రిజిస్టర్ పరిశీలించారు. ఆక్రమంగా ఎరువుల సరఫరా జరగకుండా చూడాలని, ఎప్పటికప్పుడు ఎరువులు తీసుకునే రైతుల వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. మొదటగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యం అందించే తీరును పరిశీలించారు. అటెండెన్స్ రిజిష్టర్ క్షుణ్ణంగా పరిశీలించి అనుమతి లేనిదే ఎవరికీ సెలవులను మంజూరు చేయవద్దన్నారు. వైద్యశాలలోని గదులను పరిశీలించి ల్యాబ్ లో ఎలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన మెడిసిన్ లు పరిశీలించి కాలం చెల్లిన మందులను వాడొద్దని సూచించారు. రోగులతో మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందిస్తున్నారా, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యం చేయించుకోవాలని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉన్నారన్నారు. గ్రామాలలో ప్రెగ్నెన్సీ మహిళల వివరాలను పొందుపరిచి ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సలీమ్, ఎంపి ఓ సోమిరెడ్డి, వ్యవసాయ అధికారులు, ఆయా సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# మెనూ ప్రకారం భోజనం ఉండాలి

- నాణ్యతలో రాజీ పడితే సహించేది లేదు
- సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట రూరల్, జూలై 31(మనం న్యూస్): మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదిని పరిశీలించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం వండుతున్న వంటలను, విద్యార్థులకు రోజువారీగా ఇవ్వాల్సిన మెనూ పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు వండి పెట్టాల్సిన బగారా అన్నం, మిక్స్ డు వెజిటబుల్ కర్రీని వండకుండా సాధారణ అన్నం, మిల్ మేకర్ కర్రీ, చింతపులుసు చారును మాత్రమే వండడంతో పాటు 95 మంది విద్యార్థులకు ఉండాల్సిన ఏడు కిలోల కూరగాయలకు బదులు చాలా తక్కువ క్వాంటిటీలో వండడంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసారు.

మధ్యాహ్న భోజనం నిర్వాహకులు ఇంకోసారి ఇలా చేయమని క్షమించాలని జిల్లా కలెక్టర్ ను రాతపూర్వకంగా వేడుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరోసారి స్కూలుకు వస్తానని, మెనూ ప్రకారం ఆహారం వండకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మధ్యాహ్న భోజన నిర్వాహకులను హెచ్చరించారు. అలాగే మధ్యాహ్నం భోజనంలో మెనూ ప్రకారం ఆహారం అందించేలా పర్యవేక్షించాలని ఇన్చార్జి హెచ్ఎంను ఆదేశించారు.

# ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు



- భారతినగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

రామచంద్రపురం, జూలై 31(మనం న్యూస్): ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు. భారతి నగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీలో కమ్యూనిటీ హాల్లో మిగిలిన పనులకు కార్పొరేటర్ సింధు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.22 లక్షల వ్యయంతో స్టార్ రూమ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, స్టోర్ రూమ్, ఫ్లోరింగ్ వంటి పనులు చేపట్టనున్నట్లు కార్పొరేటర్ తెలిపారు. ఎల్ఐజీ కాలనీలో జరుగుతున్న వాటర్ డ్రైన్ పనులు, బొంబాయి కాలనీ లోని కమ్యూనిటీ హాల్ పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఏఈ ఫైజాన్, ఎల్ఐజీ కాలనీ అధ్యక్షులు యాదగిరి రెడ్డి, బీఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ చిన్న, మ్యాక్ సొసైటీ కాలనీ అధ్యక్షులు సలీం, సెక్రటరీ నందగోపాల్, డైరెక్టర్లు పాపయ్య, దుర్గా రెడ్డి, రామరావు, మహిళా నాయకురాలు కళ్యాణి, నిర్మల, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్యం

- జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య



సంగారెడ్డి జూలై 31 మనం న్యూస్ ప్రతినిధి: కంది మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నిజిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ... వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా? అందరూ విధులకు హాజరయ్యారా? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు . ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను, సిబ్బంది హాజరు వివరాలను, క్షేత్రస్థాయిలో ఆరోగ్య సర్వే, నివేదికల రిజిస్టర్లను తనిఖీ చేశారు . ఆసుపత్రిలో రోజూ వచ్చే ఓపి పేషెంట్ల సంఖ్య, ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. అలాగే రోగులకు ఇచ్చే మందుల చీటీలను అర్థమయ్యే రీతిలో వ్రాయాలని సూచించారు. ఆసుపత్రిలో ఉన్న బెడ్ల సంఖ్య, నెలవారీగా జరిగే డెలివరీల గణాంకాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మెడిసిన్స్ అందుబాటులో ఉండేలా చూడాలని, మందుల కొరత లేకుండా ముందుగానే సరఫరా చేసుకోవాలన్నారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి, అవసరమైన సమయంలో చికిత్స అందించాలని స్పష్టంగా తెలిపారు. తనిఖీల సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో కూడా కలెక్టర్ మాట్లాడారు. వారికి అందుతున్న వైద్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మంచి వైద్యం అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం నిబద్ధతతో పనిచేయాలని ఆమె తెలిపారు. ఈ తనిఖీలో స్థానిక వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ బతుకు చిత్రాల ప్రదర్శన

## రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో వరల్డ్ పెయింటింగ్ డే



సిద్దిపేట అర్బన్, జూలై 31(మనం న్యూస్): వరల్ పెయింటింగ్ డే పురస్కరించుకొని తెలంగాణ బతుకు చిత్రాల ద్వారా తెలంగాణ అస్థిత్వాన్ని, జీవన విధానాన్ని తెలిసేలా రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో తెలంగాణ బతుకు చిత్రాల ప్రదర్శనను అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చిత్రాన్ని చిత్తరువు, చిత్రలేఖనం, పెయింటింగ్ అని, ఆదిమానవుని ప్రస్థావన ప్రకృతిలో ఉరుములకు మెరుపులకు భయపడి గుహలల్లో దాక్కొని శక్తి ఆకారాన్ని గీసుకొని శరను పొందాడని, దైనందిన జీవన విధానాన్ని రాళ్ల పై చెక్కుకొని నాటినుండి నేటివరకు చిత్రకళ ఎన్నో రకాలుగా రూపాంతరం చెందిందన్నారు. రకరకాల పేపర్స్, క్యాన్వాస్ ప్రకృతిలో ప్రతి వస్తువు సంస్కృతులపై చిత్రకళ తన ప్రభావాన్ని ఉనికిని చాటుకొని ఆధునిక యుగంలో డ్రాయింగ్, డిజైన్, స్కల్ప్చర్, పెయింటింగ్ ప్రార్థనా, గుళ్ళూ గోపురాలు శిల్పాలు ఆర్కిటెక్ డ్యాములు ఇంజనీరింగ్ వైద్య విద్య వ్యాపార సినిమా, ప్రెస్ చరిత్ర ప్రపంచ సంస్క ృతి ఇతర వాటిపై చిత్రకళ పెయింటింగ్ రేఖా రంగుల విన్యాస ప్రభావం ప్రతి రంగంపై పులుముకుందన్నారు. ఆగస్టు 1న వరల్ పెయింటింగ్ డే అందరి జీవితాలను కళావంతం చేయాలని ఐక్యత శాంతి సౌభాగ్యాలను పెంపొందించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎ ఎఫ్ అధ్యక్షురాలు జులేఖరుస్తుం, నైరూప్య చిత్ర కారుడు నహీంరుస్తుం, నేచర్ ఆర్టిస్ట్ రూబినారుస్తుం, ఎండి రహీం తదితరులు పాల్గొన్నారు.

# భార్యను చంపిన కేసులో యావజ్జీవ జైలు శిక్ష

- సిద్దిపేట పోలీస్ కమీషనర్ డా. బి. అనురాధ



సిద్దిపేట, జూలై 31(మనం న్యూస్): ప్రతినిధి: భార్యను చంపిన కేసులో కోర్టు ఓ వ్యక్తికి యావజ్జీవ శిక్ష వేసినట్లు సిద్దిపేట పోలీస్ కమీషనర్ డా. బి. అనురాధ తెలిపారు. సీపీ తెలిపిన వివరాల ప్రకారం చిన్నకోడూరు మండలం విఠలాపూర్ గ్రామానికి చెందిన గంగసాని శ్రీనివాస్ రెడ్డికి కర్ణాటక రాష్ట్రం రాయచూర్ కు చెందిన ఇందిరతో వివాహం జరిగింది. కాగా ఆమెను అదనపు కట్నం తీసుకురావాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ 2019 ఏప్రిల్ 9వ తేదీన రాత్రి సమయంలో తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పగా 10వ తేదీన ఉదయం ఇందిర చనిపోయినట్లు సమాచారం అందింది. ఈ మేరకు మృతురాలి సోదరుడు గట్టు వీరేష్ రెడ్డి ఫిర్యాదు మేరకు నాటి చిన్నకోడూరు ఎస్.ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, నాటి నుండి జరిగిన దర్యాప్తు అనంతరం గురువారం నాడు సిద్దిపేట జిల్లా ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ కోర్టులో జడ్జి కేసు విచారించారు. విచారణ అనంతరం నేరస్తుడు గంగసాని శ్రీనివాస్ రెడ్డి తన భార్య గొంతు నలిపి చంపినట్లు నిర్ధారణ కావడంతో నేరస్తునికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిని సిద్దిపేట ఏసిపి రవిందర్ రెడ్డి, రూరల్ సిఐ శ్రీను, నాటి చిన్నకోడూరు ఎస్.ఐ. బాలకృష్ణ తోపాటు సిబ్బందిని సీపీ అభినందించారు.

# నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్



- రూ.2 లక్షల 50 వేల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే జీఎంఆర్

రామచంద్రపురం, జూలై 31(మనం న్యూస్): నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీకి చెందిన బిక్షపతి గత కొంతకాలంగా అనారోగ్యంలో బాధపడుతున్నారు. స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. చికిత్స నిమిత్తం రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి మంజూరు అయింది. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిక్షపతి కుటుంబ సభ్యులకు ఎల్ఓసి అనుమతి పత్రాలను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అందజేశారు.

# ఉపకారవేతన విద్యతోనే సాధికారత

- వీసీ ఘంటా చక్రపాణి

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఉపకారవేతన ఆధారిత విధ్యాభ్యాసంతోనే ప్రతి విద్యార్థికి సాధికారత లభిస్తుందని అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ వీసీ ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. విద్యార్థుల్లో చదువుతో పాటు నైపుణ్యాన్ని పెంపొందిస్తూ వారికి చదువుతో పాటు స్టైఫండ్ అందిస్తూ వారి కాళ్ళపైన వారే నిలపడేలా డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం రిటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ అఫ్ ఇండియా ఆధ్వరంలో గురువారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. అంబేద్కర్ విశ్వవిద్యాలయ విద్యార్థులకు చదువుతో పాటు, స్టైఫండ్‌ను నెలకు కనీసంగా రూ. ఏడు వేల నుంచి గరిష్టంగా రూ. 24 వేల వరకు వారి స్కిల్స్‌ను బట్టి అంత కంటే ఎక్కువ సంపాదించుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి చదువుతో పాటు స్కిల్స్ పెంపొందించడం, ఉద్యోగ అవకాశం కల్పించడం, వ్యాపారవేత్తలుగా తయారు చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్ ని దృష్టిలో పెట్టుకొని రానున్న రోజుల్లో ప్రఖ్యాత సంస్థలతో మరిన్ని ఉద్యోగ మేళాలను ఏర్పాటు చేస్తామని వెల్లండించారు. స్టైఫండ్ ఆధారిత విద్యను (స్టైఫండ్ బేస్డ్ అప్రెంటిషిప్ ప్రోగ్రాం) సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. తమ విశ్వవిద్యాలయంలో చేరి స్టైఫండ్ ఆధారిత డిగ్రీ పూర్తవగానే వారి వారి సామర్థ్యం మేరకు వారిని ఆయా సంస్థల్లో ఇంచార్జ్ లుగా, మేనేజర్ స్థాయికి ఎదిగేలా ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థిని తీర్చిదిద్దడమే తమ కర్తవ్యమని పేర్కొన్నారు. మహిళా విద్యార్థినులను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడం కోసం తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకుందని అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని మహిళల్లో సరికొత్త ఆవిష్కరణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ద్వారా వారిలో ఆర్థిక సామర్థ్యం సమాజ అభివృద్ధికి ఉపయోగపడుతుందని వివరించారు. వి-హబ్‌తో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకమైన అవగాహనా ఒప్పందం కుదుర్చుకుందని గుర్తుచేశారు. వ్యూహాత్మక నైపుణ్య సహకారాలను అందించే భాగస్వామ్యలతో స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ ద్వార గ్రామీణ, గిరిజన విద్యార్థులకు స్వల్పకాలిక వృత్తి విద్యా కోర్సులను అందిస్తామని వెల్లండించారు. ఈ కోర్సులో ఇప్పటి వరకు వెబ్ సైట్ ద్వారా నమోదు చేసుకొని ఫీజు చెల్లించిన విద్యార్థులకు త్వరలోనే ఆయా సంస్థల్లో ఉద్యోగాలు అందించనున్నట్లు వెల్లడించారు. వ్యక్తిగతంగా ప్రతి విద్యార్థికీ ప్రయోజనం కలిగించేందుకు తమ సంస్థ పనిచేస్తుందని, ఉద్యోగానికి సిద్ధంగా ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి వారికి చదువుకుంటున్నప్పుడే వారికి ఆర్థికంగా సహాయ పడేలా స్టయిఫండ్ అందించనున్నట్లు వెల్లడించారు.

# గద్దర్ ఫౌండేషన్‌కు స్థలం, నిధులు కేటాయించాలి

- గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండవ వర్ధంతి పోస్టర్ ఆవిష్కరణ



హైదరాబాద్, మనం ప్రతినిధి : ఈ నెల 6న ప్రజా గాయకుడు గద్దర్ రెండవ వర్ధంతి సభను గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. గద్దర్ వర్ధంతికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన కుమారుడు సూర్యం, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, సింగర్ యశపాల్, ఉద్యమ నేత కోట శ్రీనివాస్, సినియర్ జర్నలిస్ట్ మల్లారెడ్డితో కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. గద్దర్ పాట, ఆట, మాటలను వినియోగించుకొని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, అనంతరం ఆయనకు తగిన గౌరవం ఇవ్వడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుయ్యబట్టారు. ఇది గద్దర్ పట్ల కృతజ్ఞతారాహిత్యానికి నిదర్శనం అని విమర్శించారు. గద్దర్ పేరుతో అవార్డు పెట్టి, ఆ అవార్డులో ఆయన ఆనవాళ్లు కూడా లేకుండా చేయడం అత్యంత బాధాకరం అని, ఇది గద్దర్‌ని అవమానించడమేనని శ్రవణ్ అన్నారు. 'ఓడలో ఉన్నప్పుడు ఓడ మల్లయ్య... ఓడ దిగిన తర్వాత బోడ మల్లయ్య' అన్నట్లు - ఆయనను ఉపయోగించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత, గద్దర్ గుర్తులే లేకుండా ఆయన పేరుతో అవార్డులను నిర్వహణ, నిధులు ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడం,స్థలం ఇస్తా అని ఇవ్వకపోవటం ఇవన్నీ ఆయనను అవమానించడమేనని దాసోజు శ్రవణ్ హితవు పలికారు. ఇది ప్రభుత్వ కృతజ్ఞతారాహిత్యానికి సజీవ సాక్ష్యం, అని వ్యాఖ్యానించారు. గద్దర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ ఫౌండేషన్ ద్వారా పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు చేపట్టాలని, ఆ ఆశయాలకు అనుగుణంగా కార్యాచరణ కొనసాగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గద్దర్ రెండవ వర్ధంతి నాటికి ఫౌండేషన్‌కు స్థలం కేటాయించడంతో పాటు, అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేయాలని డా. శ్రవణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గద్దర్ జీవితం ఒక ఉద్యమానికి ప్రతీక. ఆయన కలలు, ఆశయాలు నిలదొక్కుకునేలా చేయడం ప్రభుత్వ బాధ్యత, అని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు.

# విద్యార్థుల మేధస్సును వెలికి తీయడానికి డిజిటల్ తరగతులు నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య .
- విద్యార్థులకు డిజిటల్ క్లాసునుబోధించిన కలెక్టర్ .

సంగారెడ్డి జూలై 31 మనం న్యూస్ ప్రతినిధి: కంది మండలకేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ఆకస్మికగా సందర్శించారు . ఈ సందర్భముగా విద్యార్థులకు అందిస్తున్న విద్యా, ఆహారం తదితర అంశాలపై కలెక్టర్ పరిశీలించారు . ప్రభుత్వ పాఠశాలలలో సకలసదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తరగతిలో విద్యార్థులతో కలిసి కూర్చుని ఉపాధ్యాయురాలు బోధించే విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, తాను కూడా విద్యార్థులకు డిజిటల్ తరగతిని బోధించారు. విద్యార్థుల మేధస్సును వెలికితీయడం కోసం డిజిటల్ పాఠాలు కీలకమని తెలిపారు. ఉపాధ్యాయులు ఈ దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఆరోగ్యం , విద్య , ఆహార నాణ్యతలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని , నూతన డైట్ మెనూ ప్రకారం ప్రతి ఒక్కరికి మంచి ఆహారాన్ని అందించాలని సూచించారు, ఆహార నాణ్యతను పరిశీలించారు . పాఠశాల ఆవరణలలో క్రమం తప్పకుండా సానిటేషన్ నిర్వహిస్తూ ఉండాలని,సూచించారు. పిల్లల యొక్క మేధస్సును వెలికి తీయడం కోసం డిజిటల్ క్లాసులు నిర్వహిస్తూ ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ బడుల్లో గణనీయంగా విద్యార్థుల అడ్మిషన్లు, హాజరు శాతం పెరిగినందున అందుకు అనుగుణంగా వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని పాఠశాల ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు , సంబంధిత అధికారులు ,తదితరులు పాల్గొన్నారు .



# పిల్లలను మణిరత్నాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- 8 నుంచి ఇంటర్ వరకు చదివే ఆడపిల్లలకు సైకిల్స్ పంపిణీ
- 5 కోట్ల 50 లక్షలతో నిర్మించనున్న జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన
- 470 కోట్లతో పాలేరు నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి చర్యలు
- కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన మంత్రి పొంగులేటి





**ఖమ్మం/కూసుమంచి, జూలై 31(మనం న్యూస్):** ఎన్ని ఆర్థిక ఇబ్బందులు, కష్టాలు ఉన్నా పిల్లలను మణిరత్నాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కూసుమంచిలో మంత్రి పొంగులేటి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి గురువారం పర్యటించారు. 5 కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జిల్లా పరిషత్ హైస్కూల్ లో పి.ఎస్.ఆర్. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ చేశారు. లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం కూసుమంచి మండలంలో 5 కోట్ల 50 లక్షలతో జూనియర్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. డిసెంబర్ చివరి వరకు పనులు పూర్తి చేసి జూనియర్ కళాశాలను ఈ సంవత్సరంలోనే ప్రారంభిస్తామని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో 8 నుంచి 10వ తరగతి చదివే ఆడ పిల్లలకు గత సంవత్సరం సైకిళ్ళను పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం 8వ తరగతి వచ్చిన విద్యార్థినులకు సైకిళ్ళు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం 8 నుంచి ఇంటర్ వరకు చదివే బాలికలకు సైకిల్స్ అందిస్తానని అన్నారు. విద్యారంగంలో కాస్త వెనుకబడి ఉన్న పాలేరు నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. గత 20 నెలల కాలంలో 470 కోట్ల రూపాయలను పాలేరు నియోజకవర్గంలోని విద్యారంగానికి మంజూరు చేశామన్నారు. 200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులం, 208 కోట్లతో జే.ఎన్.టి.యూ, ఇంజనీరింగ్ కాలేజీ, 46 కోట్లతో ఐటిఐ కళాశాల, 5.5 కోట్ల జూనియర్ కళాశాల, తిరుమలాయపాలెం హాస్టల్ 2 కోట్ల 70 లక్షలు మంజూరు చేశామన్నారు. గురుకులాల్లో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని లక్ష్యంతో 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలను పెంచామన్నారు. హైదరాబాద్ సమీపంలో అభివృద్ధి చేస్తున్న ఫోర్త్ సీటీలో పిల్లలకు నైపుణ్యం నేర్పించేందుకు స్కిల్ యూనివర్సిటీ నిర్మిస్తున్నామన్నారు. ఆర్థికంగా ఎన్ని కష్టాలు ఉన్నా పేద పిల్లలను మణి రత్నాలుగా తీర్చిదిద్దుతామన్నారు. పిల్లలకు ప్రభుత్వం సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. పాఠశాలలో 3 కంప్యూటర్ ట్రైనింగ్ ట్యూటర్‌లను నియమించేందుకు 3 లక్షల నిధులు మంత్రి మంజూరు చేశారు. పాఠశాల కాంపౌండ్ వాల్ తో పాటు పాఠశాలకు ఆదాయం వచ్చేలా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ విద్యా, వైద్య రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు మంజూరు చేస్తుందన్నారు. జూనియర్ కళాశాలను డిసెంబర్ చివరి నాటికి సిద్దం చేస్తామన్నారు. ప్రస్తుత స్కూల్ లో 177 మంది విద్యార్థులు 10వ తరగతీ చదువుతున్నారని, ఇక్కడ జూనియర్ కళాశాల రావడం చాలా సంతోషకరమని అన్నారు. పాఠశాలకు రెగ్యులర్ గా వచ్చేందుకు ఆడపిల్లలకు దోహదపడేలా మంత్రివర్యులు ట్రస్ట్ ద్వారా సైకిళ్ళు పంపిణీ చేస్తున్నారన్నారు. చదువు మించిన ఆస్తి మరోకటి లేదని, చదువు ఉంటే జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగేందుకు అవకాశం లభిస్తుందని అన్నారు. పీఎం శ్రీ క్రింద ఈ పాఠశాలను ఎంపిక చేసి ల్యాబ్, ఏఐ టూల్స్ ద్వారా విద్యా బోధన వంటి అనేక సౌకర్యాలను కల్పించామని, పిల్లలు ఈ సదుపాయాలను వినియోగించుకుంటూ బాగా చదువు కోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కూసుమంచి మండలానికి చెందిన 75 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పిల్లలకు సైకిళ్లను అందజేసి మంత్రివర్యులు, జిల్లా కలెక్టర్ స్కూల్ ఆవరణలో సైకిల్ నడిపి పిల్లల్లో ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయం నిర్మాణానికి ప్రణాళికలు

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన మంత్రి

**ఖమ్మంరూరల్, జూలై 31(మనం న్యూస్):** సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయ భవన నిర్మాణానికి ప్రణాళిక తయారు చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతం తరుణీ హాట్ వద్ద నిర్మించనున్న సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణ స్థలాన్ని మంత్రి పొంగులేటి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పరిశీలించారు. సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణ డ్రాఫ్ట్ ప్లాన్ వివరాలను ఆర్ అండ్ బీ అధికారులు, జిల్లా కలెక్టర్ ల నుంచి మంత్రివర్యులు తెలుసుకొని పలు సూచనలు చేశారు..ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణ స్థలం పూర్తి స్థాయిలో చదును చేయాలని అన్నారు. ఈ స్థలంలో పాతబడిన, అనవసరమైన నిర్మాణాలను పూర్తి స్థాయిలో తొలగించాలని మంత్రి సూచించారు. మండల స్థాయిలో ప్రజల సౌకర్యార్థం అన్ని కార్యాలయాలు ఒకే చోట అన్ని వసతులతో ఉండే విధంగా నిర్మించాలని, దీనికి తగిన విధంగా ప్రణాళికలు, డిజైన్ తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. మండల స్థాయిలో తహసిల్దార్, ఎంపిడిఓ, సబ్ రిజిస్ట్రార్, వ్యవసాయ శాఖ మొదలగు అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండేలా సముదాయం ఉండాలని అన్నారు. మండల కార్యాలయం నిర్మించిన తర్వాత నిర్వహణ కూడా సక్రమంగా జరిగేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని మంత్రి సూచించారు. అంతర్గంగా 30 ఫీట్ల రోడ్డు వేసేలా ప్లాన్ చేసుకోవాలని అన్నారు.మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా త్రాగు నీటి సరఫరా కనెక్షన్ తీసుకోవాలని అన్నారు. ప్రతి ఫ్లోర్ లో ప్రజల వెయిటింగ్ ఏరియా ఉండాలని, అక్కడ త్రాగు నీటి ట్యాప్ ఉండాలని అన్నారు. కార్యాలయాల్లో ఫైల్స్ పెట్టెందుకు స్టోరేజ్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం రూరల్ మండల తహసిల్దార్ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



## డబల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

**కొత్తగూడెం, జూలై 31(మనం న్యూస్):** పాత కొత్తగూడెంలో అసంపూర్తిగా నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇల్లు పూర్తి చేసి అర్హులైన పేదలకు ఇవ్వాలని అలాగే అదే పాత కొత్తగూడెంలో పేదలకు పంపిణీ చేసిన ఖాళీ స్థలంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత కొత్తగూడెంలో అసంపూర్తిగా నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లు, పేదలకు పంపిణీ చేసిన ఖాళీ స్థలాలను సిపిఎం బృందం గురువారం సందర్శించింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఎం దశలవారీ పోరాట ఫలితంగా ప్రభుత్వం నలభై ఎకరాల ప్రభుత్వ భూమిని కొనుగోలు చేస్తే గత ప్రభుత్వం ఆర్భాటంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టి ఇల్లు పూర్తి అవ్వకుండానే మొండి గోడలకు డ్రా తీసి పేదలను మోసం చేసిందన్నారు. అలాగే 74 గజాల ఖాళీ స్థలం పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారని దుయ్యబట్టారు. ఖాళీ స్థలం ఇచ్చిన పేదలకు ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు మంజూరు చేయాలని అక్కడ నివాసం ఉండడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ టౌన్ కమిటీ సభ్యులు జునుమాల నగేష్ ఆవుల శ్రీరాములు నాగకృష్ణ ప్రమోద్ నాయకులు కొలిపాక వెంకటేశ్వర్లు మురళి మరియా కుక్కల ముతేష్ బాలకృష్ణ రాములు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పాత మసీదు స్థలంలో షాదీఖానా నిర్మించండి

- అనుమతి లేకుండా ఇండ్లమధ్య మసీదు ఏర్పాటు ఇబ్బందికరం
- పాత మసీదుకు బదులు అతి సమీపంలోనే నూతన మసీదు నమాజ్‌లకు అనుకూలం
- విలేకరుల సమావేశంలో బాధితుడు మహమ్మద్ మహబూబ్ అలీ




**ఖమ్మం, జూలై 31(మనం న్యూస్):** ఖమ్మం నగరం 14వ డివిజన్ లోని గొల్లగూడెం బొడ్రాయి సెంటర్ లో ఇండ్ల మధ్య నిర్మించబడిన పాత మసీదు స్థలంలో షాదీఖానా లేదా ఉర్దూ మదర్సా, లేదా కమ్యూనిటీహాల్ నిర్మించి ముస్లిం ప్రజలందరికి ఉపయోగపడే విధంగా చేయాలని అదే గ్రామానికి చెందిన మహమ్మద్ మహబూబ్ ఆలీ కోరారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహమ్మద్ ఆలీ మాట్లాడుతూ... పాత మసీదులో నమాజ్ లు చేసుకోవడానికి సరిపడా స్థలం లేక ఇండ్ల మధ్యలో మా ఇంటిని ఆనుకొని ఉండడం వల్ల అసౌకర్యంగా ఉన్నదని భావించి గొల్లగూడెం ముస్లిం పెద్దలు, ముస్లిం ప్రజలు కలిసి అతిసమీపంలోనే కేవలం 150 అడుగుల దూరంలో నూతన మసీదు ఏర్పాటు చేసుకుని ప్రశాంత వాతావరణంలో ప్రార్థనలు చేసుకుంటున్నారన్నారు. అదే గ్రామంలో ప్రార్థనల కోసం మరో మసీదు కూడా ఉందని తెలిపారు. సరైన స్థలం లేకపోయినా, ఇండ్ల మధ్య ఇబ్బంది ఉంటుందన్నా కూడా పాత మసీదులో అనుమతి లేకుండానే మసీదు నిర్మాణం చేస్తున్నారని, ఈ విషయంపై మసీదు కమిటీ, ముస్లిం పెద్దలకు తెలిపామన్నారు. భారీ శబ్దాలు, కొత్త వ్యక్తులు జమాతులుగా పదుల సంఖ్యలో భక్తి ప్రసంగాలు చేస్తుంటారు. నిరుపేదలమైన తమకు ఈ ఇల్లు తప్ప వేరే ఇల్లు లేదని, ఇంటిని వదలి వెళ్లి వేరే చోట ఇల్లు కొనుక్కునే స్తోమతలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మసీదు నిర్మించుకోవాలంటే గొల్లగూడెం గ్రామం పక్కనే ఉన్న 72 ఎకరాల్లో వక్ఫ్ బోర్డు స్థలంలో విశాలమైన ప్రదేశంలో కూడా మసీదును నిర్మించుకోవచ్చన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

## ప్రజా ఆరోగ్య సంరక్షణ కోసమే ప్రభుత్వ వైద్య కేంద్రాలు

- ప్రజలు సామాజిక బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- జర్వం లక్షణాలు ఉంటే ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలి



**కూసుమంచి, జూలై 31(మనం న్యూస్):** ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసమే ప్రభుత్వ వైద్య కేంద్రాలు పని చేస్తున్నాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం కూసుమంచి మండలం కేంద్రంలోని ఆయుర్వేద, యునానీ, హోమియో ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓ.పి. సేవలు, మందుల అందుబాటు, సూచిక బోర్డు, వైద్య సేవలు, ల్యాబ్ రికార్డ్స్, మెడికల్ ఫార్మసి, ప్రసూతి కాన్పుల గది, అపరేషన్ థియేటర్ పరిశీలించారు. డాక్టర్లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు.ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, డాక్టర్లు ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. రోజుకు ఎన్ని ఓ.పి. లను చూస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. రోగులకు వైద్యం పై సమగ్రంగా వివరాలు తెలిపి మందులు వాడే పద్ధతిని వివరించాలని, వర్షాకాలం సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైన మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు.గర్భిణిల కాన్పుల గదిలో కావాల్సిన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించి, ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు దృష్టి పెట్టాలని వైద్యులకు సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టుపక్కల, ఆవరణంలో పిచ్చి మొక్కలు, చెత్త లేకుండా చూడాలని కలెక్టర్ అధికారులను అదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, తదితర వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రాథమిక వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, వైద్యాధికారులు డా. సాయికుమార్, డా. లక్ష్మిలోహిత, ఆరోగ్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.




## బిసి బిల్లు సాధన కోసం

- 4,5,6,7 తేదీల్లో 72 గంటల పాటు నిరాహార దీక్ష
- యుపిఎఫ్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుంటి మంజులారాణి

**ఖమ్మం, జూలై 31(మనం న్యూస్):** బిసి బిల్లు సాధన కోసం ఆగష్టు 4,5,6,7 తేదీల్లో తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద 72 గంటల పాటు నిరాహారదీక్ష చేపడుతున్నట్లు యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుంటి మంజులారాణి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలోని బిసిలంతా ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. బిసి బిల్లు కోసం కవిత నేతృత్వంలో అంతా ఐక్యమై ఉద్యమించనున్నట్లు తెలిపారు. కవితక్క పోరాటాల ద్వారానే కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ బిల్లుపై ఆర్డినెన్స్ తెచ్చినట్లు తెలిపారు. 42 శాతం రిజర్వేషన్‌లో ముస్లింల శాతం ఎంతో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు. రాష్ట్రంలో బిల్లు తెచ్చి కేంద్రంలో బిజెపితో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కలిసి డ్రామాలాడుతోందన్నారు. బిసిలోని ఉపకులాల మధ్య తగాదా పెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఇంకెన్నాళ్లు బిసిలను మోసం చేయాలని చూస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే 42 శాతం బిల్లును ఆమోదించాలన్నారు. రిజర్వేషన్లు ఇచ్చే వరకూ కవితక్క నేతృత్వంలో పోరాడతామన్నారు. రిజర్వేషన్లు ఖరారయ్యాకనే స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలన్నారు. బిల్లు కోసం జరిగే 72 గంటల పాటు నిరాహారదీక్షలో బిసిలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం 72 గంటల నిరాహార దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకురాళ్లు ఎం.భారతి, జిల్లా నాయకురాలు గట్టు కరుణ, యూత్ ప్రెసిడెంట్ నాగేందర్, నేతలు ఉదయ్‌కిరణ్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## 2న బిసి రిజర్వేషన్లపై రౌండ్ టేబుల్ సమావేశం

- టిజెఎస్ నాయకులు జంగిపల్లి రవి



**ఖమ్మం కార్పొరేషన్, జూలై 31(మనం న్యూస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు- కేంద్ర ప్రభుత్వం వైఖరి పై ఆగస్టు 2వ తేదీన హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ నందు తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో బీసీ సంఘాల నేతలు, మేధావులు, పౌర ప్రజా సంఘాలతో కలిపి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు టిజెఎస్ నాయకులు జంగిపల్లి రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అదేస్ఫూర్తితో సామాజిక తెలంగాణ దిశగా అడుగులు వేసేందుకు రాష్ట్రంలోని వివిధ సామాజిక శక్తులు కలిసి రావాలన్నారు. తెలంగాణ జన సమితి చేసిన పోరాటాలు ప్రయత్నాల మూలంగా స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సాధించుకోగలిగామని, ఇది ప్రజా విజయమని తెలంగాణ జన సమితి అభిప్రాయపడుతుందని తెలిపారు. సాధించుకున్న రిజర్వేషన్లకు చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభ ఆమోదించిన బిల్లులకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగణన జరిపిన అనంతరం బీసీలకు విద్యా, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు, అలాగే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ శాసనసభ ఆమోదించిన బిల్లును ఆమోదించడంలో కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేయకుండా పార్లమెంట్‌లో చట్టం చేసి తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చాలని కోరారు. బిసి రిజర్వేషన్లపై బిజెపి.వాదన అసంబద్ధమైందని, రాష్ట్ర ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వం తయారుచేసిన విధానాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి ఆమోదించకపోవడం ఫెడరేషన్ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పినట్లు ప్రజాస్వామ్యం అంటేనే ప్రజల భాగస్వామ్యమని, నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ సమాజంలో ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజా భాగస్వామ్యాన్ని విస్తరించడానికి రిజర్వేషన్లు కీలకం అని అన్నారు. ఈ రిజర్వేషన్లు అమలు పరిచి ప్రజల భాగస్వామ్యం చేయకపోవడం అప్రజాస్వామికమేనన్నారు. బిజెపి ప్రభుత్వం ఈ విశాల దృక్పథాన్ని అర్థం చేసుకోకుండా ప్రజలను గంధరగోళ పరిచే ప్రయత్నం చేస్తోందన్నారు. మతం రంగు పులిమే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. టిఆర్ఎస్ పార్టీ నిక్కచ్చిగా తన వైఖరి చెప్పకుండా దాటవేస్తూ దోబూచులాడుతోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత సమావేశాలలోనే పార్లమెంట్లో బిల్లుపెట్టి తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనవల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

## ఫలించిన పది సంవత్సరాల కల, రేషన్ కార్డు లబ్ధిదారుల్లో ఆనందం

- అర్హులైన ప్రతి బిడ్డను ఆదుకుంటా
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**గొల్లపెల్లి జూలై 31 (మనం న్యూస్):** గొల్లపల్లి మండల కేంద్రంలోని స్థానిక శ్యాం సుందర్ రెడ్డి ఫంక్షన్ హాల్లో గురువారం రోజున నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ మరియు వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్ గారితో కలిసి గొల్లపల్లి మండలానికి మంజూరు అయిన 1658 తెల్ల రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రేషన్ కార్డుల కోసం గత పది సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ఈరోజు రాష్ట్ర మంత్రిగా నా చేతుల మీదుగా రేషన్ కార్డులను అందించడం నేను చేసుకున్న అదష్టం అన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలు అధికారంలో ఉండి ఒక్కరికి కూడా రేషన్ కార్డు లు మంజూరు చేయలేదు. దీనివలన ఎంతోమంది ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమైనారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో ఈరోజు ప్రభుత్వం గొల్లపల్లి మండలానికి 1658 కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు పంపిణీ చేశాము. దీని ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం పథకానికి వీరంతా అర్హులు అయినారు ఈరోజు వారి కళ్ళల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరువతో నేను ఆనందం చూస్తున్నాను. ఇది ఎంతో శుభ పరిణామం అన్నారు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ,మైనారిటీ, దివ్యాంగుల శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్. అనంతరం 67 మంది లబ్ధిదారులకు 67 కళ్యాణ లక్ష్మీ చెక్కులను,18 లక్షల 41వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంల మండల పరిధిలో రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిర్వహించాలని,అలానే రేషన్ కార్డు రాని వారు కంగారు పడాల్సిన పని లేదని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, కార్డు రాని వారు మీసేవాలో కానీ.. లేదంటే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలంగాణలో దాదాపు 10 సంవత్సరాల తర్వాత.. కొత్త రేషన్ కార్డులు ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ కార్డులో కొత్త పేర్లను కూడా కలిపేందుకు అవకాశం కల్పించామని తెలిపారు. వాటన్నింటిని పరిశీలించిన తర్వాత అర్హులైన వారికి మళ్లీ కార్డులు పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఇప్పటికే ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ అందని కార్డులు ఇప్పుడు వారి చేతుల్లోకి రావడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారనీ,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమం దిశగా చేసిన మరో గొప్ప అడుగు అని తెలిపారు గొల్లపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్.ఈ కార్యక్రమంలో జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి మధుసూదన్, డిఎస్ఓ జితేందర్ రెడ్డి,మండల తహసిల్దార్ వరందన్ ,ఎంపీడీవో రామ్ రెడ్డి సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# పట్టదారులపై పారదర్శక ఎంక్వయిరీ అవసరం

- రెండు రోజుల్లో రిపోర్ట్ అందించాలి..
- రాష్ట్ర సిసిఎల్ఎ..కమిషనర్ లోకేష్ కుమార్ సర్వే సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు

మహబూబ్ నగర్, జూలై 31(మనం బ్యూరో): రీ సర్వే చేసిన పట్టాదారుల వివరాలు.. పహానీలోని వివరాలపై పారదర్శకంగా ఎంక్వయిరీ చేయాలని రాష్ట్ర సిసిఎల్ఎ.. కమిషనర్ లోకేష్ కుమార్ సర్వే సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు లు ఆయా జిల్లా కలెక్టర్ లను ను ఆదేశించారు. .మహబూబ్ నగర్ జిల్లా గండీఢ్ మండలం సాలార్ నగర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్ చేపట్టిన (రీ-సర్వే) పై గురువారం రాష్ట్ర సిసిఎల్ఎ సర్వే సెటిల్మెంట్ కమిషనర్ లోకేష్ కుమార్ హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), ఏనుగు నర్సింహ రెడ్డి ఆర్డీవో నవీన్,సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి.కిషన్ రావు, గండీడ్ తహశీల్దార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అధికారులకు పలు, సూచనలు సలహాలు అందజేశారు. గండీడ్ మండలం సాలార్ నగర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద (రీ-సర్వే)కు సంబంధించి తీసుకున్నామని తెలిపారు. రీ సర్వే చేసిన పట్టాదారుల వివరాలు.. పహానీలోని వివరాలు ఎంక్వైరీ చేసి 2 రోజుల్లో రిపోర్ట్ సమర్పించాలని జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ. సర్వే సిబ్బందికి ఫీల్ వెళ్ళి విచారణ జరిపి రిపోర్టు సమర్పించాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి అధికారులు పూర్తి పారదర్శకంగా.. చట్టం ప్రకారం.. నిబంధనల మేరకు వ్యవహరించాలని కమిషనర్ పేర్కొన్నారు. ఎక్కడా నిర్లక్ష్యం వహించినా అధికారులదే పూర్తి బాధ్యత అని.. ఇందుకు బాధ్యతయుతంగా పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. నిర్లక్ష్యం వహించినట్టు తెలిస్తే చర్యలు తప్పవని కమిషనర్ పేర్కొన్నారు.

# ద్వంద్వ ప్రభుత్వాల సహకారంతోనే క్లస్టర్ అభివృద్ధి

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్ నగర్, బూత్ పూర్, జడ్చర్ల మూడు పట్టణాలతో క్లస్టర్ ఏర్పాటు**



మహబూబ్‌నగర్, జూలై 31(మనం బ్యూరో): కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మహబూబ్ నగర్ క్లస్టర్ ( మహబూబ్ నగర్, జడ్చర్ల, బూత్ పూర్) ను అభివృద్ధి చేస్తామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు మనోహర్ లాల్ ఖట్టర్ ని భారత పార్లమెంటు భవనం మహబూబ్ నగర్ ఎంపి డికె అరుణ తో కలిసి మహబూబ్ నగర్, జడ్చర్ల, బూత్ పూర్ (మహబూబ్ నగర్ క్లస్టర్ ) పట్టణాలకు సంబంధించిన సమగ్ర ప్రణాళిక ను ఆయన అందజేశారు. మహబూబ్ నగర్ క్లస్టర్ నందు చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వారు మంత్రికి వివరించారు . ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మహబూబ్ నగర్ క్లస్టర్ గురించి ఎమ్మెల్యే ని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ క్లస్టర్ యొక్క ఆవశ్యకత అవసరమైన అభివృద్ధి గురించి మంత్రి కి ఎమ్మెల్యే వివరించారు.

ఈ సందర్భంగా మహబూబ్ నగర్ ఎంపి డికె అరుణ మహబూబ్ నగర్ క్లస్టర్ గురించి మంత్రికి వివరిస్తూ, మహబూబ్ నగర్ క్లస్టర్ లోని మూడు నియోజకవర్గాలు కూడా నా పార్లమెంట్ పరిధిలో ఉన్న పట్టణాలే అని, మహబూబ్ నగర్ క్లస్టర్ అభివృద్ధి వలన లక్షలాది మందికి లబ్ధి చేకూరుతుందని , ఈ ప్రాజెక్టు మహబూబ్ నగర్ పార్లమెంటు నియోజకవర్గానికి ఎంతో అవసరమని, ఆమె కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు మహబూబ్ నగర్ క్లస్టర్ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. మహబూబ్ నగర్ క్లస్టర్ కు నిధులు మంజూరు చేయుటకు మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ యొక్క ప్రాజెక్టు మొత్తం విలువ 975.48 కోట్ల రూపాయలు అని ఆయన చెప్పారు .

త్వరలో మహబూబ్ నగర్ క్లస్టర్ ప్రాజెక్టు ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని అందులో ప్రధానంగా సామాజిక మౌళిక సదుపాయాలైన విద్యా, వైద్యం, ఉపాధి మరియు సాంస్కృతిక, క్రీడలు, కమ్యూనిటీ సెంటర్లు, ఆడిటోరియంలు, హెల్త్ సెంటర్లు, గ్రంథాలయాల ఏర్పాటు, పార్కుల ఏర్పాటు, ప్రజారవాణా వ్యవస్థ, రవాణా ఆధారిత అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ బలోపేతం, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం, యువత వ్యవస్థాపకతను ప్రోత్సహించడానికి మరియు స్వయం ఉపాధికి మద్దతు ఇవ్వడానికి స్టార్ట్ అప్ ఇంక్యుబేషన్ హబ్ లను ఏర్పాటు చేయడం, క్రీడా సముదాయాలు ఏర్పాటు చేయడం, ఫంక్షన్ హాల్స్ ఏర్పాటు చేయడం, మరియు గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేసి, ఉద్యానవనాలు తోటలు మరియు అడవులతో సహ పట్టణంలో పచ్చని ప్రదేశాల అభివృద్ధి పర్యావరణ స్థిరత్వం మెరుగుపరచడం మొదలైన అభివృద్ధి పనులు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న మంత్రి జూపల్లి



నాగర్ కర్నూల్, జూలై 31(మనం ప్రతినిధి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని గురువారం పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దర్శించుకున్నారు. అర్చకులు, అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. శ్రీశైల మల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద ఆశీర్వచనం ఇచ్చి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు మంత్రికి అందజేశారు. తాండ్ర పాపారాయ వెలమ చౌల్ట్రీని, శ్రీశైల క్షేత్రంలోని తాండ్ర పాపారాయ వెలమ చౌల్ట్రీ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కుర్మయ్య శాంతమ్మ, నారాయణ రావు భవన్ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ రాజకీయాలు, పదవులు శాశ్వతం కాదని, ఎవరు ఎక్కడ ఉన్నా సమాజహితం కోసం పాటు పడాలన్నారు. కార్యవర్గ సభ్యులు ఒక కుటుంబంగా శ్రీశైలంలో వసతి గృహం నిర్మించుకోవడం సంతోషకరం, అభినందనీయమని తెలిపారు. అనంతరం



శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్లో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బోట్ నడిపారు. బ్రహ్మగిరి (ఈగలపెంట)వద్ద మినీ లాంచీని పరిశీలించారు. బ్రహ్మగిరి నుంచి అక్కల మహాదేవి గుహల వరకు పర్యాటకులకు వెంటనే బోట్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. ఒక బోటుకు అదనంగా మరో బోటును అందుబాటులోకి తీసుకురావాలని, ఒక డ్రైవర్ ను స్పేర్లో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణకు చెందిన పులువురు ప్రజా ప్రతినిధులు, ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్ ప్రెసిడెంట్ క్రిష్ణమనేని పాపారావు, వైస్ ప్రెసిడెంట్ తాండ్ర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# వన మహోత్సవం లక్ష్యాలను సాధించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, జూలై 31(మనం ప్రతినిధి): భవిష్యత్తు తరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం-2025 కార్యక్రమంలో జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను పూర్తిగా సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో వన మహోత్సవంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్ లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో గీత కార్మికుల సంక్షేమంలో భాగంగా 400 తాటి మొక్కలు నాటడంతో పాటు గీత కార్మికులకు మొక్కలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తు తరాలకు సహజ సిద్ధమైన, సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలు నాటే లక్ష్యాలను కేటాయించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని, ప్రజలు తమ ఇండ్లలో మొక్కలు నాటి పరిరక్షించాలని తెలిపారు. మండలంలోని పొక్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా 200 మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల పరిధిలో కూరగాయల మొక్కలను అభివృద్ధి చేసి తాజా కూరగాయలు పొందేందుకు ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్ను ప్రారంభించారు. పాఠశాలలోని వంటశాల, విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో నాణ్యమైన, పోషక విలువలు గల ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులను వివిధ సబ్జెకులలో పలు ప్రశ్నలు అడిగి వారి పఠనా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే దిశగా ఏకాగ్రతతో చదవాలని, ఉన్నత స్థానాలలో నిలువాలని అన్నారు. గ్రామంలో ఆరోగ్య ఉ ప కేంద్రం ఏర్పాటులో భాగంగా అనువైన ప్రదేశం కొరకు స్థల పరిశీలన చేశారు. పల్లెదవాఖానా- ఆయుష్ భారత్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వర్షాకాలం అయినందున అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. మండలంలోని అంగ్రాజ్పల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని, సమయానుసారంగా చేసుకోవలసిన పరీక్షలు, తీసుకోవలసిన మందులు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిల్లల వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని, వ్యాక్సినేషన్ కొరకు దూర ప్రాంతాలకు వెళ్ళవలసిన అవసరం లేదని, ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు.

చెన్నూర్ మండల కేంద్రంలోని తహశిల్దార్ కార్యాలయాన్ని తహశిల్దార్ మల్లిఖార్జున్తో కలిసి సందర్శించి రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. భూభారతి కార్యక్రమంలో భాగంగా నిర్వహించి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, వివిధ రకాల ధృవపత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేయాలని తెలిపారు. చెన్నూర్ మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకం పనులను మున్సిపల్ కమీషనర్ మురళీకృష్ణతో కలిసి పరిశీలించి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మిషన్ భగీరథతో పాటు అమృత్ 2.0 ద్వారా ప్రజలందరికీ నిరంతరం త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ వసతి గృహాలను సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా అదనపు పాలనాధికారి (రెవెన్యూ) పి. చంద్రయ్య

మంచిర్యాల జూలై 31(మనం ప్రతినిధి): జిల్లాలోని వివిధ సంక్షేమ శాఖల పరిధిలో నడపబడుతున్న వసతి గృహాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు పాలనాధికారి (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో వివిధ వెనుకబడిన తరగతుల వసతి గృహాల సంక్షేమ అధికారులకు, సిబ్బందికి ఏర్పాటు చేసిన ఒక్కరోజు శిక్షణా కార్యక్రమానికి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి పురుషోత్తంతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంక్షేమ గృహంలో తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని, నాణ్యమైన ఆహారాన్ని అందించడం, ప్రతి రోజు తప్పకుండా భోజనం పట్టికలో చూపిన విధంగా ఏ రోజు పెట్టవలసిన ఆహార పదార్థాలను ఆ రోజు తప్పనిసరిగా అందించాలని తెలిపారు. వేడిగా వండిన పదార్థాలను మాత్రమే వడ్డించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు,





నాణ్యమైన నిత్యవసర సరుకులు వినియోగించాలని తెలిపారు. వసతి గృహ పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలని , అవకాశం ఉన్న చోట జామ, నిమ్మ, మునగ, పనస, కరివేప చెట్లను పెంచాలన్నారు. సిబ్బంది బాధ్యతగా వ్యవహరించి పిల్లలు యొక్క ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. అలాగే సంక్షేమాధికారులు శిక్షణ పొందిన వారు విద్యార్థుల చదువుల పట్ల శ్రద్ధ వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ క్వాలిటీ కో ఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, ఎ. డి. హెచ్. ఎం. ఓ. ప్రసాద్ , మెడికల్ ఆఫీసర్ శివ ప్రతాప్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తిరుమల, సహాయ అభివృద్ధి అధికారి భాగ్యవతి, వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారులు మరియు వారి సిబ్బంది పాల్గొన్నారు. బండ శాంకరీ, సుమన్, కొండు జనార్ధన్ లు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం

- ఎమ్మెల్యే ను కలిసిన ఓదెల మల్లన్న ఆలయ నూతన పాలకవర్గం సభ్యులు

ఓదెల, జూలై 31(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ పెద్దపల్లి జిల్లాలోని అతి పెద్ద పుణ్యక్షేత్రమైన శ్రీ ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయానికి తాజాగా కొత్త పాలకవర్గ సభ్యులను నియమించారు. పాలకవర్గ సభ్యులు ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని ఎమ్మెల్యే విజయరమణారావు నివాసంలో ఆలయ పాలకవర్గం సభ్యులు చీకట్ల మొండయ్య ఆధ్వర్యంలో నూతన పాలకవర్గం కలిసారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు నూతన





పాలకవర్గం సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గౌరవ ఎమ్మెల్యే విజయరమణా రావు మాట్లాడుతూ...ె ఎద్దపల్లి జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఓదెల మల్లన్న ఆలయం రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా నిలుస్తోందన్నారు. ఆలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు.పాలకవర్గ సభ్యులు సేవా భవంతో పనిచేస్తూ ఆధ్యాత్మికతను పెంపొందించేం దుకు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులతో పాటు ఓదెల,సుల్తానాబాద్ మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,జిల్లా పద్మశాలి సేవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తులు



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, జూలై 31 (మనం ప్రతినిధి): 2025-26 విద్యా సంవత్సరానికి హైదరాబాద్ లోని బేగంపేట, రామంతా పూర్ పబ్లిక్ స్కూల్లలో 1వ తరగతి(ఇంగ్లీష్ మీడియం)లో ప్రవేశం కొరకు జిల్లాలోని ఎస్సీ విద్యార్థినీ, విద్యార్థులు ఆగస్టు 08 లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన ఎస్సీ విద్యార్థిని, విద్యార్థులకు మొత్తము (2) సీట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. అభ్యర్థి 2018 జూన్ 1 నుండి 2019 మే 31 మధ్యలో జన్మించి ఉండాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం అర్బన్ ప్రాంతంలో రెండు లక్షలు, రూరల్ ప్రాంతంలో ఒక లక్షా 50 వేల లోపు ఉండాలని, ధృవీకరణ పత్రాలు ఆదాయం, కులం, బర్త్, స్టడీ సర్టిఫికేట్, పాస్ పోర్ట్ 2 సైజ్ ఫోటోలను జత చేసి పూర్తి చేసిన దరఖాస్తులను గెజిటెడ్ అధికారిచే అటెస్టెడ్ చేసిన ఆగస్టు 8 సాయంత్రం 5 గంటల లోగా సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని, ఆగస్టు 10 న లాటరీ పద్ధతిలో సీట్ల కేటాయింపు ఉంటుందని, ఇతర వివరాలకు పెద్దపెల్లి కలెక్టరేట్ లోని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయం నందు సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# నవంబర్ నాటికి టీబీ పరీక్ష లక్ష్యాలను పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- బసంత్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి, జూలై 31(మనం ప్రతినిధి): నవంబర్ నాటికి టీబీ పరీక్ష నిర్వహణ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాలకుర్తి మండలం బసంత్ నగర్ లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పి.హెచ్.సి లో ఉన్న వార్డులు, ల్యాబ్ లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, టీబీ వ్యాధి వచ్చే అవకాశం ఉన్న వల్న రేబుల్ (టీబి వ్యాధి సోకే అవకాశం ఉన్న) జనాభా ను గుర్తించి నవంబర్ లోపు వారి స్క్రినింగ్, వ్యాధి నిర్ధారణ పరీక్షల నిర్వహణ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్.సి.డి సర్వే ద్వారా గుర్తించిన మధుమేహం, బీపి వ్యాధిగ్రస్తులు మందులు సరిగ్గా వాడుతున్నారో లేదో రెగ్యులర్ ఫాలో అప్ చేయాలని అన్నారు. ల్యాబ్ లో పరీక్ష ఫలితాలు సకాలంలో అందించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం పెద్దపల్లి శాంతి నగర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ సెంటర్ ను కలెక్టర్₹ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనం వండే కిచెన్ ఏరియా, తరగతి గదులను పరిశీలించారు. పిల్లలకు కనీస విద్యా ప్రమాణాలు అందే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల ఎదుగుదల రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట వైద్య అధికారులు డాక్టర్ సరళి, డాక్టర్ లక్ష్మీ భవానీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







# విద్య ద్వారా ఉన్నత లక్ష్యాలు సాధ్యం

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- దమ్మన్నపేట, మండేపల్లి గ్రామాలలో తెలంగాణ మోడల్ స్కూల్ లో ఆన్ అకాడమీ ఆన్ లైన్ తరగతులను కేకే మహేందర్ రెడ్డి తో కలిసి ప్రారంభించిన జిల్లా కలెక్టర్

గంభీరావుపేట /తంగళ్ళపల్లి, జూలై 31, రాజన్న సిరిసిల్ల (మనం ప్రతినిధి): విద్య ద్వారా మాత్రమే ఉన్నత లక్ష్యాలు సాధ్యం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.గంభీరావుపేట,తంగళ్ళపల్లి మండలంలోని దమ్మన్నపేట, మండేపల్లి గ్రామాలలో తెలంగాణ మోడల్ స్కూల్ లో ఆన్ అకాడమీ ద్వారా ఆన్ లైన్ తరగతులను కేకే మహేందర్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ,విద్య ద్వారా మాత్రమే ఉన్నత లక్ష్యాలు సాధిస్తామని అన్నారు. పేదలు అధికంగా ఉండే ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పిల్లలకు జాతీయ స్థాయి పోటీ పరీక్షల రాసేందుకు ఆన్ లైన్ తరగతుల ద్వారా మంచి శిక్షణ ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆన్ లైన్ తరగతుల్లో దేశంలోని నిపుణులైన టీచర్లచే పిల్లలకు బోధన జరుగుతుందని, ఢిల్లీ లో విద్యార్థులకు అందే శిక్షణ నేడు సాంకేతికతను వినియోగించుకుని మన సిరిసిల్ల జిల్లాలోని విద్యార్థులకు కూడా



అందిస్తున్నామని అన్నారు. ప్రతి రోజు కనీసం 2 గంటల పాటు ఆన్ లైన్ కోచ్చింగ్ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థి జీవితంలో 10,11,12వ తరగతులు 3 సంవత్సరాలు చాలా కీలక సమయమని, దీనిని సద్వినియోగం చేసుకుంటే జీవితం బాగుంటుందని అన్నారు.ముఖ్యమైన పాఠ్యాంశాలలో బేసిక్స్ ఇంటర్ లో ప్రారంభం అవుతాయని అన్నారు. కాలిక్యులస్, ఆర్గానిక్ ఫార్మింగ్, ఎలక్ట్రో మ్యాగ్నెటిసమ్ వంటి ముఖ్యమైన పాఠ్యాంశాలను కాన్సెప్ట్ పక్కాగా నేర్చుకోవాలని అన్నారు. ఆన్ లైన్ తరగతులలో మన సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం ఉందని, ప్రతి విద్యార్థి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.విద్యార్థులకు ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకుని వస్తే సత్వరమే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం కల్పించిన ఆన్ లైన్ తరగతులు శిక్షణ సౌకర్యం విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ,రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ పేదల విద్యకై నిరంతరం కృషి చేస్తూ పెద్ద ఎత్తున పేదలకు నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో పిల్లలకు ఆన్ లైన్ తరగతుల ద్వారా ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరువ చూపారని అన్నారు. మోడల్ స్కూల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పూర్తి





స్థాయిలో వినియోగించుకొని విజయవంతం కావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తాసిల్దార్ జయంత్ కళాశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు విద్యార్థులు, స్థానిక నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా.. శ్రీ చైతన్య పాఠశాల

- శ్రీ చైతన్య పాఠశాల కాదు. కేవలం ట్యూషన్ సెంటర్ మాత్రమే
- పాఠశాల ఇన్‌చార్జ్ అశ్విని వివరణ
- పర్మిషన్స్ ఇవ్వని డీఈఓ
- గందరగోళంలో విద్యార్థులు, తల్లిదండ్రులు
- స్పష్టమైన వివరణ ఇవ్వాలని విద్యార్థి సంఘాల డిమాండ్
- విద్యార్థి సంఘాల నిరసనలతో కదిలిన యంత్రాంగం
- పాఠశాలను మూసివేసి నోటీసులు అంటించిన విద్యాశాఖ

**కామారెడ్డి, జూలై 31 (మనం జిల్లా ప్రతినిధి) :** కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న శ్రీ చైతన్య విద్యాసంస్థను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీడీ ఎస్ యు ( ఎస్ ) జిల్లా అధ్యక్షులు ఎన్. బాల్ రాజ్ మాట్లాడుతూ., విద్యాశాఖ నుండి అనుమతులు పొందకుండా బాన్సువాడలో శ్రీ చైతన్య పాఠశాల నడిపిస్తుండడంతో మంగళవారం విద్యార్థి సంఘాల తరుపున పాఠశాలకి వెళ్లి ధర్నా చేయడం జరిగిందని అన్నారు. ఇదే సందర్భంలో పాఠశాల ఇంచార్జ్ ని ప్రశ్నించగా ఇది శ్రీ చైతన్య పాఠశాల కాదని, కేవలం ట్యూషన్ సెంటర్ అని అర్థరహితమైన సమాధానాలు ఇస్తున్నారని మండిపడ్డారు. కావున ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా నడుస్తున్నటు శ్రీ చైతన్య పాఠశాలను తక్షణమే విద్యాశాఖ అధికారులు సీజ్ చేయవలసిందిగా డీఈఓ ని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డిమాండ్ చేయడం జరుగుతుందని అన్నారు. మళ్లీ బాన్సువాడ లో శ్రీ చైతన్య విద్యాసంస్థ వారు విద్యార్థులను, తల్లిదండ్రులను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు తక్షణ చర్యలకు పూనుకొని పాఠశాలను మూసివేయాలని, ముసివేయకుంటే ఎలాంటి అనుమతులు లేని శ్రీ చైతన్య పాఠశాలతో విద్యాశాఖ అధికారులు మమేకమైనరాని అనుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహిస్తే విద్యార్థులు ఒక్క సంవత్సరం కాల భవిష్యత్ వ్యర్థం అవుతుందని, ఇది ఇలాగే కొనసాగితే విద్యార్థి సంఘాలు విద్యాశాఖ అధికారుల యొక్క కార్యాలయాలను ముట్టడి చేయవలసి ఉంటుందని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టి. యన్. ఎస్. యఫ్ రాష్ట్ర నాయకులు పుట్ట భాస్కర్, టీ. ఎస్. పి జిల్లా అధ్యక్షులు మావురం శ్రీకాంత్, పిడిఎస్ యు (ఎస్) బాన్సువాడ డివిజన్ నాయకులు ఎన్. సాయిబాబా, శివకుమార్, ఎండీ. ఫాజల్, అబ్దుల్ హాకిమ్, ప్రశాంత్, నిఖిల్, మేఘునత్, నవీన్ టి. యన్. ఎస్. యఫ్, నాయకులు గణేష్, వేణు గౌడ్, టిఎస్పీ నాయకులు రవీందర్ గౌడ్, మహేష్, జీవన్ లు పాల్గొన్నారు.






**విద్యార్థి నాయకుల డిమాండ్‌తో కదిలిన యంత్రాంగం..**

విద్యార్థి సంఘాలు పిడిఎస్యు, టిఎస్పీ - టి. యన్. ఎస్. యఫ్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేసిన నేపథ్యంలో సబ్ కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు శ్రీ చైతన్య విద్యాసంస్థను రెవిన్యూ సిబ్బంది, విద్యా శాఖ సిబ్బంది, పోలీసు శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో శ్రీ చైతన్య పాఠశాలను మూసివేసి నోటీసులు అంటించారు.



## ఐ రాడ్ అప్లికేషన్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల పరిశీలించిన డీఎంహెచ్ఓ

**కామారెడ్డి, జూలై 31(మనం జిల్లా ప్రతినిధి) :** ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ అండ్ డేటా బేస్ అప్లికేషన్లో జిల్లాలోని ముందుగా ఆరోగ్యశ్రీ ఎంపాల్మెంట్ కలిగిన ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు కామారెడ్డి జిల్లా ఇన్చార్జి డిఎంహెచ్ఓ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం కామారెడ్డి జిల్లాలోని కలెక్టరేట్ లోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి లాగిన్ ద్వారా నమోదు చేసుకున్న హాస్పిటల్ వివరాలు పరిశీలించి అప్రూవల్ ఇవ్వడం జరిగిందని డిఎంహెచ్ఓ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాలుగా ఈ అప్లికేషన్ పోలీసు, రవాణా, రహదారుల విభాగాలకు ప్రమాదాలకు గల కారణాలు, విశ్లేషణను అందిస్తుందన్నారు. ఇందులో భాగంగా తెలంగాణలో మొదటిసారిగా కామారెడ్డి జిల్లాలోని 12 ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు అవకాశం కల్పించామన్నారు. దీంతో రోడ్డు ప్రమాదానికి సంబంధించిన మెడికో లీగల్ సర్టిఫికెట్, డిశ్చార్జి సమ్మరీ, పోస్టుమార్టం రిపోర్టులు అప్లికేషన్లో పొందవచ్చన్నారు. అలాగే కామారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదానికి గురైన వారు జిల్లాలో 12 ప్రభుత్వ, ప్రవేట్ హాస్పిటల్ లలో ఒక లక్ష యాభై వేలు వరకు నగదు రహిత చికిత్స పొందడానికి అవకాశం ఉందన్నారు. ఈ సదుపాయం త్వరలోనే అమలు చేయడం జరుగుతుందని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శ్రీ జిల్లా మేనేజర్ సత్యనారాయణ, ఐఆర్ఏడీ ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్ రోజా, ఆరోగ్యశ్రీ జిల్లా ఇన్చార్జి టీమ్ లీడర్ మహమ్మద్ అలావుద్దీన్, డిప్యూటీ డిఎంహెచ్ఓ ప్రభు కిరణ్, చలపతి తదితరులు ఉన్నారు.

## కనీస వేతనం రూ.26 వేలు చేయాలి

- టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు వనమాల కృష్ణ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా...




**నిజామాబాద్, జూలై 31(మనం బ్యూరో) :** కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చేయాలని టీయూసీఐ జాతీయ ఉపాధ్యక్షుడు వనమాల కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్ ముందు గురువారం టీయూసీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., కార్మికులకు కనీస పెన్షన్ రూ.9వేలు అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణ కార్మికులకు తక్కువ వేతనాలు ఉండడం సిగ్గుచేటన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అదే ధోరణిలో ప్రవర్తిస్తోందని మండిపడ్డారు. భవిష్యత్తులో బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరేందర్, సుధాకర్, ఉపాధ్యక్షులు వెంకన్న, రాజేశ్వర్, మల్లేష్, మురళి, కిరణ్, రవి, హేమలత, సుమలత, శారద, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం..

- లబ్ధిదారులకు రేషన్ కార్డు ప్రతిని అందించిన నాయకులు

**బీబీపేట్, జూలై 31(మనం న్యూస్) :** బీబీపేట్ మండలంలోని షేరి బీబీపేట్ గ్రామంలో నూతనంగా రేషన్ కార్డులు జారీ లబ్ధి దారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుతారి రమేశ్ రేషన్ కార్డు ప్రతిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వకుండా, ప్రజలను ప్రభుత్వ, సంక్షేమ పథకాలకు దూరం చేసి పబ్బం గడిపిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం అనునిత్యం పేద ప్రజలకు అండగా ఉంటుందని మరోమారు రుజువైందని అన్నారు. పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం అందిస్తూ వారి కళ్లలో ఆనందం చూస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భూమాగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట రమేశ్, మండల యూత్ అధ్యక్షుడు మహేష్, సీనియర్ నాయకులు చంద్రాగౌడ్, రాకేష్ రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.






**జాతీయం- అంతర్జాతీయం**

## పాకిస్థాన్‌కు చెక్.. చీనాబ్‌పై 'సావల్‌కోట్' ప్రాజెక్టు!

ఢిల్లీ, జూలై 31 : సింధూ జలాల ఒప్పందం నిలిపివేత తర్వాత జమ్మూ కశ్మీర్‌లో పలు కీలక ప్రాజెక్టులపై దృష్టి పెట్టిన భారత ప్రభుత్వం భారీ జలవిద్యుత్తు ప్రాజెక్టు పునరుద్ధరణకు సిద్ధమవుతోంది. చీనాబ్ నదిపై గతంలో నిలిపివేసిన సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఇటీవల అంతర్జాతీయ టెండర్లను ఆహ్వానించింది. ఇటీవలే తుల్‌బుల్ ప్రాజెక్టు పునరుద్ధరణ చర్యలు చేపట్టగా, తాజాగా భారీ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం నడుం బిగించింది.

కశ్మీర్‌లోని చీనాబ్ నదిపై సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మించాలనే ప్రతిపాదన 1980ల నుంచే ఉంది. దీనిపై పాకిస్థాన్ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో దాదాపు 40 ఏళ్లుగా పక్కన పెట్టాల్సి వచ్చింది. అయితే, ఇటీవల సింధూ జలాల ఒప్పందం అమలు నిలిపివేయడం.. దీంతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేకపోవడంతో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. 1856 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి దాదాపు రూ.22 వేల కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. రెండు దశల్లో దీన్ని నిర్మించనున్నట్లు తెలిసింది.

ఈ ప్రాజెక్టును జమ్మూకశ్మీర్ ప్రభుత్వం దశాబ్దం క్రితమే మొదలుపెట్టగా.. కొంత ఖర్చు కూడా చేసినట్లు సమాచారం. 2021లో కేంద్రం జోక్యం చేసుకుని ఎన్‌హెచ్‌పీసీని భాగస్వామ్యం చేయడంతోపాటు పలు కీలక ఒప్పందాలను చేసుకుంది. అంతర్జాతీయ బిడ్డింగ్‌కు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. చివరగా పర్యావరణ మంత్రిత్వశాఖ నుంచి అనుమతులు కూడా రావడంతో ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమం అయినట్లు తెలుస్తోంది.

సింధూ జలాల ఒప్పందం ప్రకారం.. పశ్చిమదిశగా పాకిస్థాన్ వైపు ప్రవహించే సింధూతోపాటు చీనాబ్, జీలం వంటి ప్రధాన ఉప నదులపై భారత్‌కు పరిమిత అధికారాలు ఉన్నాయి. దీంతో భారీ స్థాయిలో నీరు నిల్వ చేసే అవకాశం లేకుండా పోయింది. ఏదైనా ప్రాజెక్టు ప్రారంభించాలన్నా.. పాకిస్థాన్‌కు ముందస్తు నోటీసు ఇవ్వాలి. తాజాగా ఆ ఒప్పందం నిలిచిపోవడంతో ఎటువంటి అనుమతులు, సమాచారం పంచుకోవడం అవసరం లేదు.

# ధర్మస్థల మిస్టరీ.. బయటపడిన అవశేషాలు

**మంగళూరు, జూలై 31 :** కర్ణాటకలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం 'ధర్మస్థల'లో అనుమానస్పద మరణాలపై మిస్టరీ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. శ్రీక్షేత్ర సమీపంలోని అటవీ ప్రాంతంలో కొన్ని శవాలను పూడ్చి పెట్టానని ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు చూపించిన ప్రదేశాల్లో తవ్వకాలు జరుపుతున్న సంగతి తెలిసిందే. ఇందులో ఓ చోట గురువారం కొన్ని అవశేషాలను గుర్తించారు. ఇప్పటివరకు ఈ కేసులో బయటపడిన తొలి ఆధారం ఇదే కావడం గమనార్హం.

పారిశుద్ధ్య కార్మికుడి ఫిర్యాదు నేపథ్యంలో ఈ అనుమానాస్పద మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గత సోమవారం నుంచి సిట్ అధికారులు.. అతడిని వెంట తీసుకెళ్లి దర్యాప్తు చేపట్టారు. నేత్రావతి నది స్నానఘట్టానికి అవతలి వైపు ఉన్న ప్రాంతం నుంచి పరిశోధన ప్రారంభించారు. మృతదేహాలను పూడ్చిపెట్టినట్లుగా మొత్తం 13 చోట్లను అతడు గుర్తించగా..



ఆ ప్రాంతాల్లో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం ఆరో ప్రాంతంలో మానవ అవశేషాలు బయటపడ్డాయి. వాటిని ఫోరెన్సిక్ బృందం సేకరించి ల్యాబ్‌కు పంపించింది. ల్యాబ్‌లో పరీక్షించిన తర్వాతే వాటి గురించి వివరాలు తెలుస్తాయని సిట్ అధికారులు చెబుతున్నారు.

దక్షిణ కన్నడ జిల్లాలో ధర్మస్థల ప్రముఖ శైవ క్షేత్రం. కర్ణాటక ప్రజలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచీ ఇక్కడికి భారీగా వస్తుంటారు. గతంలో అక్కడ పనిచేసి వెళ్లిపోయిన ఓ పారిశుద్ధ్య కార్మికుడు.. ఇటీవల సంచలన ఆరోపణలు చేశాడు. 1998 నుంచి 2014 మధ్య ఇక్కడ అనేక మంది మహిళలు, యువతులు హత్యకు గురయ్యారని.. వారి మృతదేహాలను తానే పూడ్చి పెట్టానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అవన్నీ అనుమానాస్పద రీతిలో అదృశ్యమైన వారివని, లైంగిక దాడులకు గురై చనిపోయినట్లు అనుమానాలున్నట్లు పేర్కొనడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. 2014 డిసెంబరులో తమ కుటుంబంలోని ఒక యువతిని కొందరు లైంగికంగా వేధిస్తుండడంతో తాము అజ్ఞాతంలోకి వెళ్లిపోయామని ఆ వ్యక్తి చెప్పినట్లు సమాచారం. మృతదేహాలను ఎవరు ఖననం చేయమన్నారు? వాటిని ఎవరి సహాయంతో తీసుకువెళ్లేవారు? తదితర ప్రశ్నలను సిట్ అధికారులు అడిగి అతడి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది.

## వరదల్లో కొట్టుకుపోయిన రూ.12 కోట్ల బంగారం.. వెతికేందుకు ఎగబడిన జనం

బీజింగ్, జూలై 31 : చైనాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చాలాచోట్ల మెరుపు వరదలు సంభవించాయి. షాంగ్జీ ప్రావిన్స్‌లో వరదల కారణంగా ఓ నగల దుకాణంలో నుంచి బంగారం, వెండి ఆభరణాలు కొట్టుకుపోయాయి. దీంతో వాటిని వెతికేందుకు వీధుల్లో స్థానికులు పోటీపడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

షాంగ్జీ ప్రావిన్స్‌లోని వుచి కౌంటీలో జులై 25న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతం సముద్రతీరానికి సమీపంలో ఉంటుంది. ఇక్కడ స్థానికంగా ఉన్న లావోఫెంగ్జియాంగ్ ఆభరణాల దుకాణాన్ని ఎప్పటిలాగే ఉదయం సిబ్బంది తెరిచారు. అప్పటికే భారీ వర్షాలతో ఆ ప్రాంతమంతా జలమయమైంది. చూస్తుండగానే వరద నీరు



దుకాణంలోకి చొచ్చుకొచ్చింది. వరద ఉద్ధృతి పెరగడంతో కళ్లముందే దుకాణంలోని నగలు, సేఫ్ బాక్స్ కొట్టుకుపోయాయి.

కొట్టుకుపోయిన వాటిల్లో బంగారు హారాలు, గాజులు, ఉంగరాలు, చెవి దుద్దులు, వజ్రపు ఉంగరాలు, వెండి ఆభరణాలు ఉన్నట్లు దుకాణ యజమాని తెలిపారు. సేఫ్ బాక్సులో రీసైకిల్ చేసిన బంగారంతో పాటు భారీగా నగదు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20 కిలోల బంగారం, నగదు గల్లంతైనట్లు తెలిపారు. వీటి విలువ 10 మిలియన్ యువాన్లు (అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.12కోట్ల పైమాటే) ఉంటుందని వెల్లడించారు.

బంగారం కొట్టుకుపోయిన విషయం తెలియగానే స్థానికులు పెద్దఎత్తున వీధుల్లోకి చేరి బంగారం కోసం వెతకడం ప్రారంభించారు. కొందరు స్వచ్ఛందంగా తమకు దొరికిన ఆభరణాలను వెనక్కి ఇచ్చేశారని దుకాణ యజమాని తెలిపారు. ఇప్పటివరకు కేజీ బంగారం తమ వద్దకు చేరిందన్నారు. రోజులు గడుస్తున్నా మిగతా బంగారం కోసం స్థానికులు వెతుకుతూనే ఉన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అయ్యాయి.

## ట్రంప్ ఒత్తిడికి భారత్ లొంగకూడదు: శశిథరూర్

**ఢిల్లీ, జూలై 31 :** భారత దిగుమతులపై 25శాతం సుంకంతో పాటు అదనంగా జరిమానాలు విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ స్పందించారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్న తరుణంలో ఇలాంటి ప్రకటన సరికాదన్నారు. గురువారం పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత వాణిజ్యానికి అమెరికా అతి పెద్ద మార్కెట్. మన ఎగుమతులే 87-90 బిలియన్ డాలర్ల వరకు ఉంటాయి. రష్యా నుంచి దిగుమతులు చేస్తున్నందుకు సుంకాలు, జరిమానా విధిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య



చర్చల్లో బేరసారాల కోసం ఇది హెచ్చరిక కావొచ్చు. టారీఫ్‌ల నేపథ్యంలో ఎగుమతులు తగ్గితే అది మనకు నష్టం కలుగుతుంది. ఇది మన జీడీపీపై కూడా ప్రభావం చూపించొచ్చు. అమెరికా డిమాండ్లు పూర్తిగా అర్థం లేనివిగా ఉన్నాయి. వాటిని ప్రతిఘటించే హక్కు భారత్‌కు ఉంది. వారిని సంతోషపెట్టడానికి మన జీవనోపాధిని పణంగా పెట్టలేం. మన అవసరాలను కూడా అగ్రరాజ్యం అర్థం చేసుకోవాలి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ టారిఫ్‌ల విషయంలో మన దేశ విధానంపై నమ్మకం ఉందని థరూర్ పేర్కొన్నారు. తర్వాత ఎం జరుగుతుందనేది కొనసాగుతున్న చర్చలపై ఆధారపడి ఉంటుందన్నారు. అమెరికా ఒత్తిడికి లొంగిపోకుండా.. న్యూఢిల్లీ జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

## స్టాలిన్‌తో మార్నింగ్ వాక్..

### ఎన్డీయేకు పన్నీర్ సెల్వం గుడ్‌బై

**చెన్నై, జూలై 31 :** తమిళ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం ఎన్డీయే నుంచి వైదొలగారు. ఈ మేరకు మాజీ మంత్రి, సెల్వంకు నమ్మినబంటు రామచంద్రన్ ప్రకటించారు. ఆయన ప్రకటిస్తున్న సమయంలో సెల్వం కూడా అక్కడే ఉన్నారు. మార్నింగ్ వాక్ సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను పన్నీర్ సెల్వం కలిశారు. పలు విషయాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎన్డీయే నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించడం గమనార్హం. ఎన్డీయే కూటమితో పూర్తిగా సంబంధాలు తెంచుకున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పన్నీర్ సెల్వం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. పొత్తుల గురించి ఇప్పుడు ప్రస్తావించాల్సిన సమయం కాదని, ఎన్నికల ముంగిట ఆ అంశం గురించి మాట్లాడతామని అన్నారు. మరోవైపు ఇటీవల సినీనటుడు విజయ్ ప్రారంభించిన తమిళ వెట్రి కళగ (టీవీకే)తో ఓపీఎస్ చేతులు కలిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పన్నీర్ సెల్వాన్ని విలేకరులు పొత్తుల అంశం గురించి ప్రస్తావించగా.. కాలమే చెబుతుంది అంటూ.. సమాధానం దాటవేశారు. పన్నీర్ సెల్వం ఒకానొక సమయంలో ఏఐఏడీఎంకేలో కీలకంగా వ్యవహరించారు. ఎన్డీయే కూటమిలోనూ ముఖ్యపాత్ర పోషించారు. అయితే, పార్టీలో ఏర్పడిన అంతర్గత కలహాలతో బహిష్కరణకు గురైన ఆయన.. సొంతంగా తన వర్గాన్ని విస్తరించుకున్నారు. తాజాగా ఎన్డీయే నుంచి కూడా బయటకు రావడం.. 2026 అసెంబ్లీ ఎన్నికల ముంగిట తమిళ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

## అండమాన్ నికోబార్‌లో తొలిసారి 'ఈడీ' సోదాలు!

**పోర్ట్ బ్లెయిర్, జూలై 31 :** ఓ మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అండమాన్ నికోబార్ దీవుల్లో సోదాలు నిర్వహించారు. ఈ దీవుల్లో ఈడీ తనిఖీలు చేపట్టడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఓ సహకార బ్యాంకు రుణాల వ్యవహారంలో అవకతవకలకు పాల్పడినట్లు స్థానిక కాంగ్రెస్ మాజీ ఎంపీ కుల్దీప్‌రాయ్ శర్మ తదితరులపై ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు పోర్ట్ బ్లెయిర్ పరిసరాల్లోని తొమ్మిది ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. కోల్‌కతాలోనూ తనిఖీలు కొనసాగాయి. అండమాన్ నికోబార్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకు (ఏఎన్ఎస్సీబీ) ద్వారా రుణాలు, ఓవర్‌డ్రాఫ్ట్ మంజూరులో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు 15 షెల్ సంస్థలు సృష్టించి.. బ్యాంకు నుంచి రూ.200 కోట్లకుపైగా రుణాలను మోసపూరితంగా తీసుకున్నారని అధికారులు వెల్లడించారు. ఈ రుణాల్లో చాలావరకు నగదు రూపంలో ఉపసంహరించుకుని.. గతంలో బ్యాంకు వైస్ ఛైర్మన్‌గా పనిచేసిన కుల్దీప్ రాయ్ శర్మకు, ఇతరులకు ముట్టజెప్పినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఈ నెల 18న శర్మను అరెస్టు చేశారు. ఈ నెల 29న కోర్టు ఆయన్ను మూడు రోజుల పోలీసు కస్టడీకి పంపింది.



మనం Manam



# నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

- చదువుతోనే అభివద్ధి సాధ్యము అవుతుంది
- స్కిల్ యూనివర్సిటీలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం
- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి





నల్లగొండు జులై 31( మనం ప్రతినిధి): మంచివిద్యనందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి అన్నారు.గురువారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో 40 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ చదువుతోనే అభివద్ధి సాధ్యమని, అందువల్ల విద్యార్థులు బాగా చదువుకోవాలని అన్నారు. ప్రస్తుతం మహిళా ప్రాంగణంలో నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాలలో రెండు రోజుల్లో తాగునీటి ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ,నెల రోజుల్లో ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో బాత్రూంలు, ఇతర సౌకర్యాలన్నీ కల్పిస్తామని తెలిపారు. కేరళలో 99.9% అక్షరాస్యత ఉండగా, మన రాష్ట్రంలో 60 శాతం ఉందని , విద్య, నైపుణ్యాలు పెంపొందింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీతో పాటు, అన్ని రకాల విద్యా సదుపాయాలు కల్పిస్తున్నదని అన్నారు. నర్సింగ్ విద్యార్థులు చదువు పైన దష్టి సారించాలని, సెల్ ఫోన్ జోలికి వెళ్ళవద్దని, ప్రజలకు మంచి సేవలు అందించాలని, సమయాన్ని వధా చేసుకోవద్దని అన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ నెల 4 న ప్రభుత్వ వైద్య కళాశాల పక్కనే 150 కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాటశాల పనులకు భూమి పూజ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. అనంతరం మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యపై ప్రత్యేక దష్టి కేంద్రీకరించిందని, ముఖ్యంగా 20 వేల కోట్ల రూపాయలతో రాష్ట్ర వ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మించనున్నదని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో 100 కోట్ల రూపాయలతో భవనాలు నిర్మించామని, ఫ్యాకల్టీ, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎల్ఎల్ఎం, ఎం ఫార్మసీ, కోర్సులు,భవనాలు మంజూరు చేశారని ,2026-27 సంవత్సరంలో అడ్మిషన్లు సైతం ప్రారంభం కానున్నాయని, లా, ఫార్మసీకి మంచి డిమాండ్ ఉందని అన్నారు.

గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో విద్యాభివద్ధికి ఎలాంటి కషి చేయలేదని అంతేకాక గత ప్రభుత్వం తొమ్మిది వేల కోట్ల రూపాయల ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలు పెట్టినప్పటికీ గత ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రతినెల 6000 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నప్పటికీ మంచి విద్యను అందించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దష్టికి కేంద్రీకరించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నర్సింగ్ కోర్స్ చాలా ఉత్తమమైనదని, వైద్యరంగంలో నర్సింగ్ అనేది మొదటి అడుగు అని అన్నారు. రోగులు ముందుగా స్టాఫ్ నర్స్ ని సంప్రదిస్తారని, డాక్టర్ కన్నా స్టాఫ్ నర్స్ ముఖ్యమని, రోగి ప్రాణాలు కాపాడటంలో స్టాఫ్ నర్స్ పాత్ర ఎంతో ఉంటుందని అన్నారు. భవిష్యత్తులో మెడికల్ టూరిజం లో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, అందువల్ల నర్సింగ్ విద్యార్థులు బాగా చదువుకోవాలని ,ప్రస్తుతం నిర్మించనున్న నర్సింగ్ కళాశాల భవనంలో స్టాఫ్ క్వార్టర్స్ ను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ఆర్ డి ఓ వై.అశోక్ రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి తదితరులు ఉన్నారు.

## భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు మొక్కలను నాటాలి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

వర్షాకాలం పూర్తయ్యే లోపు మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తి చేయాలి

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి





నలగొండ - జులై 31 (మనం ప్రతినిధి): భవిష్యత్తు తరాల బాగును దష్టిలో ఉంచుకొని వనమెత్సవం కింద ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. వనమెత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని నల్గొండ ఆర్డీవో కార్యాలయంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటడం తప్పనిసరి అని, రానున్న తరాలు కాలుష్యం బారిన పడకుండా ఉండేందుకు చెట్లే ఆధారమని, అందువల్ల ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని చెప్పారు. వనమెత్సవం కింద జిల్లాకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని, ప్రత్యేకించి ఆయా శాఖలు వాటి కేటాయించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు .వర్షాకాలం పూర్తయ్యేలోపే మొక్కలు నాటడం పూర్తిచేయాలని, ఇందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని చెప్పారు.అనంతరం మంత్రి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నల్గొండ మండలం, వెలుగు పల్లి గ్రామానికి చెందిన రిషికేశ్ పిడుగుపాటుకు మరణించగా వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రెండు లక్షల రూపాయల చెక్కును అందజేశారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ,నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, తదితరులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జానకీ నగర్‌లో రేషన్ కార్డుల పంపిణీ



పంపిణీ చేస్తున్న నాయకులు

చిలుకూరు, జులై 31 (మనం న్యూస్): మండల పరిధిలోని జానకి నగర్ గ్రామంలో 26 మంది లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందిచారు. రేషన్ కార్డు రాని వారు ఎలాంటి నిరాశ చెందవద్దని ఇది నిరంతర ప్రక్రియ అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పకుండా ఈ రేషన్ కార్డు అందేలా చూస్తామని గ్రామ శాఖ అధ్యక్షులు భ్రమరా చారి పెర్కోన్నారు ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భట్టు అమనాయక్ , ఎస్టీ సెల్ అధ్యక్షులు భార్మావత్ రాజేష్ , మాజీ ఉపసర్పంచ్ భట్టు శ్యామ్ , యూత్ ప్రెసిడెంట్ బానోతు అనిల్ నాయక్ , గ్రామ రేషన్ కార్డులబ్దిదారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇష్టంతో లక్ష్యం వైపు పయనించాలి

- యువ వికాస్ కోఆర్డినేటర్ పూర్ణ శశికాంత్



తుంగతుర్తి: జూలై 31, (మనం న్యూస్): విద్యార్థుల పాఠశాలలో క్రమశిక్షణతో ఇష్టంతో చదువుతూ లక్ష్యం వైపు పయనించినప్పుడే ఉన్నతమైన అవకాశాలు లభిస్తాయని యువ వికాస్ కోఆర్డినేటర్ పూర్ణ శశికాంత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల బాలుర పాఠశాలలో తుంగతుర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పాఠశాలలో క్రమశిక్షణతో మెలిగి, కష్టపడి చదివి, తను ఎంచుకున్న లక్ష్యం వైపు పయనించారని కోరారు. విద్యార్థుల చదువు కోసం తమ తల్లిదండ్రులు పడే కష్టాలను, గొప్పగా పాటను తెలియపరచి, జరిగిన సంఘటనలు గొప్పగా వర్ణించారు. ప్రతి విద్యార్థి పదవ తరగతి పరీక్షల్లో 95 శాతం ఉత్తీర్ణత సాధిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం లయన్స్ క్లబ్ సభ్యులు కోఆర్డినేటర్ లక్ష్మీకాంత్ పాఠశాల ప్రధానోపాధ్యా యులు ప్రవీణ్ కుమార్, పి ఈ టి యాకయ్యలను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట లయన్స్ క్లబ్ జెడ్ సి లక్ష్మారెడ్డి ఆర్ సి సంతోష్ తుంగతుర్తి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు తల్లాడ కేదారి కోశాధికారి గుండగాని రాము, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు ఓరుగంటి శ్రీనివాస్, కేతిరెడ్డి రవీందర్ రెడ్డి, యాదగిరి గౌడ్,, గుమ్మడవెల్లి సోమన్న, ఓరుగంటి సుభాష్, వంగాల వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

## నీటిని విడుదల చేయాలని రైతుల ధర్నా

రైతుల ధర్నాకు మద్దతు పలికిన బీఆర్ఎస్, సీపీఎం నాయకులు



నల్గొండ- జిల్లా 31 (మనం న్యూస్ ): తిప్పర్తి మండల కేంద్రంలో డి 40, డి 39 కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని తిప్పర్తి మండల కేంద్రంలో గురువారం రైతులు రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ జిల్లా నాయకులు కందుల లక్ష్మయ్య, మాజీ జెడ్పిటిసి తండు సైదులు గౌడ్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ నుండి 26 గేట్ల ద్వారా నీళ్లు పోతున్నప్పటికీ, జిల్లా మంత్రులు, శాసనసభ్యులు కనీసం అవగాహన లేకుండా నల్లగొండ జిల్లాను పెడుతున్నారు. ఉదయ సముద్రం 1.5 టిఎంసి పూర్తిస్థాయిలో నింపి ఆయకట్టు పరిధిలోని అన్ని చెరువుల నింపి, రైతులకు పంటల కోసం నీరు అందించాలని డిమాండ్ చేశారు, అధికారులు వారాబంది పేరుతో ఐటిపాముల కాలువకు వారం రోజులు నీళ్లు వదులుతున్నారు. కానీ తిప్పర్తి మండలం లోని డి 40,డి 39 కాల్వకు వారబంది అమలు చేయడం లేదు. ఎందుకంటే మాకు వదిలినప్పుడు ఐటిపాముల కాలువ సగం పోతున్నది మరియు గేట్లు పైకి ఎత్తడం లేదు, అధికారులు, అధికార పార్టీ నాయకులు ఫోటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప పూర్తిస్థాయిలో చివరి ఆయకట్టు వరకు నీరు పోవడానికి కావలసినటువంటి ప్రణాళికలు చేయడం లేదు ,ఇప్పటికైనా అధికారులు కాలువ వెంట తిరిగి అన్ని చెరువులను నింపే విధంగా ప్రయత్నం చేయాలని అన్నారు.తిప్పర్తి మండలాన్ని ఎండబెట్టి తన సొంత గ్రామమైన బి వెల్లంల ప్రాజెక్టుకునీళ్ళు తీసుకుపోవడం అంటే తిప్పర్తి మండల ప్రజలని అవమానించడం తప్ప ఇంకొకటి కాదు, నకిరేకల్ శాసనసభ్యులు తన ప్రాంతంలోని చెరువులు నింపుకోవడం కోసం పనిచేసినప్పుడు మరి నల్లగొండ శాసనసభ్యులు మంత్రి తనకు ఓటు వేసిన తిప్పర్తి మండల ప్రజానీకం పైన ఎందుకు వివక్ష చూపుతున్నాడో ప్రజలకు వివరించాలని అన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు కళ్ళు తెరిచి రాజకీయాలు పక్కన పెట్టి తిప్పర్తి మండలం లోని చెరువుల నింపే విధంగా అధికారుల పైన స్థానిక మంత్రిపైనా ఒత్తిడి తీసుకొచ్చి ప్రజానీకాన్ని ఆదుకోవాలని కోరారు . ఆదివారం వరకు మాకు పూర్తిస్థాయిలో కాలువలు వదలక పోతే సోమవారం నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం రైతులతో కలిసి ముట్టడిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మన్నెం బిక్షం, రైతులు గుండెబోయిన రామచంద్ర, గుండెబోయిన సైదులు, రొట్టెల జానయ్య, దేవి రెడ్డి లింగారెడ్డి, చింతకుంట్ల దయాకర్ రెడ్డి, నూకల ప్రవీణ్, రావుల సందీప్, నూకల రాజీవ్, బైరగోని శ్రీను జాకటి బాలయ్య, కట్ట కిట్టు, గుండు రవి, జానీ పాషా, కస్పరాజు వెంకన్న, రొట్టెల సైదులు, మర్రి వెంకన్న, దేవిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

## అంకిత భావంతో డీపీఆర్ఓ రమేష్ కృషి

- సమాచార శాఖ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలలోకి తీసుకపోవటంలో డి పి ఆర్ ఓ లదే కీలకపాత్ర
- 4 %ష్ట్ర% ఎస్టేట్ గా పత్రిక రంగం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ లి





సూర్యాపేట జూలై 31 (మనం ప్రతినిధి) డి పి ఆర్ ఓ గా విధులు నిర్వహించిన రమేష్ కుమార్ అంకిత భావంతో పని చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి సమాచారం ప్రజలకి చేరే విధంగా విధులు నిర్వహించారని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. గురువారం కలెక్టరెట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డి పి ఆర్ ఓ పదవి విరమణ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అధికారులు మంచి బందంగా ఏర్పడి జిల్లాను అభివద్ధి పథంలో ముందుకు తీసుకెలెందుకు కషి చేస్తున్నారని పేర్కొన్నారు.డి పి ఆర్ ఓ గా విధులు నిర్వహించిన రమేష్ జిల్లాలో మంత్రుల కార్యక్రమాలు ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులని సమన్వయం చేసుకుంటూ విజయవంతంగా నిర్వహించారని తెలిపారు.బయట తినుబండారాలు తినకుండా ఇంటి ఆహారం మాత్రమే తీసుకొని ఆరోగ్యంపై చాలా శ్రద్ద తీసుకునేవారని తెలిపారు.తదుపరి జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాక్షించారు. సమాచార శాఖ 4 వ ఎస్టేట్ గా అడ్వాన్స్ టెక్నాలజి ని ఉపయోగించుకుంటు సమాజానికి దిశ నిర్దేశం చేయాలని సూచించారు.అదనపు కలెక్టర్ పి రాంబాబు మాట్లాడుతూ డి పి ఆర్ ఓ గా జిల్లాలో చాలా సమర్థవంతంగా విధులు నిర్వహించారని మంత్రుల కార్యక్రమాలు, ముఖ్యమైన సమావేశాలు రాత్రి ఆలస్యం అయినా మీడియా మిత్రులను సమన్వయము చేసుకుంటూ అన్ని పేపర్ లో వచ్చే విధంగా కషి చేసేవారని తెలిపారు. గత 30 సంవత్సరాలుగా ఐ %ఉ పి ఆర్ శాఖ లో వివిధ దాలో విధులు నిర్వహించెందుకు కుటుంబ సభ్యుల సహకారం ఏంతో ఉందని తదుపరి ఆయురారోగ్యలతో ఉండాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అన్నారు. అనంతరం పదవి విరమణ పొందిన డి పి ఆర్ ఓ రమేష్ కుమార్ మాట్లాడుతూ... 1996 జనవరి 19 న ఐ %ఉ పి ఆర్ శాఖ విధుల్లో చేరినానని కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, భూపాలపల్లి, వివిధ దాలలో విధులు నిర్వహించి సూర్యాపేట కి 5 సెప్టెంబర్ 2022 న అదనపు పౌర సంబంధాల అధికారిగా విధుల్లో చేరినారని 18 కలెక్టర్ ల వద్ద పని చేసానని ఇంత మంచిగా జిల్లా అభివద్ధి కోసం పని చేస్తున్న యువ కలెక్టర్ ని ఎక్కడ చూడలేదని అలాగే జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ రామ లక్ష్మణుల సమన్వయము చేసుకుంటూ ముందుకు వెళ్తున్నారని అలాగే జిల్లా అధికారులు కుడా మంచిగా పని చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమం లో డి ఎఫ్ ఓ సతీష్ కుమార్, సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం



మోడల్ స్కూల్ చిత్రం

సంస్థాన్ నారాయణపురం, జులై 31, మనం న్యూస్: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్లో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు మరియు ఇంటర్మీడియట్ లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఆగస్టు 1 నుండి 10 వ తారీకు వరకు స్పాట్ అడ్మిషన్లు తీసుకోనున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె దీప్ జోష్ ఓ ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్ లో చేరాలనుకునే విద్యార్థులు టి సి, స్టడీ సర్టిఫికెట్లతో విద్యార్థులు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాల కొరకు 9666658876, 9553836107 కు సంప్రదించాలని కోరారు.

## నీట్ పీజీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



సూర్యాపేట జూలై 31 (మనం ప్రతినిధి) నీట్ పీజీ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు పూర్తి చేయాలని. జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నీట్ పరీక్షల నిర్వహణ పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ... జిల్లాలో ఆగస్టు 3వ తేదీన ఉదయం 9 గంటలు నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగనున్న పరీక్షకు రెండు కేంద్రాలు శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల అమరావతి నగర్, కోదాడలో సన ఇంజినీరింగ్ కళాశాలలో నీట్ పిజి పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల అమరావతి నగర్ లో 180, కోదాడలో సన ఇంజినీరింగ్ కళాశాలలో 50 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులను నిశిత తనిఖీ తదుపరి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. ఉదయం 7 గంటల నుండి 8.30 వరకు అనుమతి ఇస్తారని ఆ తదుపరి అనుమతి ఉండదన్నారు. విద్యుత్ అతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు.పరీక్షా కేంద్రాల్లో అత్యవసర వైద్య సేవలతో పాటు ఓ ఆర్ ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచాలని అన్నారు. అత్యవసర సేవలకు గాను అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. అభ్యర్థులకు మంచినీరు అందించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో వ్యర్థాలు లేకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి సూచించారు.నీట్ పి.జి. ప్రవేశ పరీక్ష నిర్వహణలో భాగంగా అభ్యర్థులు, సిబ్బంది పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్, టాబ్స్ , బ్లూటూత్, స్మార్ట్ వాచ్, ఇయర్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అనుమతి లేదని, షూస్, బెల్ట్, ఆభరణాలు ధరించవద్దని తెలిపారు.ఫుల్ హ్యాండ్ షర్ట్స్ ధరించి రావొద్దని సూచించారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కు అవకాశం లేకుండా పకడ్బందీగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

సీసీటీవీ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసి పరీక్షను క్షుణ్ణంగా పర్యవేక్షించాలని అన్నారు.8.30 గంటలకు పరీక్ష కేంద్రం గేట్ మూసివేస్తామని, గేటు మూసిన తర్వాత ఎవ్వరిని లోపలికి అనుమతించరని, అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. పరిక్షా కేంద్రాల సమీపంలో 163 సెక్షన్ అమల్లో ఉంటుందని, సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసేయ్యాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఎస్పీ రవీందర్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ ఈ విద్యా భాస్కర్, జిల్లా వైద్యాధికారి పి చంద్రశేఖర్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎన్ జయలత, పరీక్ష కేంద్రాల ప్రిన్సిపాల్ లు ఆర్టీసీ డిఎం లక్ష్మీనారాయణ, సూర్యాపేట తహసిల్దార్ సిహెచ్ కష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలందించాలి

- వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగి ముఖ్యుడే
- మానవతా దృక్పథంతో పనిచేయాలి
- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క





**ములుగు, జూలై 31(మనం ప్రతినిధి):** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క వైద్యాధికాలకు సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి సీజనల్ వ్యాధుల పై వైద్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రివెన్షన్ బెటర్ దెన్ క్యూర్ అనే నినాదానికి బద్ధులై పనిచేయాలని, వైద్యుడుగా కనిపించే దేవుళ్ళని వైద్య శాఖకు తెలుపుతూ, వర్షాకాలంలో వచ్చే మలేరియా డెంగ్యూ అతి సార టైఫాడ్లపై చికిత్స తో పాటు గ్రామాలలో గ్రామ పెద్దలు యువకుల సమూహంతో అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని, అప్పుడే ప్రజలు వ్యాధి నియంత్రణ పట్ల చైతన్యవంతులు అవుతారని తెలిపారు. దట్టమైన అడవి ప్రాంతాలు, రోడ్డు సౌకర్యం లేని గ్రామాలలో ఉదయాన్నే గ్రామాలకు వైద్య సిబ్బంది చేరి ఇంటింటి సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్సను అందించి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలని వైద్య సిబ్బందిని సూచించారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వారికి పరీక్షలు, మందులు సకాలంలో అందించాలని అన్నారు. రాబోయే రెండు నెలలు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి రోగి ముఖ్యుడే అని, మానవతా దృక్పథంతో పనిచేయాలని, రోగుల పట్ల ప్రేమ వాత్సల్యంతో వైద్యం అందిస్తే ప్రజలలో వైద్యుల పేర్లు చిరకాల నిలుస్తుందని, వైద్య సిబ్బంది సమయాన్ని పాటించాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ములుగు వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య సేవలను అందించాలని జనరల్ హాస్పిటల్ ములుగు అధికారులను సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం లో వచ్చే వ్యాధులను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఆరోగ్య కేంద్రానికి ముందస్తుగానే నిధులను మంజూరు చేశామని గత సంవత్సర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ముందస్తుగానే వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై పటిష్టమైన ప్రణాళికలను తయారుచేసుకొని చివరి సర్వే, ఆంటీ లార్వా చర్యలను, నిర్వహిస్తున్నామని హైరిస్కు గ్రామాలను ముందస్తుగానే గుర్తించి ఆ గ్రామాలలో దోమల నియంత్రణకై యాంటీ లార్వా స్ప్రే మరియు ఫాగింగ్ లాంటి చర్యలు తీసుకున్నామని దానితోపాటు ప్రతి గ్రామం లో ఇప్పటి వరకే రెండు పర్యాయాలు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించామని ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, ఆశ్రమ స్కూల్లో కూడా వైద్య శిబిరాలను నిర్వహించి విద్యార్థులకు వైద్య చికిత్సలను అందించటంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పోషకాహార ప్రాముఖ్యత మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ములుగు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ స్వర్ణ కుమారి, ఏటూరునాగారం డి సి హెచ్ డాక్టర్ జగదీష్, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ విపిన్ కుమార్, డాక్టర్ క్రాంతి, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ చంద్రకాంత్, డాక్టర్ రణధీర్, డాక్టర్ పవన్ కుమార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు జనరల్ హాస్పిటల్ వివిధ విభాగాల అధికారులు మెడికల్ కాలేజ్ వివిధ విభాగాల ప్రొఫెసర్, డెమో సంపత్, ఆర్ బి ఎస్ కే టీం వైద్యాధికారులు ఎం సి హెచ్ టీం వైద్యాధికారులు, మిడ్ లేవల్ హెల్త్ ప్రొవైడర్స్, తదితరులు పాల్గొన్నారు.

## పట్టదారుల వివరాలు పారదర్శకంగా..




- రెండు రోజుల్లో రిపోర్ట్ అందించాలి..
- రాష్ట్ర సిసిఎల్ఎ..కమిషనర్ లోకేష్ కుమార్ సర్వే సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు.

**ములుగు, జూలై 31(మనం ప్రతినిధి):** రీ సర్వే చేసిన పట్టాదారుల వివరాలు.. పహానీలోని వివరాలపై పారదర్శకంగా ఎంక్వయిరీ చేయాలని రాష్ట్ర సిసిఎల్ఎ కమిషనర్ లోకేష్ కుమార్, సర్వే సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు లు ఆయా జిల్లా కలెక్టర్ లను ను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుండి సిసిఎల్ఎ, సర్వే సెటిల్మెంట్ కమిషనర్ లోకేష్ కుమార్, రాష్ట్ర స్థాయిలో పైలట్ ప్రాజెక్ట్ (రీ-సర్వే) లో ఎపికైన ఖమ్మం, సంగారెడ్డి, జగిత్యాల, మహబూబ్ నగర్, ములుగు జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిసిఎల్ఎ, సర్వే సెటిల్మెంట్ కమిషనర్ లోకేష్ కుమార్ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన ఖమ్మం, సంగారెడ్డి, జగిత్యాల, మహబూబ్ నగర్, ములుగు జిల్లా లలోని ఒకొక్క గ్రామం వారిగా డ్రోన్ రీ సర్వే వివరాలను, ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా లోకేష్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అధికారులకు పలు, సూచనలు సలహాలు అందజేశారు. మిగిలి ఉన్న భూ రీ సర్వే నంబర్లకు సర్వే సిబ్బందికి పంపించి సర్వే పూర్తి చేసి, సర్వే చేసిన పట్టదారుల వివరాలు, పహాని లోని వివరాలు ఎంక్వైరీ చేసి 2 రోజులలో రిపోర్ట్ పంపించాలని కలెక్టర్లను కోరారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ. సర్వే సిబ్బందికి ఫీల్ వెళ్ళి విచారణ జరిపి రిపోర్టు సమర్పించాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి అధికారులు పూర్తి పారదర్శకంగా.. చట్టం ప్రకారం.. నిబంధనల మేరకు వ్యవహరించాలని కమిషనర్ పేర్కొన్నారు. లఈ వీడియో సమావేశంలో ఆర్డీఓ వెంకటేష్, వెంకటాపురం తహసిల్దార్ వేణు గోపాల్, పాల్గొన్నారు.

## సోమేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే యశస్విని ప్రత్యేక పూజలు



**పాలకుర్తి, జూలై 31(మనం న్యూస్):** శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గురువారం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆలయంలో స్వామి వార్లను దర్శించుకుని అభిషేకాలు అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,ఝాన్సీ రెడ్డిలకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని పాడి పంటలు సమృద్ధిగా పండాలని, రాష్ట్ర నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యంతో ఉండాలని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని,ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ ,మండల పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి,ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు జలగం కుమార్, ఆలయ మాజీ చైర్మన్ చిలువేరు కృష్ణమూర్తి యాదవ్, బిర్రు సోమేశ్వర్, మాదాస్ హరీష్ గౌడ్,తదితరులు ఉన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**పరకాల, జూలై 31(మనం న్యూస్):** పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలం నాగారం గ్రామానికి చెందిన మాచబోయిన ఓదేమ్మ కు వీల్ చైర్ ను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి గురువారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. శారీరక లోపాలను అధిగమించి నేడు దివ్యాంగుల సైతం అన్ని రంగాల్లో దూసుకొని వెళ్తున్నారని తెలిపారు. ఆత్మవిశ్వాసానికి ప్రతీక దివ్యంగులని అన్నారు. నియోజకవర్గంలోని దివ్యాంగుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కట్యారి దేవేందర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్ కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ రాజేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు యూత్ నాయకులు పాల్గొన్నారు.

## పాపన్న గౌడ్ జయంత్యుత్సవాలను జయప్రదం చేయాలి



**తొర్రూరు, జూలై 31 (మనం న్యూస్):** ఆగస్టు 10న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి ఉత్సవాలు జయప్రదం చేయాలని గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాచరికాన్ని ఎదిరించి స్వేచ్ఛ కోసం గోల్కొండ ను ఆక్రమించి ఉద్యమించిన మహనీయుడు ప్రజలకు స్వేచ్ఛ కోసం బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన వ్యక్తి పాపన్న గౌడ అని అన్నారు. జై గౌడ ఉద్యమ జాతి అధ్యక్షులు వట్టికూటి రామారావు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి గౌడ మిత్రులు, గౌడ సంఘ నాయకులు, ప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గోపా డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్ గౌడ్, గోపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిమ్మల వెంకన్న గౌడ్, చీకర్ శ్రీనివాస్ గౌడ్, జీపీస్పీఎస్ అధ్యక్షుడు దీకొండ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు



**రాయపర్తి, జూలై 31(మనం న్యూస్):** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని టిపిసిసి మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో 20 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇండ్ల భూమి పూజా కార్యక్రమం పట్టణ అధ్యక్షులు మచ్చ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథులుగా మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, ఆకుల సురేందర్ రావు గురువారం పాల్గొని భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నారని, పేదల పక్షపాతి ప్రజా ప్రభుత్వం మని, నిరుపేదలకు సొంతింటి కల ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యమని , ఎవరైనా ఇండ్లు మంజూరు కాకపోతే ఆందోళన చెందవలసిన అవసరం లేదని అర్హులందరికీ ప్రజా ప్రభుత్వంలో తప్పక ఇండ్లు మంజూరు చేస్తుందని, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మచ్చ నీలయ్య, మాచర్ల ప్రభాకర్, ఎండి మహమ్మద్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అఫ్రోజ్ ఖాన్, మాజీ ఎంపీటీసీ గుగులోత్ స్వప్న విజయ్, ఎండి నయీమ్, ఎండీ. ఉస్మాన్,వనజ రాణి, ఎండీ. రఫీ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



- ఎమ్మెల్యే మురళి నాయక్..

**కే సముద్రం, జూలై 31(మనం న్యూస్):** గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ అన్నారు. మండలంలోని తాళ్లపూస పల్లి గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో మంజూరైన రూ.10 లక్షల వ్యయంతో నూతన సిసి రోడ్డు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక్కరు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రజా ప్రభుత్వంలో ప్రజల నిర్ణయాలకే అధిక ప్రాధాన్యత ,అన్ని రకాలుగా గ్రామాలను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యం అన్నారు. నిర్ణీత కాలంలో నిర్మాణ పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నరేటీ కొమురయ్య గౌడ్,ఉపాధ్యక్షులు బండారి సత్తయ్య,కార్యదర్శి శీలం యాకన్న గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు రాచర్ల రాములు , పెటెరి వెంకన్న, కాలేరు వెంకన్న మాజీ సర్పంచ్ కందుకూరి దాసు, రవి ,నాగన్న స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'సమాచార హక్కు చట్టం ప్రజల ప్రాథమిక హక్కు'

- ప్రజలకు ప్రభుత్వానికి జవాబుదారీ తనంగా అధికారులు ఉండాలి
- సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సులో ప్రధాన కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 31 (మనంప్రతినిధి):** సమాచార హక్కు ప్రజల ప్రాథమిక హక్కు అని, ప్రజల హక్కును కాపాడటానికి అధికారులు ప్రజలకు ప్రభుత్వానికి జవాబు దారితనంగా వారధిలా నిలువాలని సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) అమలు పరిస్థితిని సమీక్షించేందుకు రాష్ట్ర ప్రధాన కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి, సహ కమిషనర్లు దేశాల భూపాల్, పి.వి. శ్రీనివాస్ రావు గురువారం జిల్లాకు విచ్చేశారు. .జిల్లాలో సమాచార హక్కు చట్టం కమిషనర్ల పర్యటన నేపథ్యంలో ఐడిఓసి కార్యాలయం సమావేశం మందిరం లో ఆర్.టి.ఐ యాక్ట్ అమలు చేయు విధివిధానాలపై క్షుణ్ణంగా పౌర సమాచార అధికారులకు చట్టనిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర ముఖ్య పౌర సమాచార కమిషనర్ బో రెడ్డి అయోధ్య రెడ్డి, ఇతర కమిషనర్లు పి.వి శ్రీనివాసరావు, దేశాల భూపాల్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా అయోధ్య రెడ్డి మాట్లాడుతూ ఆర్టిఐ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన మొదటిసారిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రావడం జరిగిందని సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సు ఏర్పాటు చేయడానికి జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులు చూపించిన చొరవ హర్షించదగ్గ విషయమని అన్నారు. సమాచార హక్కు చట్టం 136 దేశాల్లో అమలు అవుతుందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆర్టిఐ సమర్థవంతంగా అమలవుతుందన్నారు. సమాచార హక్కు చట్టంపై పౌర సమాచార అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, అవినీతి నిర్మూలన లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చింది అన్నారు.గత పది సంవత్సరాల కాలంలో సమాచార కమిషనర్ అందుబాటులో ఉంచకపోవడం వల్ల రాష్ట్రంలో 18 వేల కేసులు సమాచార హక్కు చట్టం కమిషనర్ దగ్గర పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. సరైన కారణాలు చూపించకుండా ఆర్టిఐ యాక్ట్ ద్వారా చేసుకున్న దరఖాస్తులను తిరస్కరించకూడదని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. సమాచార హక్కు చట్టం అందుబాటులో ఉంది కాబట్టి అధికారులందరూ బాధ్యతగా తీసుకొని త్వరితగతిన తగిన సమాచారం ప్రజలకు అందించాలన్నారు.సమాచార హక్కు చట్టం పై పౌర సమాచార అధికారులకు అవగాహన పెంపొందించే విధంగా రాష్ట్రంలో 11 జిల్లాలు ఎంపిక చేసుకుని చట్టంలోని సెక్షన్ల పై పూర్తి అవగాహన కల్పిస్తున్నామన్నారు.

దీని ద్వారా ఆర్టిఐ కేసులను త్వరితగతిన పరిష్కరించవచ్చు అన్నారు. అధికారులందరూ ప్రజలకి తగిన సమాచారం అందించేందుకు ముందుకు రావాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాల్లో 17 శాఖల్లో వచ్చే మార్చి లోపు అన్ని కేసులు పరిష్కార మార్గాలు చూపి సమాచారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని శాఖల అధికారులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించే విధంగా సమావేశాలు మరియు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి పరిస్థితుల్లో నైనా సమాచారం కావాలని దరఖాస్తు చేసుకున్నప్పుడు నిబంధనలకు లోబడి సమాచారం అందించే విధంగా అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నామని వివరించారు. ఈ అవగాహన సదస్సులో భాగంగా పౌరసరఫరాల అధికారులకు సమాచార హక్కు చట్టంపై ఉన్న సందేహాలను కమిషనర్లు నివృత్తి చేశారు.

జిల్లాకు మొదటి సారిగా విచ్చేసిన సమాచార హక్కు కమిషనర్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శాలువా, మెమొంటోతో సత్కరించారు. జిల్లాకు విచ్చేసిన కమిషనర్లకు ముందుగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా ట్రైనింగ్ కలెక్టర్ సౌరబ్ శర్మ పూల మొక్కలు ఇచ్చి ఆహ్వానం పలికారు. అనంతరం ప్రధాన కమిషనర్ బోరేటి అయోధ్య రెడ్డి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఐ డి ఓ సి కార్యాలయం ప్రాంగణంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా కమిషనర్లు మొక్కలు నాటారు. ఈ అవగాహన సదస్సులో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జెడ్పి సీఈవో నాగలక్ష్మి, ఆర్డీవోలు మధు, దామోదర్, అన్ని శాఖల పౌర సమాచార అధికారులు పాల్గొన్నారు.

## పశువులను రోడ్లపై వదిలితే చర్యలు

- ఎస్సై పవన్ కుమార్



**మహాదేవపూర్, జూలై 31(మనం న్యూస్):** పశువులను రోడ్లపై వదిలితే కఠిన చర్యలు తప్పవని మహాదేవపూర్ ఎస్త్రై పవన్ కుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని పశువుల యజమానులు తమ పశువులను ఇంటి వద్ద కట్టివేయకుండా వదలడం తో రాత్రి వేళలో రోడ్ల మీద చేరుకొవడం తో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారని ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. మండల కేంద్రం లో ని జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలతో సాగుతుంటాయని ఈ క్రమంలో వాహనాల క్రింద పడి పశువులు మృతి చెంది నష్టం వాటిల్లే అవకాశా లు ఉన్నాయని ఎస్త్రై వివరించారు. మండల పరిషత్ కార్యాలయంలో నోటీసు ఇచ్చామని పశువులు రోడ్లపై రాకుండా యజమానులు తగు జాగ్రత్త లు తీసుకోవాలని సూచించారు. లేకుంటే గ్రామపంచాయతీ పోలీస్ సమన్వయంతో పశువుల యజమానులకు జరిమానా విధించడమే కాకుండా పశువులను గోశాలకు తరలించడం జరుగుతుందని ఎస్త్రై తెలిపారు.ఈ సమావేశం లో రెండవ ఎస్త్రై శశాంక్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అది ఫైనల్ అయినా సరే.. బహిష్కరించే వాళ్లమే: ఇండియా ఛాంపియన్స్!

పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌తో ఏ స్థాయిలోనూ క్రికెట్ ఆడకూడదని టీమ్‌ఇండియా మాజీలు గట్టిగా చెప్పారు. అయితే, వరల్డ్ ఛాంపియన్ షిప్ లెజెండ్స్ టోర్నీలో పాక్‌తో రెండు మ్యాచుల్లో



తలపడే పరిస్థితి ఎదురైంది. ఒకటి లీగ్ స్టేజ్ లో కాగా.. రెండోది సెమీస్. ఇండియా ఛాంపియన్స్ మాత్రం నిస్సంకోచంగా పాక్‌తో మ్యాచ్‌లను రద్దు చేసుకుంది. భారత్ సెమీస్ ను బహిష్కరించడంతో పాక్ ఫైనల్ కు చేరుకుంది. ఈక్రమంలో తాము ఒకవేళ టైటిల్ పోరుకు అర్హత సాధించి అక్కడా పాక్ ప్రత్యర్థిగా వచ్చినా ఇదే నిర్ణయం తీసుకొనేవాళ్లమని ఇండియా ఛాంపియన్స్ ప్లేయర్లు పేర్కొన్నారు. ''మేం పాకిస్థాన్ తో ఆడటం లేదు. మాకు ఎప్పుడైనా సరే దేశం ముఖ్యం. నేషన్ కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకొనేందుకు సంకోచించం. భారత జట్టు సభ్యులుగా మేం ఎప్పుడూ గర్వపడుతూనే ఉంటాం. ఎలాంటి పరిస్థితుల్లోనూ మా దేశాన్ని ఎప్పటికీ నిరాశపరచం. మేం సెమీస్ కు చేరుకున్న తర్వాత మ్యాచ్ ను రద్దు చేసుకున్నాం. ఒకవేళ ఫైనల్ కు చేరి అక్కడా పాక్ ప్రత్యర్థిగా ఎదురైనా సరే ఇదే నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. మేమంతా ఒకే మాటపై నిలబడతాం'' అని ఇండియా ఛాంపియన్స్ ఆటగాడొకరు తెలిపారు.

## 2028 ఒలింపిక్స్.. పాక్ క్రికెట్ జట్టుకు భారీ ఎదురుదెబ్బ



128 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఒలింపిక్స్ లోకి క్రికెట్ పునఃప్రవేశించనుంది. 2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ తో జెంటిల్మెన్ గేమ్ విశ్వక్రీడల్లోకి పునరాగమనం చేయనుంది. ఒలింపిక్స్ లో క్రికెట్ కు చివరి మరియు ఏకైక ప్రాతినిధ్యం 1900 పారిస్ ఒలింపిక్స్ లో దక్కింది.

నాడు గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్ మాత్రమే పోటీలో పాల్గొన్నాయి. అప్పుడు ఇరు జట్ల మధ్య ఓ అనధికారిక టెస్ట్ మ్యాచ్ జరగగా.. అందులో గ్రేట్ బ్రిటన్ ఫ్రాన్స్ ను కేవలం రెండు రోజుల్లోనే ఓడించి స్వర్ణ పతకం కైవసం చేసుకుంది.

కాగా, రాబోయే ఒలింపిక్స్ లో పాల్గొనే జట్లపై ఐసీసీ తాజాగా ఓ కంక్లూజన్ కు వచ్చినట్లు తెలుస్తుంది. రీజియన్ల వారీగా టాప్ ర్యాంక్ జట్లను ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఈ లెక్కన ఆసియా నుంచి భారత్, ఓషియానియా నుంచి ఆస్ట్రేలియా, ఆఫ్రికా నుంచి దక్షిణాఫ్రికా, యూరప్ నుంచి ఇంగ్లండ్, ఆతిథ్య దేశంగా అమెరికా క్వాలిఫై అయ్యే అవకాశముంది. ఆరో జట్టు ఎంపికపై క్లారిటీ లేదు. ఇదే జరిగితే పాకిస్థాన్, న్యూజిలాండ్, వెస్టిండీస్ జట్ల ఒలింపిక్స్ కల కలగానే మిగిలిపోయే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే, ఒలింపిక్స్ లో క్రికెట్ పోటీలు 2028 జులై 12 (ఒలింపిక్స్ ప్రారంభానికి రెండు రోజుల ముందు) నుంచి 29 వరకు జరుగనున్నాయి. అన్ని మ్యాచ్ లు లాస్ ఏంజెలెస్ కు 50 కిమీ దూరంలో ఉన్న పమోనాలోని ఫెయిర్ ప్లెక్స్ లో ప్రత్యేకంగా నిర్మించబడే 500 ఎకరాల తాత్కాలిక స్టేడియంలో జరుగుతాయి.

రాబోయే ఒలింపిక్స్ లో క్రికెట్ టీ20 ఫార్మాట్ లో జరుగనుంది. పురుషులు, మహిళల విభాగాల్లో మొత్తం ఆరు అంతర్జాతీయ జట్లు విశ్వవేదికపై పోటీ పడతాయి. గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ కోసం పోటీ జరుగుతుంది. మెడల్స్ మ్యాచ్ లు (సెమీఫైనల్స్ మరియు బ్రాంజ్, గోల్ మెడల్స్ మ్యాచ్ లు) జులై 20 (మహిళలు), 29 (పురుషులు) తేదీల్లో జరుగుతాయి.

జులై 14, 21 తేదీల్లో ఎలాంటి క్రికెట్ మ్యాచ్ లు లేవు. మ్యాచ్ జరిగిన ప్రతి రోజు రెండు మ్యాచ్ లు ఉంటాయి. ఈ మ్యాచ్ లు భారతకాలమానం ప్రకారం రాత్రి 9:30 గంటలకు, ఉదయం 7 గంటలకు మొదలవుతాయి.

## నంబర్ వన్ పదిలం



భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు. ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్టులో అజేయ సెంచరీతో అదరగొట్టిన జడేజా.. ఐసీసీ టెస్టు ఆల్ రౌండర్ల జాబితాలో నంబర్ వన్ ర్యాంకును నిలబెట్టుకున్నాడు. మరో సెంచరీ హీరో వాషింగ్టన్ సుందర్ 8 స్థానాలు మెరుగై 13వ ర్యాంకు సాధించాడు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్ లో రిషబ్ పంత్ 7, యశస్వి జైశ్వాల్ 8, శుభ్ మన్ గిల్ 9వ స్థానాల్లో కొనసాగుతున్నారు. బౌలింగ్ లో జస్ ప్రీత్ బుమ్రా నంబర్ వన్ ర్యాంకును నిలబెట్టుకున్నాడు. రవీంద్ర జడేజా 14వ స్థానంలో ఉన్నాడు. టీ20 బ్యాటింగ్ లో అభిషేక్ శర్మ తన కెరీర్ లో తొలిసారిగా నంబర్ వన్ ర్యాంకు సాధించాడు. ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా) ఒక ర్యాంకు కోల్పోయి రెండో స్థానానికి పడిపోయాడు. తిలక్ వర్మ 3, సూర్యకుమార్ యాదవ్ 6, యశస్వి జైశ్వాల్ 11వ స్థానాల్లో ఉన్నారు.

## వార్-2 నుంచి ఇంప్రెసివ్‌గా ఫస్ట్ సింగిల్!



బాలీవుడ్ స్టార్ నటుడు హృతిక్ రోషన్ టాలీవుడ్ నుంచి మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ల కలయికలో దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా యాక్షన్ చిత్రమే వార్ 2. మంచి హైప్ ఉన్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఎట్టకేలకి మొదటి పాటని విడుదల చేశారు. హృతిక్, కియారా లపై సాగే ఈ సాంగ్ ని నేడు కియారా బర్త్ డే ట్రీట్ గా విడుదల చేశారు. అయితే ఇది తన ఫ్యాన్స్ కి నిజంగానే ట్రీట్ అని చెప్పాలి. సాంగ్ వినేందుకు ఇంపుగా క్లీన్ మెలోడీ బీట్స్ తో ఉంటే హృతిక్, కియారాల కెమిస్ట్రీ కూడా సినిమాలో చాలా బాగా కనిపిస్తుంది. ఇక దీనితో పాటుగా మధ్యలో కియారా డామినేషన్ మాత్రం అదిరింది అని చెప్పాల్సిందే. ఆ మధ్య టీజర్ లో కియారా ఎలా అయితే ఒక స్ట్రైజ్ ప్యాక్ గా నిలిచిందో అలానే ఈ సాంగ్ లో కూడా తన హాట్ షోతో అలరించింది అని చెప్పవచ్చు. మొత్తానికి మాత్రం వార్ 2 ఫ్యాన్స్ కి మంచి ట్రీట్ ని మేకర్స్ ఇపుడు వదిలారు.

## కష్ట కాలంలో నా వెంటే ఉన్నారాయన: సాయి దుర్గాతేజ్



కష్టకాలంలో దర్శకుడు దేవా కట్టా తన వెన్నంటే ఉన్నారని నటుడు సాయి దుర్గా తేజ్ అన్నారు. గురువారం నిర్వహించిన 'మయసభ' ట్రైలర్ విడుదల వేడుకలో దేవాతో ఉన్న అనుబంధాన్ని తేజ్ గుర్తుచేసుకున్నారు. ''దేవా కట్టాతో నాకు పదేళ్లుగా పరిచయం ఉంది. ఆయన తెరకెక్కించిన 'ఆటోనగర్ సూర్య' సినిమా నాపై ప్రభావం చూపింది. అప్పట్లో.. ఆ మూవీ టీజర్ చూసిన వెంటనే ఆయనకు ఫోన్ చేసి నన్ను నేను పరిచయం చేసుకున్నా. తర్వాత జిమ్ లో కలుసుకునేవాళ్లం. నాతో సినిమా చేయమని విజ్ఞప్తి చేసేవాడిని. అలా 2021లో మా కాంబినేషన్ లో 'రిపబ్లిక్' వచ్చింది. నా జీవితాన్ని మార్చేసిన ఘటన అదే సమయంలో జరిగింది (రోడ్డు ప్రమాదాన్ని ఉద్దేశించి). ఆ కష్టకాలంలో నా వెన్నంటే ఉన్న వ్యక్తి ఆయన. నేను కోరుకున్నట్టుగానే 'రిపబ్లిక్' క్లైమాక్స్ క్రియేట్ చేశారు. 'మయసభ' గురించి దేవా గతంలోనే చెప్పారు. నేను నటిస్తానంటే.. ఆడిషన్ ఇవ్వమన్నారు (నవ్వులు)''

''ఆది పినిశెట్టి నేను కలిసి డ్యాన్స్, కిక్ బాక్సింగ్ వంటివి ప్రాక్టీస్ చేసేవాళ్లం. నా లైఫ్ లో ఓ విలన్ ఉన్నాడు. అతడెవరో కాదు చైతన్యరావు. అతడు నటించిన '30 వెడ్స్ 21' వెబ్ సిరీస్ చూసిన మా అమ్మ నా పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చింది. 'ఆ అబ్బాయి పెళ్లి చేసుకున్నాడు. నువ్వెందుకు చేసుకోవురా' అని అడిగింది. 'కంగారు పడకండి చేసుకుంటా అని చెప్పా'' సరదాగా పేర్కొన్నారు. ఆది పినిశెట్టి, చైతన్య రావు ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'మయసభ'. దేవా కట్టా, కిరణ్ జయ్ కుమార్ దర్శకత్వం వహించారు. ఇద్దరు స్నేహితులు.. రాజకీయ ప్రత్యర్థులుగా ఎలా మారారన్నది క్లుప్తంగా ఈ సినిమా కథాంశం. ఈ మూవీ నేరుగా ఓటీటీ 'సోనీలివ్' లో ఆగస్టు 7న విడుదల కానుంది. ఈ సినిమాని మూడు భాగాలుగా ప్లాన్ చేసినట్టు దేవా కట్టా తెలిపారు.

## మృణాల్‌కు స్వీట్ సర్‌ప్రైజ్



'సీతారామం'తో తెలుగు ప్రేక్షకులను విశేషంగా అలరించిన నటి మృణాల్ ఠాకూర్. అప్పటి నుంచి టాలీవుడ్ వారికి ఫేవరెట్ హీరోయిన్ గా మారిపోయింది. వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆమె ప్రస్తుతం అడివి శేష్ సరసన 'డెకాయిట్'లో నటిస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ టీమ్ ఆమెకు ఓ స్వీట్ సర్ ప్రైజ్ ఇచ్చింది. ఆగస్టు 1న మృణాల్ పుట్టినరోజు కావడంతో ఆమెకు ఈ మూవీ సెట్ లో ప్రీబర్త్డే సెలబ్రేషన్స్ చేశారు. ఆమెకు తెలియకుండా కేక్ తీసుకొచ్చి టీమ్ సభ్యులంతా తలుపు కొట్టి సర్ ప్రైజ్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ గా మారింది. కేక్ కట్ చేసిన మృణాల్ టీమ్ తో కలిసి డ్యాన్స్ చేశారు. 'హ్యాపీ బర్త్డే సరస్వతి' అంటూ అందరూ విష్ చేయడంతో ఈ సినిమాలో ఆమె పాత్ర పేరు సరస్వతి అని తెలుస్తోంది.

షానీల్ డియో దర్శకత్వంలో 'డెకాయిట్... ఒక ప్రేమకథ' పేరుతో రానున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. వైవిధ్యమైన కథతో రూపొందుతున్న ఈ సినిమాలో బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంతో ఆయన టాలీవుడ్ కు ఎంట్రీ ఇస్తుండడం విశేషం. డిసెంబర్ 25న ఈ సినిమా విడుదల కానుంది.

## బాలయ్య, క్రిష్ ప్రాజెక్ట్‌పై ఇంట్రెస్టింగ్ టాక్!



నటసింహం నందమూరి బాలకృష్ణ హీరోగా ఇపుడు చేస్తున్న భారీ చిత్రం అఖండ 2 తాండవం కోసం అందరికీ తెలిసిందే. అయితే ఈ సినిమా తర్వాత బాలయ్య సాలిడ్ లైనప్ తో సిద్ధంగా ఉండగా ఈ చిత్రాల్లో విలక్షణ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి కలయికలో మూడోసారి వర్క్ చేయనున్నారు అనే టాక్ కూడా వచ్చింది.

అయితే క్రిష్ తో గౌతమి పుత్ర శాతకర్ణి, ఎన్టీఆర్ బయోపిక్ తర్వాత హ్యాట్రిక్ సినిమా కోసం రెడి అవుతున్నారట. మరి ఈ సినిమా కోసం బాలయ్య మరోసారి డ్యూయల్ రోల్ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. బాలయ్య ఇపుడు వరకు ఎన్నో సినిమాలలో డ్యూయల్ రోల్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ రెండు పాత్రల్లో అలరించనున్నారట. మరి దీనిపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.

## ఓజీ ఫస్ట్ బ్లాస్ట్‌కు డేట్ ఫిక్స్.. ఫైర్ స్టార్మ్ వచ్చేస్తుంది..!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం ఓజి కోసం ప్రేక్షకులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు సుజిత్ డైరెక్ట్ చేస్తుండగా పూర్తి గ్యాంగ్ స్టర్ యాక్షన్ థ్రిల్లర్ గా ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేసేందుకు సిద్ధమవుతోంది. ఇక ఈ సినిమా నుంచి తాజాగా ఓ బ్లాస్టింగ్ అప్డేట్ అయితే మేకర్స్ ఇచ్చారు. ఓజి చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ సాంగ్ ను ఆగస్టు 2న రిలీజ్ చేస్తున్నట్లు వారు తాజాగా అనౌన్స్ చేశారు. పవన్ పవర్ ఫుల్ లుక్స్ తో డిజైన్ చేసిన ఈ అనౌన్స్ మెంట్ పోస్టర్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేస్తోంది. ఇక ఈ సినిమాలోని ఫస్ట్ బ్లాస్ట్ ఎలాంటి విధ్వంసం సృష్టిస్తుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాకు థమన్ సంగీతం మరో మేజర్ అట్రాక్షన్ కానుంది. ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి విలన్ పాత్రలో నటిస్తున్నాడు. డివివి ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై డివివి దానయ్య ప్రొడ్యూస్ చేస్తున్న ఓజి చిత్రాన్ని సెప్టెంబర్ 25న వరల్ వైడ్ రిలీజ్ కు రెడీ చేస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.